

# చిలక చెప్పిన రహస్యం

(జానపద కథ)



నండూరి రామమోహనరావు

VICTORY

విక్టరీ

# చిలక చెప్పిన రహస్యం

## (జానపద కథ)

నండూరి రామమోహనరావు

సాయి వెంకటేశ్వర బుక్ డిపో

డోర్. నెం. 26-27-77, బాటాషోరూమ్ ఎదురు, గాంధీనగర్,

విజయవాడ - 520 003. ఫోన్ : (0866) 2570192

VICTORY

# చిలక చెప్పిన రహస్యం

**(జానపద కథ)**

© Ln. **I. Ramakumar,** PMJF
Immadisetty Akkeswara Rao
Charitable Trust, Vijayawada.

1st Edition : 2012

**Price : Rs.50/-**

**Sole Distributors**

**SAI VENKATESWARA BOOK DEPOT**
# 26-27-77, Opp.Bata Showroom
Gandhinagar, VIJAYAWADA - 520003.
Ph : (0866) 2570192

**SAI VENKATESWARA BOOK DEPOT**
Plot No.3, 103, # 2-4-1085, Sai Lakshmi Niketan, Opp.
St. of Rama Krishna Hospital,
KACHIGUDA, NIMBOLIADDA, HYDERABAD - 27.
Ph : (040) 65528228, Fax. 24745257,
Cell : 9346771314.

***Published by : Sri Venkateswara Book Depot, Vijayawada***

**గమనిక**

మీకు కావలసిన మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపులలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచిలలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరి ముద్రణలో సరిచేయ గలం. ఏ విషయమైన ఈ క్రింది ఈ మెయిల్‌కు తెలియజేయవచ్చును.

**ramakumar immadisetty@yahoo.com**

మీకు కావలసిన పుస్తకాలకు
**SBI online A/c. No.
31712393082**
**సాయి వెంకటేశ్వర బుక్ డిపో,
విజయవాడ** పేరున జమచేసి,
మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు
వివరాలు తెలుపవలెను.

We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.

# చిలక చెప్పిన రహస్యం

## (జానపద కథ)

## 1

పూర్వకాలంలో ఉజ్జయినీ నగరాన్ని విక్రమసేనుడనే మహారాజు పరిపాలించేవాడు. ఆయనకి ఎంతకాలానికి పిల్లలు కలగలేదు. ఎన్ని వ్రతాలో, ఎన్ని తీర్థయాత్రలో చేశారు. లాభం లేకపోయింది. అందుకని రాజుగారు మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. అదేంఖర్మమోగాని రెండో భార్యకి కూడా పిల్లలు కలగలేదు. మళ్ళీ వ్రతాలూ, యాత్రలూ చేశారు. లాభం లేకపోయింది. సరే, రాజుగారు మూడోపెళ్ళి చేసుకున్నారు. ఈసారి అదృష్టదేవత కరుణించింది. మూడోభార్య గర్భవతి అయింది.

ఆ రోజున రాజుగారు ఊళ్ళోలేరు. నగరానికి దూరాన అడవిలో వేటాడుతున్నారు. సరిగా ఆనాడే రాత్రివేళ మూడోరాణికి మగపిల్లవాడు పుట్టాడు. అయితే, ఆమెకి సంతానం కలగటం పెద్ద రాణులిద్దరికీ కంట్లో

కారం చల్లినట్లయింది. అందుచేత వాళ్ళు పుట్టినపిల్లవాణ్ని చాలా జాగ్రత్తగా ఆలోచించి వేసిన పన్నాగం ప్రకారంగా పక్కలోనించి తప్పించి, చచ్చిపోయిన కుక్కపిల్లని పడుకోబెట్టారు. పిల్లవాణ్ని ఒక పెట్టెలో పడుకోబెట్టి కోట వెనకాల ప్రవహించే శిప్రానదిలో వదిలిపెట్టారు. ఆ పెట్టె కొంతదూరం పోయి ఎలాగూ మునిగిపోతుంది గదా అని వారు అనుకున్నారు. వారు చేసిన దుష్కార్యం చిన్నరాణికీ, దాసదాసీలకీ ఎవరికీ తెలియదు. అంత రహస్యంగా అంతా చేశారు. రాజుగారు మర్నాటి పొద్దున వేటనుంచి తిరిగి రాగానే చచ్చిపోయిన కుక్కపిల్లని 'ఇదే మీ సంతానం' అని చూపించారు. 'ఇదేమిటి మనిషికి జంతువు ఎక్కడన్నా పుడుతుందా' అని ఆయన సందేహించలేదు. 'ఏదో పాపం చేసి వుంటాను. అందుచేత నాకీశిక్ష దేవుడు విధించాడు' అని తల బాదుకుని దుఃఖించాడు.

మునిగిపోతుందని పెద్ద రాణులిద్దరూ అనుకున్న పెట్టె మునిగి పోకుండానే చాలా దూరం కొట్టుకుపోయింది. ఉజ్జయినికీ ఆమడదూరాన రాజుగారికి పళ్ళతోటలు కొన్నిఉన్నాయి. ఆ తోటలపై అధికారి ఒకడున్నాడు. అతని పేరు సుజన మిత్రుడు. అతనికీ రాజుగారికి మల్లేనే పిల్లా పీచూ లేరు. ఆ తోటల్లోనే ఒక తోటలో ఒక చిన్న ఇంటిలో కాపురం చేస్తున్నాడు. అతడు ఆ మర్నాడు పొద్దున శిప్రానది గట్టుమీద నిలుచుని ఉండగా నదిలో అలల మీద హంసలా తేలుతూ వస్తున్న పెట్టె కనిపించింది. ఏమిటా అని ఆశ్చర్యపోయి ఆ పెట్టెను ఒడ్డుకు లాగాడు. అందులో ముద్దులుమూటకడుతున్న చక్కటి పిల్లవాడు కనిపించాడు, ఆ బాలుణ్ణి తీసుకుపోయి తన భార్యకి చూపించాడు. పిల్లల కోసం తహతహలాడే

సుజన మిత్రుని భార్యకు ఆ బాలుణ్ణి చూడగానే బ్రహ్మానందమైనది. అంత చక్కని పిల్లడు అనుకోకుండా వచ్చి వళ్ళో పడటం తన అదృష్టమే అనుకుంది. 'నీ అదృష్టం కాదు, నా అదృష్టమే' అని సుజన మిత్రుడు ఆమెతో వాదించాడు. ఆమె ఒప్పుకోలేదు. చివరికి 'మనిద్దరి అదృష్టమూను' అని భార్యాభర్తలు రాజీ పడ్డారు.

మళ్ళీ అనుమానం వచ్చింది. కేవలం తమ అదృష్టం కాదనీ, దేవుడే ఈ పిల్లణ్ణి తమ దగ్గరికి పంపించి ఉంటాడనీ అనుకున్నారు. పిల్లల కోసం తాము చేసిన ప్రార్ధనలన్నిటినీ పోగుచేసి ముద్దచేసి, చక్కని బాలుడుగా మార్చి నదిలో వదిలి పెట్టి ఉంటాడు దేవుడు అని తలపోశారు, ఆ అమాయక దంపతులిద్దరూ. ఈ తలపు రాగానే వారికిద్దరికీ ఒకేసారి ఆలోచన వచ్చింది. ఆ పిల్లడికి దేవదత్తుడనే పేరు పెట్టాలని అప్పటినుంచీ వాణ్ణి దేవదత్తుడనే పిలవసాగారు.

నాలుగేళ్ళు అలాగ గడిచిపోయాయి. మళ్ళీ మూడోరాణి గర్భవతి అయింది. ఈసారి కుక్కపిల్లా, నక్కపిల్లా పుట్టకుండా చెయ్యమని ఆమె ఐదారుగురు దేవుళ్ళని ప్రార్థించింది. కాని ఆమె మీద పగబట్టిన పెద్ద రాణులు ఆమె ప్రార్ధనలను చెల్లనిస్తారా? తమకు పుట్టని పిల్లలు చిన్నరాణికి ఎందుకు పుట్టాలని వారి కోపం. అందుకని ఈసారి కూడా శిశువు పుట్టీపుట్టగానే పెట్టెలో పెట్టి నదిలో పారేసి మళ్ళీ చచ్చిపోయిన కుక్కపిల్లను పక్కలో పడుకోబెట్టారు. రాజుగారు మహదానందంతో పురిటి గదిలోకి రాగానే 'ఇదిగో మీ చిన్నారి బిడ్డ' అని చూపించారు. రాజుగారు మంచి వాడేగాని తెలివైనవాడు కాదు. నిజమే ననుకున్నాడు. మళ్ళీ కడివెడు

కన్నీళ్ళు కార్చాడు. మూడోరాణి మీద ఆయనకి ఎంత ప్రేమ ఉన్నా, ఇలాగ తేపతేపకూ ఆమె జంతువుల్ని కని తన మొహాన పారెయ్యటం అంత బాగా లేదనుకున్నాడు. కోపంతో నిప్పులు తొక్కినట్టు చిందులు తొక్కాడు. 'ఇక నీ ముఖం చూడను' అని ప్రతిజ్ఞ చేసి ఆమెని కసితీరా తిట్టి చీకటి చెరసాలలో ఖైదు చేశాడు. పీడ విరగడైపోయిందని పెద్ద రాణులు కిసుక్కున నవ్వుకున్నారు.

రెండోసారి పుట్టిన శిశువు ఆడపిల్ల, ఆ పిల్ల పెట్టెలో పడుకుని కార్‌కార్‌మని ఏడుస్తూ నదిలో తేలుతూ రావటం, అప్పుడే నీళ్ళ కోసం బిందె నెత్తుకుని వచ్చిన సుజన మిత్రుని భార్య చూసింది. ఆశ్చర్యపడి భర్తను కేక వేసింది. అతడు గబగబ నీళ్ళలో దిగి పెట్టెను ఒడ్డుకు లాక్కొచ్చాడు. తీరా చూస్తే అందాలు చిందే పసిపాప, ఇద్దరూ మొదటిసారి పొందినంత ఆశ్చర్యమూ, ఆనందమూ పొందారు. ఇలా నాలుగేళ్ళ కొకసారి పసిపాపల్ని నదిలో వదిలిపెట్టి తమకే దొరికేట్టు చెయ్యటం దేవుడికి అలవాటు కాబోలనుకుని సమాధానపడ్డారు. ఆడపిల్ల లేదే అని బెంగపడుతున్న ఆ దంపతులు ఆ పసిపిల్లను ఇంటికి తీసుకుపోయి గారాబంగా పెంచుకోసాగారు. చంద్రబింబంలాంటి ఆపిల్ల అందాలనే వెన్నెలలను వెదజల్లటం చూసి ముద్దుగా చంద్రావతి అని పేరు పెట్టుకున్నారు.

ఇద్దరు పిల్లలూ పెరిగి పెద్దవారవుతున్నారు. అందచందాలతో పాటు తెలివితేటలు వృద్ధి అవుతున్నాయి. సుజనమిత్రుడు తోటలమీద పేరుకి అధికారే గాని రాబడి అట్టే లేదు. ఆ వచ్చే దానిలోనే సరిపెట్టుకుని పిల్లలకు

చక్కని దుస్తులు కుట్టించేవాడు. ఒక గురువుని నియమించి ఇద్దరికీ చదువు చెప్పించాడు. పిల్లలు కుశాగ్రబుద్ధులు కావడం వల్ల వారికి త్వరగా చదువు వంటపట్టింది. రాజుగారి సైన్యంలో సుజన మిత్రునికి తెలిసిన ఒక సైనికుడున్నాడు. అతన్ని బతిమాలుకుని దేవదత్తునికి కత్తిసాము, విలువిద్య, గుర్రపుస్వారీ, ఈత మొదలైన వ్యాయామవిద్యలన్నీ నేర్పించాడు. దేవాలయంలో నృత్యం చేసే ఒక దేవదాసీని ఇంటికి పిలిపించి చంద్రావతికి నృత్యం, సంగీతం నేర్పించాడు.

దేవదత్తుడు ఇరవై ఏళ్ళు వచ్చేసరికి సకల విద్యలలోనూ ఆరితేరిన వాడయ్యాడు. అంత చిన్నవయసుకే అతడు ఆజానుబాహువుగా తయారయ్యాడు. నిత్యమూ వ్యాయామం చేయటంవల్ల మనిషి మోటు తేలాడు, వచ్చీ రాని మీసాలను మెలిపెట్టి నడుముకు కత్తి తగిలించి, తల ఠీవిగా పైకెత్తుకుని సింహపు కొదమలా నడుస్తుంటే ఎంత పేద దుస్తులు కట్టుకున్నా అతనిలో రాచకళ భాసించేది. పుట్టింది రాచపుట్టుక కదా! ఆ ఠీవి ఎక్కడికి పోతుంది? అతన్ని పెంచి పెద్ద చేసిన సుజనమిత్రుడూ అతని భార్యా కూడా దేవదత్తుని హుందాతనమూ, పౌరుషమూ, గాంభీర్యమూ చూసి ఆశ్చర్యపడేవారు, ఇతడెవరా, ఏ తల్లికి పుట్టినవాడా అని.

చంద్రావతి పదహారేళ్ళు వచ్చేసరికి పూర్ణిమనాటి చంద్రబింబంలాగ, సరస్సులో పొద్దున్నే విచ్చిన తెల్లని తామర పువ్వులాగ ప్రకాశించింది. శిప్రానదిలో నీళ్ళు ముంచుకోటానికి కడవ, చంకనపెట్టుకుని వచ్చినప్పుడూ, తనకిష్టమైన మొక్కలకి నీళ్ళు పోస్తూ తోటలో చెట్లమధ్య

తిరుగుతున్నప్పుడూ, మేఘగర్జన విని పురివిప్పుకుని నాట్యం చేసే నెమలిలా పూలమొక్కల మధ్య ఒంటరిగా నృత్యం చేస్తున్నప్పుడు, ఇంట్లో కిటికీ దగ్గరిగా కూర్చుని వీణవాయిస్తూ ఏదో రాగం ఆలపిస్తూన్నప్పుడు ఆమె మానవరూపం దాల్చిన వనదేవతలాగా, మారువేషంలో నేలకు దిగిన గంధర్వకన్యలా అనిపించేది. ఎంత నిరుపేద దుస్తులు ధరిస్తేనేం, ఆమె పుట్టింది రాచగదిలో గదా! అందమైన అమ్మాయికి ఏదైనా అందమేనని మహాకవి రాయలా?

దేవదత్తుడూ, చంద్రావతి తమ్ము పెంచిన సుజన మిత్రుడే తమతండ్రి అనీ, అతని భార్యే తమతల్లి అనీ అనుకున్నారు. నిజానికి వారి తల్లిదండ్రులెవరైందీ సుజన మిత్రుడికీ, అతని భార్యకూ కూడా తెలియదు. తెలియనప్పుడు 'మేము మీ అసలు తల్లిదండ్రులము కాము' అని వారికి చెప్పి ప్రయోజన మేముంది? ఊరికే వారిని క్షోభ పెట్టినట్లవుతుంది. అందుచేతే వారికి అసలు విషయం చెప్పలేదు. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయిన తరువాత, తమ నెత్తిమీద మృత్యువు వృద్ధాప్యం వేషంలో వచ్చి కూర్చున్న తరువాత, ఏదో ఒక రోజున చెబుదాంలే అని అనుకున్నారు. కాని ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చారు. చూస్తూ చూస్తూ సంతోషంగా ఉన్న ఇద్దరు చిన్నవాళ్ళ మనస్సులకు దుఃఖపంకం అంటించలేక పోయారు. అయినా తెగించి చెప్పేద్దామనుకుంటున్న రోజుల్లో సుజన మిత్రుడు ముందు, అతని భార్య వెనకా రెండు మూడు నెలల తేడాతో హరీమన్నారు.

## 2

తమనిద్దర్నీ పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు చెప్పించిన దంపతులు చనిపోగానే అన్నా, చెల్లెళ్ళకు ఏంచేయాలో తోచలేదు. సుజనమిత్రుడు ఎప్పుడూ వీళ్ళ సంగతే ఆలోచిస్తూ ఉండేవాడు. తన తరవాత వీళ్ళగతి ఏమవుతుందా అని. తను కూడబెట్టిన డబ్బు చిల్లిగవ్వలేదు. దేవదత్తుడు మగవాడు, యువకుడు కనుక ఏదో ఏలాగో పొట్టపోసు కోగలడు. మరి చంద్రావతి ఏమవుతుంది? మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యాలని అనుకునేవాడు. కాని ఆ బాధ్యత తీర్చకుండానే చనిపోయాడు. ఇప్పుడు నిజంగానే దేవదత్తుడికి జీవనసమస్య గడ్డుగా తయారయింది. కొన్ని రోజుల్లోనే వారు ఏ పూటకాపూట గడవని దుస్థితికి వచ్చారు. ఏదో పనిచేసి జీవనం గడుపుకోవాలి. చెల్లెలికి ముందు పెళ్ళి చేయాలి. అనే నిశ్చయానికి వచ్చాడు దేవదత్తుడు. ఒకరోజున చెల్లెలుతో ఇలా అన్నాడు.

"చెల్లాయ్! చిన్నప్పటినుంచీ మనం ఈ తోటలో, ఈ పర్ణ కుటీరంలో హాయిగా పెరిగాము, తిరిగాము. రేపో ఎల్లుండో ఈ ఇంట్లోకి కొత్త అధికారి వస్తాడు. మనం దీన్ని ఖాళీ చేయాలి. ఖాళీ చేసి ఎక్కడికి పోవాలో తెలియటం లేదు. అందుకని ఒకటాలోచించాను. ఉజ్జయినీ మహారాజు విక్రమసేనుడు ఉదార స్వభావుడని విన్నాను. ఆయన దగ్గరికి పోయి

ఉద్యోగం ఇమ్మని అడుగుతాను. ఆయన లేదు పొమ్మంటే ఇంకోదేశం పోయి ఇంకో రాజుగార్ని అడుగుతాను. ఎక్కడో అక్కడ ఏదోపని సంపాదించుకోలేనా?"

చంద్రావతి "అలాగే వెళ్ళు అన్నయ్యా" అన్నది.

దేవదత్తుడు ఉన్నంతలో కాస్త మంచి దుస్తులు వేసుకున్నాడు. నడుము పటకాకు కత్తి తగిలించాడు. సరాసరి రాజుగారి కొలువుకు వెళ్ళాడు. ద్వారపాలకులు అతని దుస్తులు చూసి మొదట అడ్డగించారు. తరవాత అతని మాట తీరు, ముఖంలో కనబడే గొప్ప కళ, ఆజానుబాహు విగ్రహం చూసి మారు వేషంలో ఉన్న ఏ రాజకుమారుడో అనుకుని దారి ఇచ్చారు.

రాజుగారు సింహాసనంపై కూర్చుని మంత్రులతో ఏవో రాచకార్యాలు చర్చిస్తున్నారు. దేవదత్తుడు హుటాహుటి లోపలికి పోయి సింహాసనానికి ఎదురుగా మోకరించి లేచి నిలిచాడు. ఈ కొత్త యువకుణ్ణి చూసి రాజుగారు "ఎవరు నువ్వు? ఎందుకు వచ్చావు?" అని అడిగారు.

"నేను మీ తోటల అధికారి కుమారుణ్ణి. నా పేరు దేవదత్తుడు. మా తల్లీ తండ్రీ చనిపోయారు. మీకు తెలిసే ఉంటుంది" అని దేవదత్తుడు చెప్పాడు.

మహామంత్రి రణవర్మ కోపదారి మనిషి. కొత్తయువకుడి మీద అతనికి సుహృద్భావం కలగలేదు. దుస్తుల్ని బట్టి, వంశాన్ని బట్టి, అంతస్తును బట్టి మనుషులకు విలువకట్టే రకం. అందుచేత "అయితే ఏమంటావ్? నీకిక్కడేం పని? ఫో అవతలికి" అని తిరస్కారపూర్వకంగా గద్దించాడు.

మహామంత్రి కంటె రాజుగారే నయం. ఆయనకి దేవదత్తుని చూడగానే ఏదో చెప్పలేని ఆదరభావం కలిగింది. అక్కడక్కడ చిరిగిన నీర్కావి బట్టలలోంచి తొంగి చూసే దేవదత్తుని సహజ తేజస్సు, ముఖంలోని కళ ఆయన్ని ఆకర్షించాయి. అందుచేత సౌమ్యంగా,

"అలాగా నాయనా! నీకేం కావాలి?" అని అడిగాడు.

"మా తల్లిదండ్రులు పోవటంతో నాకు, నా చెల్లెలికీ జీవనాధారం ఏమీ లేకుండాపోయింది. పూట గడవటం కష్టంగా ఉంది. మీరేదైనా ఉద్యోగం ఇప్పిస్తారేమోనని వచ్చాను నేను వీరుణ్ణి, విద్యాధికుణ్ణి. భుజబలంతో గాని, మేధాబలంతో గాని చెయ్యదగిన ఏ పని ఇచ్చినా నేను చెయ్యగలను" అని దేవదత్తుడు వినయమూ, రాజసమూ రెండూ సమానంగా ధ్వనించే గొంతుకతో విన్నవించుకున్నాడు. నిరుపేదలాగ కనిపించే ఈ యువకునిలో ఈ ఠీవి, ఈ శౌర్యం, ఈ సౌందర్యం ఎక్కడివా అని సభాసదులంతా అతనికేసి వింతగా చూడసాగారు. అయితే నిరుపేద యువకునిలో ఆ ఠీవి, శౌర్యం, సౌందర్యం ఉండటం మహామంత్రి రణవర్మకి అట్టే సయించలేదు గావును, అవన్నీ ఉన్నట్టే గమనించని వాడిలాగ :

"ఇక్కడ నీకోసం ఉద్యోగాలేమీ కాసుకుని లేవు. ఫోఫో, ఇంకోచోటికి ఫో." అని తీవ్రంగా అన్నాడు.

"మహారాజా! నేను మనవి చేసుకుంటున్నది మీతోనే గాని మర్యాద తెలియని ఈ మనిషితో కాదని కాస్త చెబుతారా"? అని దేవదత్తుడు ప్రశాంతంగా అన్నాడు.

మహామంత్రి క్రోధంతో కళ్ళలోంచి నిప్పులు కురిపిస్తూ, ఆవేశంతో ఊగిసలాడిపోతూ "ఆ, ఎంత పొగరు? నేనెవరో తెలిసే మాట్లాడుతున్నావా?" అన్నాడు.

"మీకు మర్యాద తెలియదని ఇప్పుడే రాజుగారితో మనవి చేశాను. మర్యాద తెలియని మనిషి ఎవరైనదీ తెలుసుకోవలసిన అవసరం నాకు లేదు. రాజుగారికి అందరికంటే దగ్గిరలో కూర్చోటం బట్టి, మీరు మహామంత్రి అయివుంటారని నేను అనుకుంటున్నాను. కాని మహామంత్రి లక్షణాలు మీలో ఎంత వెదికినా కనుపించేటట్లు లేదు" అని జంకూ గొంకూ లేకుండా దేవదత్తుడు సమాధానమిచ్చాడు.

అతడలా అనగానే రణవర్మ ఉద్రిక్తుడై భటులను కేక వేసి అతన్ని అవతలకు లాక్కుపొమ్మని ఆజ్ఞాపించాడు. ముగ్గురు భటులు ముందుకు వచ్చారు. దేవదత్తుడు చరాలున కత్తిదూసి ఝుళిపిస్తూ,

"నేనిక్కడకు ఉద్యోగం కోసం వచ్చాను గాని దెబ్బలాడటానికి కాదు మహారాజా! నా చేత ఇవాళ వృథాగా కత్తి దూయించారు. మీరు పొమ్మంటే ఈ క్షణంలో నాదారిన నేను పోతాను. నన్ను అవమానపరిస్తే మాత్రం నేను సహించలేను. ప్రాణం పోయినా సరే నా గౌరవం నేను నిలబెట్టుకుంటాను" అన్నాడు.

ఇంతసేపూ రాజుగారు మహామంత్రికీ, దేవదత్తునికీ జరుగుతున్న వాగ్యుద్ధం చూస్తూ ఎవరిని మందలించటానికీ తోచక స్తబ్ధులా ఉండిపోయాడు. దేవదత్తుని ఆఖరుమాటలు విని ఆయన కాస్త లోలోపల

సిగ్గుపడి మహామంత్రిని ఊరుకోమని సైగ చేశాడు. భటులను వెనక్కి పొమ్మని ఆజ్ఞాపించాడు. దేవదత్తుడు కత్తి మళ్ళీ ఒరలో పెట్టేసుకున్న తరువాత ఆయన ఇలా అన్నాడు.

"మొన్నటిదాకా నీ తండ్రి మా తోటలపై అధికారిగా పనిచేశాడు. అతడు చాలా సంవత్సరాలు విశ్వాసంతో మమ్మల్ని సేవించాడు. ఇప్పుడతడు చనిపోయాడు. అందుచేత అతని కొడుకువైన నీకు అతని ఉద్యోగమే ఇవ్వటం నాకు కష్టమైన పనేమీ కాదు. అయితే, నీలాంటి ఉత్సాహవంతుడైన యువకునికి అలా మూల కూర్చుని చేసే ఉద్యోగం ఇవ్వటం నాకిష్టం లేదు" అని రాజుగారు సభాసదులందరివంకా చూశాడు. అందరూ అవునవును అన్నట్లు తలలాడించారు. ఒక్క రణవర్మ మాత్రం ముఖం ముడుచుకుని కూర్చున్నాడు. రాజుగారు అది గమనించకుండా మళ్ళీ ఇలా అన్నారు.

"నీ ఒరలోని దీర్ఘకరవాలం చూస్తే నువ్వు యోధుడులాగా ఉన్నావు. నీ ధైర్య సాహసాలను ఇప్పుడే కళ్లారా చూశాము కూడా. నీ బలపరాక్రమాలను కూడా కళ్ళారా చూస్తే మాకు నీమీద నమ్మకం కలుగుతుంది. కనుక ముందు నిన్ను పరీక్షిస్తాము. అంగీకారమేనా?"

దేవదత్తుడు తల ఠీవిగా పైకెత్తి "మహారాజా! నాకు కత్తిసాము ఆటలాంటిది. నేను చిన్నతనం నుంచీ కత్తులతోనే ఆడుకున్నాను. నన్ను మీ యిష్టం వచ్చినట్లు పరీక్షించుకోవచ్చు" అన్నాడు.

"అయితే విను. మా మహామంత్రి రణవర్మకు సరిగా నీ యీడువాడే ఒక కుమారుడు ఉన్నాడు. అడుగో ఆ చివరి కిటికీ దగ్గర గోడకానుకుని

నీకేసి చూస్తున్నాడే అతడే. అతని పేరు జయచంద్రుడు. కత్తి యుద్ధంలో తనకి సాటి ఈ చుట్టుప్రక్కల రాజ్యాల్లో ఎక్కడా ఎవరూ లేరనే కీర్తి సంపాదించుకున్నాడు. అతనితో నువ్వు పోరాడగలిగితే చూసి సంతోషిస్తాము," అని రాజుగారు జయచంద్రుణ్ణి దగ్గరకి పిలిచారు.

జయచంద్రుడు విలాసంగా అడుగులు వేసుకుంటూ సభామధ్యానికి వచ్చి రాజుగారికి ప్రణామం చేసి దేవదత్తుని వైపు తిరిగాడు. అతడూ దేవదత్తుని అంత పొడుగున్నాడు. అతనికంటె రెండుమూడేళ్ళు పెద్దవాడిలా కనిపిస్తాడు. కండలు తిరిగిన దృఢ శరీరమే అయినా సుఖజీవనానికి అలవాటు పడినవాడు కావటం వలన, చక్కని విలువైన బట్టలు ధరించడం వలన మనిషి కొంచెం సుకుమారంగా ఉన్నట్లు కనిపిస్తాడు. చక్కని కళ్లు, ఉంగారాలు తిరిగిన జుట్టు, మెలితిప్పిన పల్చటి మీసాలు- వీటితో అతడెంతో దర్శనీయుడుగా ఉన్నాడు. ముఖ్యంగా ఈడొచ్చిన ఆడపిల్లలు కాసేపు సిగ్గు మరిచిపోయి అతనికేసి మళ్ళీ మళ్ళీ తిరిగి చూసేటంత అందంగా, నాజూకుగా ఉన్నాడు.

ఇరువురు వీరులూ స్నేహసూచకంగా ఒకరినొకరు భుజాస్ఫాలనం చేసుకున్నారు. రణవర్మ వీరిద్దరి పోరాటానికీ సంతోషంతో సమ్మతించాడు. తన కుమారుడు సింహాలనూ, పెద్దపులులునూ ఒంటరిగా వేటాడటానికీ అలవాటు పడినవాడు. అందుచేత సులభంగా దేవదత్తుణ్ణి ఓడించి, వీలైతే పరలోకానికి కూడా పంపించగలడని భావించి కుదుటపడ్డాడు.

కోట ఆవరణలో సాధారణంగా ఇటువంటి బలప్రదర్శనలు జరిగే ఒక ప్రదేశమున్నది. అక్కడికి రాజుగారు, మంత్రులు, ఇతరులు అంతా చేరి, సుఖాసీనులయ్యారు. వీరులిద్దరూ రంగస్థలంలోకి దిగారు.

వారి కత్తియుద్ధం అపూర్వంగా ఉన్నది. రెండు సింహాలు ఒకదాని మీది కొకటి లంఘించినట్టుగా లంఘించి పోరాటం మొదలుపెట్టారు. దేవదత్తుడు మోటుగా కత్తితో బాదటం, జయచంద్రుడు అతి మెలకువగా ఆ దెబ్బలు తప్పించుకుంటూ తిరిగి వ్రేటు వెయ్యటం ఇలా పోరు సాగింది. దేవదత్తుని ఖడ్గప్రహారం ఎంత కర్కశంగా ఉందంటే ఆ దెబ్బ నిజంగా తగిలితే మనిషే కాదు ఎంత పెద్ద వృక్షమైనా సగానికి విరిగిపోతుందని పించేట్లున్నది. ఆ దెబ్బలను జయచంద్రుడు జాగ్రత్తగా తప్పించుకుంటూ వృథా చేసేస్తున్నాడు. జయచంద్రుని దెబ్బలలో అంత మోటుతనం లేదుకాని, వాటిని తప్పించుకోవటం దేవదత్తునికి రాను రాను కష్టమైపోతున్నది. ఒకటి రెండు స్వల్ప గాయాలు తగిలాయి కూడాను. అయినా వాటి నతడు లక్ష్యం చేయకుండా జయచంద్రుణ్ణి రంగస్థలమంతా తరిమి తరిమి కొడుతూనే ఉన్నాడు.

వారి పోరాటం చూసి ప్రేక్షకులు మైమరిచిపోయారు. భయం, ఉద్వేగం, ద్వేషం, రోషం మొదలైన భావాలన్నీ కలిసిన మనస్సులతో వారు అత్యంతాసక్తితో యుద్ధం తిలకిస్తున్నారు. కమ్మని కథ చదువుతూ కథ అయిపోతుందేమోనని పాఠకుడు బెంగపెట్టుకున్నట్లు, ఈ యుద్ధం ఇలా అవిచ్ఛిన్నంగా చాలాసేపు జరిగితే బాగుండునన్నట్టు చూడసాగారు. కాని వారికి ఆశాభంగం కలగనే కలిగింది. కొంతసేపు పోరాటమైన తర్వాత హఠాత్తుగా దేవదత్తుడు పెద్దపులి లాగ దూకి ఒక్క వ్రేటు వేశాడు. ఆ వ్రేటుకు జయచంద్రుడు కత్తి అడ్డం పెట్టాడు. అంతే, ఇద్దరి కత్తులూ తునాతునకలై పోయినవి. క్షణకాలం ఇద్దరూ తెల్లబోయి ఏం చెయ్యటానికీ

తోచక నిల్చుండిపోయారు. ప్రేక్షకుల హర్షధ్వానాలతో, చప్పట్లతో మళ్ళీ తెప్పరిల్లారు. ఒకరి నొకరు కౌగలించుకుని భుజాస్ఫాలనం చేసుకున్నారు. ఇద్దరూ చేతులు పట్టుకుని రాజుగారి వద్దకు కలసి వెళ్ళి నమస్కరించారు.

జయచంద్రుడు రాజుగారితో "మహారాజా! ఇప్పటి దాకా నాతో కత్తి యుద్ధం చేయగల మగవాడు లేడని విర్రవీగేవాడిని. ఈనాటికి నాతో సమానుడు కనిపించాడు. ఇందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ వీర యువకుణ్ణి మీరు ఉచిత రీతిని గౌరవించాలి" అని చెప్పాడు.

జయచంద్రుని మాటలకు అందరూ మళ్ళీ చప్పట్లు కొట్టారు. అతని ఉదాత్తతకు అందరూ ఎంతో సంతోషించారు. రాజుగారు వెంటనే రత్నాలు పొదిగిన బంగారు పిడిగల కత్తులు తెప్పించి చెరోకటీ బహూకరించారు. దేవదత్తుణ్ణి తన అశ్వదళ నాయకుడుగా నియమించారు. అతనికి మంచి జీతం, నగరంలో ఉండటానికి ఒక మేడ, దాసదాసీ జనం ఏర్పాటు చేశారు. రణవర్మకు ఇదంతా కంటగింపుగా ఉన్నది. తన కుమారుడు జయం పొందలేకపోవటం అపజయం పొందటమే అని అతడు భావించాడు. అయినా అతడు పైకేమీ అనకుండా ఊరుకున్నాడు.

దేవదత్తుడు తన అదృష్టానికి చాలా ఆనందం పొందాడు జయ చంద్రుని చేతులు పట్టుకుని "జయచంద్రా! నీ ఖడ్గ నైపుణ్యం అసమానం. ఇంత గొప్ప నేర్పును నేనెక్కడా చూడలేదు. ఇవాళ చూడటమే కాదు, అనుభవించాను కూడాను." అన్నాడు.

"దేవదత్తా! నీ ఖడ్గ నైపుణ్యం మాత్రం తక్కువదా! నేనెందరు వీరులతోనో దెబ్బలాడానుగాని నన్ను నీ అంత తిప్పలు పెట్టినవాణ్ణి ఎక్కడా చూడలేదు," అని జయచంద్రుడన్నాడు.

"నువ్వు మాత్రం తక్కువవాడివా? చూడు, నాభుజం మీద గాయం! నీకేదీ ఒక్కగాయమైనా తగలందే?" అని దేవదత్తుడన్నాడు.

"గాయమే తగలాలా మహానుభావా! నా స్థానంలో నువ్వుంటే తెలిసేది నీ దెబ్బలు ఎంత భయంకరమైనవో!" అని జయచంద్రుడన్నాడు.

"అదికాదు జయచంద్రా!...." అని దేవదత్తుడు ఏదో అనబోతుండగా జయచంద్రుడు అర్థోక్తిలో అందుకుని "దీన్నిక్కడితో వదిలేద్దాం. మరీ బడాయిగా ఉన్నాయి మన ప్రశంసలు" అన్నాడు.

ఇద్దరూ నవ్వుకున్నారు. దేవదత్తుని గంభీరమైన ముఖం నవ్వుతుంటే చూపరులందరికీ వింతగా తోచింది. వారిద్దరూ అలా ఒకర్నొకరు అభినందించుకుంటుంటే, వారిద్దర్నీ దగ్గర్నించీ చూడటానికిగాను సభాసదులందరూ చుట్టూ మూగారు. నవ్వులైపోయిన తరువాత అంతా వచ్చి ఇద్దరూ వీరులనూ ప్రశంసించారు. ఎవరి దారిన వారు వెళ్ళి పోసాగారు. దేవదత్తుడు జయచంద్రుడూ రాజవీధిలో కొంతదూరం దాకా కలిసే నడిచారు.

"జయచంద్రా? మీ తండ్రిగారికి నన్ను చూడగానే ఎందుకంత కోపం వచ్చింది? ఎందుకలా అనవసరంగా మండిపడ్డారు? అని దేవదత్తుడు ప్రశ్నించాడు.

"ఆయన తరహాయే అంత. కొత్తవారెవరూ తన అనుమతి లేకుండా కోటలోకి రాగూడదని ఆయన మతం. తన్నాశ్రయించుకుని ఉండి రాజుగారి దర్శనం చేసుకోవలసిందే, గాని నీలా సరాసరి దర్బారులోకి రాగూడదని ఆయన సరదా. అదీగాక నువ్వు హీనకులజుడవనీ, ఆయన చాలా ఉన్నతవంశీయుడనీ, అందుకుని నిన్ను అవమానించటం తన జన్మహక్కు అనీ ఆయన నమ్మకం. మనిషి మంచివాడే, ఎవరికీ హానిచేసే రకం కాదు. కాని ఇలాంటి దుర్లక్షణాలు కొన్ని ఉన్నాయి. అందుకే ఆయన్ని చూస్తే నాకు పరమ చిరాకు," అని జయచంద్రుడు చెప్పాడు.

"మరి నువ్వు ఆయన కుమారుడివే గదా. నీకు మాత్రం నన్ను చూస్తే జుగుప్స కలగలేదా?"

"ఛాఛా. నేనలాంటివాడిని కాను. మనిషి వేషభాషల్ని చూసి, వంశాన్ని చూసి, సంపదను చూసి నేను మనిషికి విలువ కట్టను. మనిషి విలువ మనిషేనని నా నమ్మకం. మనిషి మొత్తం ఏర్పాటంతా చూసి నేను విలువ కడతాను ఇవ్వాళ నువ్వు నిరుపేదవు కనుక పేద దుస్తులు ధరించావు. ఇవ్వాళ నిన్ను ద్వేషించి, రేపు రాజుగారిచ్చే విలువైన దుస్తులు ధరించి వస్తే నీకు సాష్టాంగం చేసెయ్యను మనిషి బట్టల మీద ఉండడు; బట్టల లోపల ఉంటాడు. ఇంకా లోపల హృదయాల్లో స్వభావాలు, ఆలోచనలు వగైరా సరంజామా అంతా ఉంటాయి. వాటిని బట్టి మనుషుల్ని గౌరవించటమో, మానటమో తేల్చుకోవాలనుకుంటాను" అన్నాడు జయచంద్రుడు ఆగి ఆగి చేతులూపుతూ, ఉషారుగా నడుస్తూ, జుట్టు పైకి తోసుకుంటూ.

"అయితే నన్ను నీ మిత్రకోటిలో చేర్చుకుంటావన్న మాటేగా?"

"అప్పుడే చేర్చేసుకున్నాను, నిన్ను మొదట చూడగానే చేర్చేసుకున్నాను" అన్నాడు జయచంద్రుడు.

"చాలా సంతోషం" అన్నాడు దేవదత్తుడు.

"అది నేననాల్సిన మాట" అని నవ్వుతూ జయచంద్రుడు "ఇక వస్తా" అని మరొకదారిని వెళ్ళిపోయాడు.

దేవదత్తుడు అతడు వెళ్ళినవైపే చూస్తూ చాలసేపు రాజవీధిలో నుంచుని, తరవాత, ఆనాటి సంఘటనలను చెల్లెలు చంద్రావతికి ఎంత వేగిరం పోయి చెబుదామా అనుకుంటూ త్వరత్వరగా నడవసాగాడు.

## 3

రాజుగారు దేవదత్తుడికి కేటాయించిన మేడ చిన్నదైనా, చూడముచ్చటగా ఉంటుంది. ప్రాకారద్వారం దాటి లోపలికి వెళ్ళగానే ఒకవైపు ఎర్రగులాబీ మొక్కలబారు మరొకవైపున చేమంతి మొక్కల బారు బరాబరులు తీర్చినట్లు కనిపిస్తాయి. సన్నజాజి పందిరిలోంచి మెట్లెక్కి వెళ్ళగానే అతిధులను ఆహ్వానిస్తున్నట్లున్న సుఖాసనాలు తీర్చిన పెద్దగది ఉన్నది. ఆ గదికి ఒక పక్కన దేవదత్తుని వ్యాయామశాల ఉన్నది. అందులో

కత్తులు, కటార్లు, ధనుర్బాణాలు, గదలు మొదలైనవి ఉన్నాయి. మరొక పక్కన చంద్రావతి సంగీతశాల ఉన్నది. అందులో కొన్ని వీణలు, మృదంగాలు, గజ్జెలు ఏమేమిటో ఉన్నాయి. ఇంటినిండా కాలు నేలకి తగలకుండా ఎర్రటి మెత్తటి తివాచీలు ఉన్నాయి. ఇంటి వెనకాల ముద్దొచ్చే చిన్నతోట ఉన్నది. అక్కడ పాలరాతి తిన్నెలున్నాయి. వాటిచుట్టూ ఎన్నో రకాల పూలమొక్కలున్నాయి.

ఆ యింట్లోకి అన్నా చెల్లెళ్ళు ప్రవేశించి రెండు నెలలైంది. దేవదత్తుడు తన ఉద్యోగ విధులను ఉత్సాహంగా నిర్వర్తిస్తున్నాడు. రాజ్యరక్షణకు అశ్వదళమే ప్రధానమైనదని నమ్మినవాడు కావటం చేత దాన్ని అభివృద్ధి చేయటానికి ప్రయత్నాలు చేయసాగాడు. మంచి మంచి గుర్రాలను కొనటం, పనికిమాలిన పాత గుర్రాలను అమ్మివేయటం, అశ్వికులకు ఎప్పుడూ మంచి తర్ఫీదు ఇప్పించటం మొదలైన పద్ధతులు ప్రవేశపెట్టాడు. రాజుగారు అతనికి అడ్డు చెప్పకుండా, పైగా తగినంత ధనము ఇచ్చి ప్రోత్సహించ సాగాడు. ఆయనికి దేవదత్తుని సమర్ధత మీద మంచినమ్మకం ఏర్పడింది.

దేవదత్తుడూ, జయచంద్రుడు కొద్ది రోజుల్లోనే గాఢ స్నేహితు లయ్యారు. ప్రతి సాయంత్రమూ గుర్రాలెక్కి శిప్రానది గట్టున స్వారీ చేస్తూ విహరించేవారు. చాలా దూరం పోయిన తర్వాత గుర్రాలు దిగి నదిఒడ్డున కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. జయచంద్రుడు సంస్కృతం బాగా చదువుకున్నవాడు. సంస్కృత కావ్యాలలోని సొగసులు దేవదత్తునికి వినిపిస్తూండేవాడు. ముఖ్యంగా మేఘసందేశంలోని ఉజ్జయినీ పట్టణ వర్ణనం, శిప్రానది వర్ణనం అతనికెంతో ఇష్టం. ఆ శ్లోకాలను చక్కని

కంఠంతో గానం చేసేవాడు. ఒయ్యారంగా నడిచే రమణీ మణిలాంటి శిప్రానదిని వర్ణించటానికి మందాక్రాంత పద్యాలు ఎంతో చక్కగా సరిపోయాయనే వాడు. నదిని అందమైన అమ్మాయితో పోల్చి, నదిలోని సుడి గుండాన్ని అమ్మాయి నాభిప్రదేశంతో పోల్చి, కలకలారావం చేస్తూ అలల మీద ఎగిరే సారసపక్షుల్ని అమ్మాయి మొలనూలుగా వర్ణించి బెంగ పెట్టుకున్న కాళిదాసుగారి బాధంతా తనూ అనుభవించేవాడు. పూర్వమెప్పుడో జరిగిన ఉదయన, వాసవదత్తల కథ దేవదత్తుడికి చెప్పి 'అలాంటి రోజులు మళ్ళీ వస్తాయా?' అని దిగులు పడేవాడు.

దేవదత్తుడు జయచంద్రుణ్ణి తన యింటికి చాలాసార్లు ఆహ్వానించాడు. కాని జయచంద్రుడెప్పుడూ వెళ్ళలేదు. తండ్రికి తెలిస్తే కోప్పడతాడేమోనని కొంత జంకుకూడా ఉన్నది. దేవదత్తునితో స్నేహం చేస్తున్నందుకు ఇప్పటికే రణవర్మ కొడుకును తిడుతున్నాడు. ఇంటికి కూడా వెడితే మరీ చెడుతుందని, జయచంద్రుడు ఏదో సాకు చెప్పి తప్పించుకునే వాడు.

ఒకసారి తండ్రి ఊళ్ళోలేని సమయం చూసి జయచంద్రుడు దేవదత్తుని ఇంటికి వెళ్ళాడు. సరిగ్గా ఆ సమయానికే దేవదత్తుడు కూడా ఇంటి దగ్గర లేడు. రాజుగారితో ఏదో మాట్లాడటానికి కోటకు వెళ్ళాడు.

చంద్రావతి సంగీతశాలలో కూర్చుని వీణవాయిస్తూ చక్కని పాట పాడుకుంటోంది. ఆమె దేవదత్తుని చెల్లెలని జయచంద్రుడు ఊహించాడు. వెళ్ళిపోదామనుకున్నాడు. కాని చంద్రావతి గానం అతని కాళ్ళకు బంధాలు వేసింది. మంత్రముగ్ధుడిలాగ ఆ సంగీతం వింటూ నిలుచుండిపోయాడు. మెల్లగా సద్దు చేయకుండా కిటికీ వద్దకు పోయి లోపలికి తొంగి చూచాడు.

ఆమెను అదే మొదటిసారి చూడటం. మెరుపును చూసినట్లు కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. అంత అందమైన అమ్మాయిలు భూలోకంలో ఉంటారని అతనికి అప్పుడే తెలిసినట్లనిపించింది. మిరుమిట్లు తగ్గిన తర్వాత, ఆమె చల్లని చంద్రబింబంలాగ సౌమ్యంగా, దర్శనీయంగా కనబడింది.

వీణవాయిస్తూ పరధ్యానంగా ఉన్న చంద్రావతిని చూస్తూ జయచంద్రుడు క్షణం సేపు తానెక్కడున్నదీ మరచిపోయాడు. అతని చూపంతా ఆమె ముక్కుమీద ఉంది. ఆమె ముక్కు కొంతదూరం దాకా ఏమీ ఎరగనట్లు వచ్చి, ఏదో పనున్నట్లు గిరుక్కున పైకి తిరిగింది. జయచంద్రుడది చూసి చక్కలిగింతలు పెట్టినట్లయి, లోపల అనుకోబోయి “మీ ముక్కు తమాషాగా ఉందండీ” అని పైకి అనేశాడు.

చంద్రావతి వీణ ఆపి, చటాలున లేని నుంచుని “ఎవరు మీరు?” అని కోపంగా అడిగింది.

జయచంద్రుడు కిటికీ దగ్గర్నించి గుమ్మం దగ్గరికి వచ్చి “నాపేరు జయచంద్రుడండి” అని కంగారుగా అన్నాడు.

“దేనికి వచ్చారు?” అంది ఆమె.

జయచంద్రుడు ఇంకా కంగారుపడి “మీ ముక్కును చూట్టానికండి... కాదు కాదు దేవదత్తుణ్ణి చూట్టానికండి. అతడు నా స్నేహితుడండి” అన్నాడు.

“దేవదత్తుడు ఇందాకనే కోటకు వెళ్ళాడు. ఇప్పుడే వస్తాడు. ఆ గదిలో కూర్చోండి” అన్నదామె.

“అలాగేనండి” అని జయచంద్రుడు కూర్చున్నాడు.

చంద్రావతి జయచంద్రుని పేరు అన్న నోటివెంట చాలాసార్లు విన్నది. ఇంట్లో పనిచేసే దాసీపిల్లలు కూడా అతన్ని గూర్చి, అతని ధైర్యసాహసాలు, గుణగణాల్ని గూర్చి వర్ణించి చెబుతుండగా విన్నది. అందగాడనీ, మంచివాడనీ విన్నది. అందుచేత అంత పొడుగ్గా, విశాలంగా వచ్చి అతడు గుమ్మంలో నుంచోగానే ఆమె స్త్రీ సహజమైన సిగ్గుతో తలుపుచాటున దాక్కుంది. దాసీలను పిలిచి అతనికి చాలా మర్యాదలు చేయించింది. అతడు వద్దు వద్దని సిగ్గుపడుతూనే అన్ని మర్యాదలూ చేయించుకున్నాడు. కొంతసేపైన తర్వాత "ఇక వెళతానండీ" అని లేచాడు.

చంద్రావతి తలుపు చాటునుంచే "కూర్చోండి. మా అన్న వచ్చే వేళైంది. మీరు రాక రాక వచ్చినప్పుడు ఇలా అర్ధంతరంగా వెళ్ళిపోవటం బావుండదు" అన్నది.

జయచంద్రుడు సిగ్గుతో అవస్థపడుతూ "నాకూ బావుండదండి, కాని ఆ ఎదురుగా అద్దంలోంచి మీరు కనిపిస్తున్నారండి. మీరు కనిపిస్తే బావుండదని కాదండి. కాని మీ ముక్కు కొస పైకి తిరిగి నాకు కొంచెం ఇబ్బందిగా ఉందండి" అన్నాడు.

చంద్రావతి అతని మాటలధోరణి చూసి గలగలా నవ్వేసింది. నవ్వాపుకోలేక గబగబా ఇంటివెనక తోటలోకి పారిపోయింది. "ఇప్పుడు మీరు నాలుగైదు వీణలు వాయిస్తున్నారా అండి లేక నవ్వుతున్నారాండీ?" అని అడిగాడు.

"అమ్మాయిగారిక్కడ లేరండి," అన్నదొక దాసీ నవ్వాపుకుంటూ.

ఇంతలోకే గుర్రం దిగి దేవదత్తుడు వచ్చాడు.

# 4

ఈ విధంగా చంద్రావతి, జయచంద్రుడు ఒకరినొకరు చూసుకోవటం ప్రేమించుకోవటం జరిగింది. జయచంద్రుడు ఏదో వంక పెట్టుకుని దేవదత్తుని ఇంటికి రాకపోకలు ఎక్కువ చేశాడు. తండ్రికి తెలిస్తే తెలిసిందిలే అనే నిర్లక్ష్యం కూడా అతనిలో ప్రబలింది. చంద్రావతిని రెండు రోజులు వరుసగా చూడకపోతే తహతహలాడి పోయేవాడు. మొదటిరోజున ఆమె ముక్కుమీదనే దృష్టి కేంద్రీకరించాడు. కాని ఆ తరువాత వచ్చినప్పుడల్లా ఆమెలో ఒక్కొక్కసారికి ఒక్కక్క కొత్త సౌందర్యం కనిపెట్టేవాడు.

ఒకసారి “మీకు బుగ్గలకి గులాబీ రేకులు అంటించుకోవటం అలవాటండీ?” అని అడిగాడు? మీరు కళ్ల రెప్పలాడిస్తుంటే రెండు తుమ్మెదలు ఎగురుతున్నట్లు ఉంటాయండి” అని ఒకసారీ, “మీ కాళ్లు మరీ లేత తమలపాకుల్లా ఉంటాయేమిటండీ?” అని ఇంకోసారీ అన్నాడు. ఒక్కొక్కసారి సెలవు తీసుకుని వెళ్ళిపోబోతూ మళ్ళీ వెనక్కి ఏదో పనున్నట్లు తిరిగి వచ్చి “మీ జడ చూస్తుంటేనండీ, చంద్రుణ్ణి మింగటానికి వచ్చే రాహువులాగా కనిపిస్తోందండీ, “అనేవాడు” అలాగా మీరు రాహువు నెప్పుడన్నాచూశారా?“అని చంద్రావతి వెక్కిరింతగా అడిగితే” చూడలేదండి. కాని మీలాంటి అమ్మాయి ముఖాన్నీ, జడనీ చూసి పూర్వకవులెవరో రాహువు కథ కల్పించారనుకుంటానండీ,” అని సమాధానం చెప్పేవాడు.

ఇంకోసారి ఏమీ తోచక "మీరు కవిత్వం మల్లే ఉంటారండి అనేవాడు" "అంటే?" అని చంద్రావతి అడిగేది. "అంటే కేవలం బలేగా వుంటారని నా ఉద్దేశమండి" అనేవాడు.

అలాగ రోజులు గడుస్తున్న కొద్దీ వారి ప్రేమ గాఢమైపోతోంది. తన ప్రేమ సంగతి జయచంద్రుడు దేవదత్తునితో చెప్పుకున్నాడు. దేవదత్తుడు గంభీరంగా "నా అభ్యంతరమేమీ లేదు. మీ తండ్రిగారు మాత్రం ఛస్తే అంగీకరించరు" అని ఊరుకున్నాడు, జయచంద్రుడు "అవును మరే," అని కృంగిపోయాడు.

జయచంద్రుడొకరోజున తాను దేవదత్తుని చెల్లెల్ని ప్రేమించాననీ, ఆమెనే వివాహమాడతానని, లేకపోతే తన పెళ్ళి సంగతే తలపెట్టవద్దనీ తల్లితో చెప్పాడు. తల్లి అంతా విని భర్తతో చెప్పింది. రణవర్మ అసలే కొడుకు పోకడలతో మండిపడుతున్నాడు. పెళ్ళీమాట కూడా ఎత్తేసరికి తుఫానులో కెరటంలాగ ఉవ్వెత్తున లేచి, అక్కడే ఆగిపోయాడు. దేవదత్తుని చెల్లెల్ని పెళ్ళాడటానికి ససేమిరా వీల్లేదన్నాడు.

"ఈ కాలం కుర్రాళ్ళకి బొత్తిగా హద్దూపద్దూ తెలియకుండాపోతుంది. ఏ పిల్లని చూస్తే ఆ పిల్లని పెళ్ళాడతాననటమే,కులం,వంశం, సంప్రదాయం, ఏమీ అక్కర్లా? నీతీ నియమం అక్కర్లా? మన వంశం ఏమిటి? ఆ దిక్కు లేని వాళ్ళ వంశం ఏమిటి? తోటమాలి కూతురు నా కోడలుగా వస్తుందా? నేను చస్తే ఒప్పుకోను" అని గర్జించాడు రణవర్మ.

"నాన్నా! మీరింకా పూర్వకాలపు చాదస్తాలను పట్టుకొని వేళ్ళాడు తున్నారు. మనిషికి కులమేమిటి, మతమేమిటీ? మనసులంతా మానవ

మతానికి చెందినవారు, మంచి, చెడ్డ అనేవి రెండే కులాలు. మంచివాళ్ళంతా మంచికులానికి చెందినవాళ్ళు, చెడ్డవాళ్ళంతా చెడ్డకులానికి చెందినవాళ్లు," అని జయచంద్రుడు తండ్రితో వాదించాడు.

నాకే నీతులు నేర్పుతున్నావా? ఈ మాత్రం నాకు తెలియదనుకున్నావా? నీ మంచికోరే నేను చెబుతున్నాను. ఆ పిల్లను నువ్వు పెళ్ళాడటానికి వీల్లేదు."

"ఇప్పుడు వాళ్ళు మంచి బట్టలే వేసుకుంటున్నారు నాన్నా! మంచి ఇంట్లోనే ఉంటున్నారు."

"ఏడిశావ్. ఇవ్వాళ మంచిబట్టలు వేసుకుని మంచి ఇంట్లో ఉంటే సరా? నడమంత్రపు సిరి ఎలావచ్చిందో అలాగే పోతుంది. అదీగాక ఆ పిల్ల హీనకులానికి చెందినది. మనం క్షత్రియులం మనకీ వాళ్ళకీ సంబంధమెలా కుదురుతుంది?" అన్నాడు తండ్రి.

"ఆ అమ్మాయిని చూస్తే నువ్వలా అనవు నాన్నా! ఆమె హీనకులానికి చెందినదానిలాగా ఉండదు. క్షత్రియ కులంలో కూడా కనిపించని కళా, కాంతి, సంస్కారం ఆమెలో ఉన్నాయి. వాళ్లు తోటమాలి బిడ్డలమని చెప్పుకుంటున్నా వాళ్ళలో ఎక్కడా ఆ లక్షణాలే కనిపించవు. చక్కగా ఉంటారు," అన్నాడు కొడుకు.

"నాకదంతా తెలియదు. లోకమంతా వాళ్లని తోటమాలి బిడ్డలని అనుకుంటోంది. వాళ్లూ అలాగే చెప్పుకుంటున్నారు. మిగతావన్నీ నాకనవసరం. శుభ్రమైన నా వంశాన్ని కళంకితం చెయ్యలేను. ఇహపో,

నాతో వాదించకు. ఆ దేవదత్తుడి యింటికి వెళ్లావని తెలిసినా, ఆ పిల్లతో మాట్లాడావని తెలిసినా డొక్క చీరేస్తాను. ఫో" అని రణవర్మ కర్కశంగా, నిష్కర్షగా చెప్పేశాడు.

జయచంద్రుడు హతాశుడయ్యాడు. తండ్రి నెదిరించే ధైర్యం లేదతనికి. ఒకవంక గాఢంగా ప్రేమించిన చంద్రావతి, మరొవంక అంత గాఢంగానూ నిరాకరించిన తండ్రి. ఏం చేయటానికి తోచని అయో మయంలో పడిపోయాడు.

దేవదత్తుని గుమ్మం తొక్కవద్దని తండ్రి కఠినంగా శాసించినా, జయచంద్రుడు రహస్యంగా రాకపోకలు సాగిస్తూనే ఉన్నాడు. చంద్రావతిని వారాని కొకసారైనా కలుసుకుంటూ మాట్లాడుతూనే ఉన్నాడు. ఒకరోజున చంద్రావతికి తన తండ్రి తమ వివాహానికి నిరాకరించటమంతా చెప్పేశాడు. ఆమె జయచంద్రుణ్ణి ఏనాటికైనా పెళ్లాడి స్వప్న డోలికలలో ఉయ్యాల లూగాలని కలలు కంటున్నది. ఆ కలలన్నీ నేలపాలైనాయి వారిద్దర్నీ చూసి, వారి దుఃఖం చూసీ దేవదత్తుడు కూడా విచారపడ్డాడు. కాని అతడు మాత్రం ఏం చెయ్యగలడు?

ప్రేమ ప్రవాహంలాంటిది. అందులో పడి ప్రేమికులు కొట్టుకు పోతారనీ, మునిగిపోతారనీ కాదు. ప్రవాహానికి ఏ అడ్డమూ లేనంత కాలమూ హాయిగా, చల్లగా సాగిపోతుంది. ఏ బండరాయో అడ్డం పడితే ప్రవాహం ఇంతెత్తున పొంగి పొరలుతుంది. దాని వేగమూ, శక్తీ, ఇనుమడిస్తాయి. అలానే ప్రేమకు కాస్తంత ఏదన్నా విఘాతం తటస్థిస్తే అది మరింత తీవ్రమవుతుంది. మరింత బలపడుతుంది. చంద్రావతీ

జయచంద్రుల ప్రేమ కూడా అలాగే అయింది. ఒకర్ని విడిచి ఒకరు ఒక క్షణమైనా నిలవలేకపోతున్నారు. కాని పూర్వంలాగా స్వేచ్ఛగా ఎప్పుడు పడితే అప్పుడు కలుసుకోలేక పోతున్నారు. ఎవరి మేడ మీద వారు కూర్చుని మేఘసందేశాలు పంపించుకుంటున్నారు. విరహగీతాలు విరామం లేకుండా పాడేస్తున్నారు. ఏం చేసినా ఏం లాభం? రణవర్మ వాళ్ళిద్దరి మధ్యా గోడలాగా, నీడలాగా నుంచున్నాడు.

## 5

దేవదత్తుడికి ఈ బాధేమీ లేదు. అతనికి ఎంతసేపూ తన ఉద్యోగమేమిటో తనేమిటో, అంతేగాని ప్రేమాగీమా బొత్తిగా తెలియదు. అతని దృష్టి ఇంతవరకూ ఏ కన్యమీదా పడలేదు. అతని మీద మాత్రం చాలామందికి దృష్టి పడింది. అతడు పంచకల్యాణి గుర్రం ఎక్కి రాజవీధిలో పోతుంటే ఎదరో కన్నె పడుచులు కిటికీల్లోంచి చూస్తూ, నిట్టూర్పులు విడిచేవారు. అతడు ఎవరికేసీ చూడనన్నా చూసేవాడు కాదు. ముక్కుకు సూటిగా వెళ్ళిపోయేవాడు. ఉజ్జయినీ పట్టణం స్త్రీ సౌందర్యానికి పెట్టింది పేరని కవులు వర్ణించారు. అక్కడి వేశ్యలు త్రిలోకసుందరులని రాశారు. మహాకాళదేవాలయంలో సాయంకాలాల్లో జరిగే పూజా కార్యక్రమానికి అతడెన్నో సార్లు వెళ్ళాడు. ఆ సమయాల్లో భువన మోహినులైన వైశ్యా రమణులు నూపురమణులు, కాంచన కాంచీ ఘంటికలు కలిసి క్వణక్వణ

శబ్దం చేస్తుండగా నాట్యం చేసేవారు రత్న కంకణాలు ఘలఘలారావం చేస్తుండగా స్వామికి వింజామరలు వీచేవారు. పూజకు హాజరైన నగరయువకుల దృష్టులన్నీ వారి హావభావ విలాసాలమీదనే ఉండేవి. పడుచు గుండెలన్నీ గుబగుబలాడేవి. అయినా దేవదత్తుని దృష్టి అంతా స్వామీ మీదనే కేంద్రీకృతమై ఉండేది. అతని కోసం అర్రులు చాచిన యువతులకు అతడు అందని మ్రాని పండుగానే మిగిలిపోయాడు.

అతనికి ఏదో అద్భుత సాహసం చేసెయ్యాలని, పూర్వపు విక్రమార్కుడి లాగా అనన్యసాధారణమైన కీర్తి ప్రతిష్టలు సంపాదించాలనీ దేశయాత్రలు చేసి వింతలు, విశేషాలు చూడాలనీ కోర్కెలు పరవళ్లు తొక్కేవి. ఇంటిపట్టున ఏ తొందరా లేకుండా స్తబ్ధుగా పడి ఉండటం అతనికి నచ్చలేదు. భారత కథలు ఎప్పుడూ ఆసక్తిగా చదివేవాడు. అర్జునుడు అతని ఆదర్శవీరుడు. అర్జునుడిలాగా దిగ్విజయయాత్ర చేసి గణుతికెక్కాలని కలలు కనేవాడు. కాని ఈ పాడు కాలంలో అలాంటిది సాధ్యమా అని దిగులుపడేవాడు. కాని అది సాధ్యమేనని త్వరలోనే అనుభవమైంది.

ఒకనాటి సాయంకాలం అతడు మహాకాళి దేవాలయానికి వెళ్ళాడు. పూజాదికాలు ముగిసిన తరవాత దైవప్రసాదం స్వీకరించి ఏమీ తోచక దేవాలయావరణలో పూల చెట్ల మధ్య పచార్లు చేస్తున్నాడు. ఆవరణ చాలా విశాలమైనది దేవాలయం అత్యున్నతమైనది. బంగారం పోతపోసిన దేవాలయ గోపురాగ్రం అస్తమించే సూర్యుడి కిరణాలలో ధగధగ వెలిగిపోతోంది. ధ్వజస్తంభం చివర కట్టిన బంగరుమువ్వలు గాలికి కదులుతూ, మహాకాలుణ్ణి సేవించటానికి తిరస్కరణీయ విద్యతో అదృశ్యంగా

వచ్చిన దేవకన్యల మంజీరాల గలగలల్లా వినిపిస్తున్నాయి. శివజటా జూటం లాగ కనిపించే ఒక నల్లనిమబ్బుపైన అర్ధచంద్రుడు ఉదయించాడు. ప్రమధగణాలు గుసగుసలాడుతున్నట్టు గుబురుగా పెరిగిన పొదలు రొదలు చేస్తున్నాయి.

దేవదత్తుడు ఆవరణలో అటూ ఇటూ తిరుగుతూ ఆలయం వెనక భాగానికి వెళ్ళాడు. అక్కడ దేవాలయమంత ఎత్తున పెరిగిన రావి చెట్టొకటి ఉంది. ఆ చెట్టు పగటి పూట చూట్టానికే భయంగా ఉంటుంది. ఆ సంధ్యా సమయంలో అది మరింత భయంకరంగా గాలికి ఊగిసలాడుతోంది. ఆ చెట్టు మొదట ఒక రాతి తిన్నె ఉంది ఆ తిన్నె మీద ఎవరో వ్యక్తి కూర్చుని ఉన్నాడు. దేవదత్తుడు దగ్గిరగాపోయి పరకాయించి చూశాడు. జడలు కట్టిన జుట్టు, పొడుగాటి బవిరి గడ్డం, చేతులో రుద్రాక్ష మాల, ప్రక్కన యమదండం లాంటి దండం, కమండలం, కపాల పాత్ర. వీటన్నిటితోఒక సిద్ధపురుషుడు ధ్యాన నిమీలిత నేత్రుడై కూర్చుని ఉన్నాడు. సాక్షాత్తు వీరభద్రా వతారంలా ఉన్నాడు. అతనికి నమస్కరించి దేవదత్తుడు అక్కడే నిలబడ్డాడు.

కొంతసేపటికి సిద్ధుడు కళ్లు తెరిచాడు. ఎదుట నిలబడిన యువకుని కేసి చూశాడు. తీక్షమైన అతని చూపులు సూదుల్లాగ గుచ్చుకుంటున్నాయి. నిప్పురవ్వ ల్లాగ చురుకుచురుక్కుమంటున్నాయి. ఆ చూపులకు నిలవలేక దేవదత్తుడు తలవంచుకున్నాడు.

"రా నాయనా! ఇలా కూర్చో" అని సిద్ధుడు మేఘ గంభీరమైన కంఠంతో దేవదత్తుణ్ణి పిలిచాడు. దేవదత్తుడు వెళ్ళి సిద్ధునకు కొంత దూరంలో తిన్నెమీద కూర్చున్నాడు.

"నీ పేరు దేవదత్తుడు. నీకొక చెల్లెలున్నది. ఆమెపేరు చంద్రావతి. మీరు తోటమాలి బిడ్డలమని అనుకుంటున్నారు అవునా?" అని కన్నులరమోడ్చి సిద్ధుడు అతనికేసి వాడిగా చూస్తూ ప్రశ్నించాడు.

దేవదత్తుడు త్రుళ్లిపడి లేచాడు. భయంలాంటిదేదో ఆవేశించినట్లు గజగజలాడి పోతున్నాడు. నోటమాట లేక అలాగే గ్రుడ్లప్పగించి చూస్తున్నాడు. ఒళ్లంతా చిరుచెమటలు పోశాయి.

"భయపడకు నాయనా! మేము సిద్ధులము. మాకు రానివిద్య, తెలియని వార్త మూడులోకాల్లోనూ లేవు. మాకు కామగమనం, కామసంచారం, పరకాయ ప్రవేశం, పరమనః ప్రవేశం ఇలాంటివన్నీ కరతలామలాకాలు. అపరోక్షానుభూతి కోసం మేము యోగవిద్యసాధన చేశాం. ఆ సాధనలో అయాచితంగా అణిమాది అష్టసిద్ధులు మాకు లభించాయి. మనోనిగ్రహం లేని యోగులు ఆ సిద్ధుల మీద మోజు పడి అక్కడే ఆగిపోతారు. చివరకు యోగభ్రష్టులవుతారు. లక్ష్యశుద్ధి కలిగిన మాలాంటి యోగులు అక్కడితో ఆగక ఆనందసిద్ధి కోసం ఇంకా ముందుకు సాగుతారు. తమకు లభించిన అణిమాది సిద్ధులను లోకకల్యాణం కోసం వినియోగిస్తూ ఉంటారు. నేను నిన్ను చూస్తూనే నీ పూర్వ చరిత్ర, భావి చరిత్ర తెరిచిన పుస్తకం చదివేసినట్లు చదివేశాను. నీకేం భయం లేదు దేవదత్తా!" అన్నాడు సిద్ధుడు.

"మేము తోటమాలి బిడ్డలమని అనుకుంటున్నామని సెలవిచ్చారు. మేము తోటమాలి బిడ్డలం కామా?" అని దేవదత్తుడు ఇప్పటికి కాస్త గుండె నిబ్బరం చేసుకుని అడిగాడు.

"కారు!" సిద్ధుని కంఠం కంచు గంటలా ఆ సాయం కాలం నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ మ్రోగింది. ఆ ఒక్కమాట దేవదత్తుని గుండెలో సుత్తి దెబ్బలాగ తగిలింది.

"మరి అయితే మా తల్లిదండ్రులెవరు స్వామీ!" దేవదత్తుడు గొంతుకలో ఉండలాగ అడ్డం పడిన దుఃఖాన్నణచుకుంటూ ప్రశ్నించాడు.

"అది నేనిప్పుడు చెప్పటానికి వీల్లేదు. నీ జన్మరహస్యం వెల్లడి అయ్యే సమయమింకా రాలేదు. దాని కొరకు నువ్వు ఎన్నో ప్రమాదాల నెదుర్కొని, ఎన్నో సాహసకృత్యాలు చెయ్యాల్సి ఉంది," అన్నాడు సిద్ధుడు.

దేవదత్తుని హృదయం సంతోషంతో ఉరకలు వేసింది. ప్రమాదా లెదుర్కోవటమా? సాహసకార్యాలు చేయటమా? తను ఇన్నాళ్లూ ఎదురు చూస్తున్నది దేనికోసం?దీని కోసం కాదా?తన కోరికలు నిజమయ్యే రోజు వచ్చిందా? తను దేశదేశాలు తిరిగి ఏవేవో అద్భుతాలు చేయనున్నాడా? అందులో తన జన్మరహస్యాన్ని కనుక్కొనే ప్రయత్నం మీద తానెక్కడికో వెళ్లిపోబోతున్నాడా?ఆ జన్మ రహస్యం మీద తన క్షేమం తన చెల్లెలి క్షేమం ఆధారపడి ఉన్నాయా?ఈ ప్రశ్నలన్నీ సంధ్యాసమయతిమిరాలలలాగ అతన్ని చుట్టుముట్టాయి.

"స్వామీ! నా జన్మ రహస్యం నేను కనుక్కొని తీరుతాను. చిన్నప్పటి నుంచీ తోటమాలి దంపతులే మా తల్లిదండ్రులని అనుకుంటున్నాము. కారని మీరు చెప్పటంతోటే నా మనస్సు కల్లోలితమైపోయింది. నా అసలు తల్లిదండ్రులెవరో తెలుసుకోకుండా చిరునామా లేని మనిషి లాగ నేనెలా

జీవించగలను? చెప్పండి స్వామీ! ఏం చెయ్యమంటారో చెప్పండి. సప్తసముద్రాలు లంఘించి, పర్వతాలు దాటి రాక్షసుల అక్షౌహిణిని నాకరవాలానికెరచేసి తిరిగి రమ్మంటే వస్తాను. చెప్పండి నా జన్మరహస్యం ఎక్కడుంది? ఏ అమావాస్యలో దాక్కుంది? ప్రాణాలు తృణప్రాయాలుగా ఏ ప్రమాదంలోకి దూకమన్నా దూకుతాను. సెలవియ్యండి," అని దేవదత్తుడు ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు.

"తొందరపడకు, ఆవేశపడకు, దేవదత్తా! నేను చెప్పేది సావధానంగా విను. విని నీకు సాధ్యమైతే చెయ్యి," అన్నాడు సిద్ధుడు.

"మీ ఆశీర్వాదబలంతో నేను సాధించలేనిదుంటుందా స్వామీ!" అని వినయంగా చేతులు జోడించాడు దేవదత్తుడు.

"విను దేవదత్తా! ఇక్కడికి నూరామడ దూరంలో సింహగిరి అనే గొప్ప పర్వతమున్నది. ఆ పర్వతశిఖరాన ఒక గొప్పకోట ఉన్నది. ఆ కోటలో ఒక తోట ఉన్నది. ఆ తోటలో ఒక పంజరమున్నది. ఆ పంజరంలో ఒక చిలక ఉన్నది. ఆ చిలక మాట్లాడే చిలక. ఆ చిలకకు తెలుసు నీ జన్మ రహస్యం. ఆ చిలకను సంపాదించావంటే నువ్వు ఏది తెలుసుకోవాలంటే అది తెలుసుకోగలవు. ఆ చిలక భూతభవిష్యద్వర్తమానాలన్నీ తెలిసిన చిలక.

అయితే ఆ చిలకను సంపాదించటం తేలిక కాదు. ఈ నూరామడ దూరంలో నువ్వు దాటవలసిన నదులు, కొండలు, అరణ్యాలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ దాటి సింహగిరిని చేరుకున్నా, ఆ పర్వత శిఖరానికి ఎక్కడం నరమానవులెవ్వరూ ఇప్పటిదాకా చేయలేనిపని. ఆ కొండ అన్ని వైపులా అద్దం లాగ నున్నగా జారిపోతూ వున్నట్లుంటుంది. అయితే అది

ఎక్కే ఉపాయం అక్కడికి వెళ్ళాక నీకే తెలుస్తుంది. ఆ కోటలో ఒక రాక్షసుడు ఉన్నాడు. వాడు అతిభయంకరుడు. భారతకాలంలోని బకాసురుని వంశంలో జన్మించినవాడు. ఆ వంశంలోని వారందరూ హరించిపోయారు. వీడితో ప్రపంచంలో రాక్షసజాతి ఆఖరవుతుంది. ఈ కలియుగంలో అలాంటి రాక్షసులకు తావు లేదు.

ఆ రాక్షసుడు ఆ కొండకీ, కోటకీ, తోటకీ, పంజరానికీ, చిలకకీ యజమాని. వాడిని సంహరించనిదే ఆ చిలక నీ వశం కాదు. అది నీవశం కానిదే నీ జన్మ రహస్యం నీకు తెలియదు. ఏం, ఇందుకు సిద్ధపడగలవా?" అన్నాడు సిద్ధుడు.

"ఇందాకే మనవి చేశాను మీ ఆశీర్వాద బలంతో నేను సాధించలేనిది లేదని. ఆ రాక్షసుణ్ణి సంహరించే ఉపాయం చెప్పండి, చేస్తాను," అన్నాడు దేవదత్తుడు.

సిద్ధుడు మాట్లాడలేదు. దేవదత్తుని వంక తీక్ష్ణమైన చూపులు ప్రసరించాడు. మహాకాలఫాల నేత్రం తాలూకు చూపులకు చిత్తుపతుల్లాగా ఉన్నాయి ఆ చూపులు. ఎన్ని సంవత్సరాల తపోగ్నిజ్వాలలు ఆ చూపుల్లో నిహితమై ఉన్నాయో, అవి దేవదత్తుని శరీరమంతటా పొడుగాటి పాములు పాకుతున్నట్టు పాకుతూ అతణ్ణి భయాతురుణ్ణి చేశాయి. ఆ చూపుల్లో ఏదో దీక్ష, ఏదో అతాకితమైన క్రౌర్యం, ద్వేషం గూడుకట్టుకుని ఉన్నట్టు అతనికి తోచింది. ఇతడు మానవుడా దానవుడా, పిశాచమా అనిపించింది. అయినా మనస్సు చిక్కబట్టుకుని "స్వామీ! మాట్లాడరేం?" అన్నాడు దేవదత్తుడు.

అప్పటికి సూర్యుడస్తమించాడు. సంశయాత్ముడి మనస్సులోని అస్పష్టమైన ఆలోచనల్లాగ చీకట్లు, వెన్నెలా పెనవేసుకుని మసకవెలుగులు అంతటా వ్యాపించాయి. రావి చెట్టు కొమ్మల మీద భేతాళ బృందాలు కథలు చెప్పుకుంటున్నట్టు ఆకులు గలగలమంటున్నాయి.

సిద్ధుడు ఖంగుమని దగ్గి గొంతుక సవరించుకుని ఇలా చెప్పసాగాడు.

"మహాకాలుని గర్భగుడిలోకి ఎన్నడైనా అడుగుపెట్టావా? లేదా? పోనీలే. పగలే చిమ్మచీకటిగా ఉంటుంది ఆ గది. దానికి ఇవతల సరిగ్గా లింగానికి ఎదురుగా నందీశ్వరుని విగ్రహం ఉన్నది, చూశావుగా. ఆ విగ్రహాన్ని మానవమాత్రులెవ్వరూ ఎంత ప్రయత్నించినా లేవనెత్తలేరు. అది మామూలు విగ్రహం కాదు. మంత్రిత విగ్రహం అందుచేత దాన్నెవ్వరూ కదల్చలేరు. దానికింద ఒక ఖడ్గం ఉన్నది. ఆ ఖడ్గం ఎవరిదో తెలుసా? పూర్వకాలంలో విక్రమార్కుడికి మహాకాళి ప్రసాదించిన ఖడ్గం అది. దాని పేరు కాలకీల. దాన్ని నువ్వు ఎలాగైనా సంపాదించాలి. అది నీ చేతులో ఉన్నంత కాలమూ నిన్నెవ్వడూ జయింపలేడు దాంతో నువ్వు ముల్లోకాలనూ జయింపవచ్చును. సింహగిరి మీది రాక్షసుడు ఆ ఖడ్గంతో తప్ప మరి దేనితోనూ చావడు. అది నువ్వు సంపాదించు," అన్నాడు సిద్ధుడు.

"అలాగే సంపాదిస్తాను. కాని నందీశ్వరుణ్ని కదిలించే మార్గం చెప్పండి."

"నేను నీకు మంత్ర భస్మం కాస్త ఇస్తాను. పరమ శివుణ్ణి నిశ్చల చిత్తంతో ధ్యానించి ఆ భస్మం నందీశ్వరుడి మీద చల్లు. ఆ తరవాత నీ బలమంతా ఉపయోగించి ఆ విగ్రహాన్ని లేవనెత్తు. అప్పుడది కదుల్తుంది.

ఆ భస్మం సాక్షాత్తు పరమశివుడు పార్వతీ అమ్మవార్ని ఆలింగనం చేసుకున్నప్పుడు ఆయన దేహం మీద నుంచి రాలిన భస్మం. దాన్ని మా గురువుగారు కైలాసయాత్రకు వెళ్లినప్పుడు అక్కడ సేకరించి తెచ్చి నాకు కొంత ఇచ్చారు. అది గొప్ప మహిమ గల భస్మం" అని సిద్ధుడు దేవదత్తునికి కొంచెం భస్మం పొట్లం కట్టి ఇచ్చాడు. చాలా భయభక్తులతో వణికిపోతూ దేవదత్తుడు అది అందుకున్నాడు.

తరువాత సిద్ధుడు ఇంకా ఇలా చెప్పాడు. "నువ్వు కాలకీలను కేలధరించిన తరువాత తిన్నగా ఇంటికిపోగూడదు. దాన్ని విక్రమార్కుడు ఉపయోగించి ఎన్ని వందల సంవత్సరాలయిందో. దానికీ పాటికి కొంత మహిమపోయి ఉండవచ్చు. అందుచేత నేను దాన్ని మంత్రితం చేస్తాను. మంత్రితమైనప్పుడది ఒరలోంచి తీయగానే తక్షకుని నాలుకలాగ విద్యుత్కీలలు ఎగజిమ్ముతూంటుంది. అప్పుడు గాని దానికి అలౌకిక శక్తి ఉన్నట్లు కాదు. అందుచేత నవ్వు దాన్ని ఒరలో పెట్టుకుని నా దగ్గరికి రా నేను ఊరి బయట శ్మశానవాటిక సమీపంలో పాడుపడిన కాళికాలయంలో నీకోసం ఎదురు చూస్తూ ఉంటాను. నువ్వు రెండో కంటివాడికి, ఆ మాట కొస్తే మూడో కంటివాడికి కూడ తెలియకుండా, సద్దు చేయకుండా రా. నేను ధ్యాన సమాధిలో మైమరచి ఉంటే నన్ను మేల్కొల్పబోకు. నేను లేచేదాకా అక్కడే నుంచో. ఇదంతా రేపు రాత్రి ఊరంతా మాటుమణిగిన తర్వాత జరగాలి. నేను చెప్పింది ఎవరికీ చెప్పబోకు. నువొక్కడివే రా."

దేవదత్తుడు అలాగేనన్నాడు. అయితే ఇంకొక్క సందేహం ఉన్నద తనికి. మహాకాళ దేవాలయంలోకి అర్ధరాత్రప్పుడు చొరబడటం ఎలా? అర్చకులు తాళాలు వేసుకుని వెళ్ళిపోతారే. దీనికి సిద్ధుడు ఇలా చెప్పాడు.

“నువ్వు రేపు మామూలుగానే పూజాసమయానికి ఆలయానికి రా. అర్చకులెవరూ చూడకుండా గర్భగుడిలో లింగం వెనకాల దాక్కోఆ లింగం మహోన్నతమైనది కనుక నిన్నెవరూ చూడలేరు. అంతా వెళ్ళి పోయిన తరవాతఇవతలకు వచ్చి నీపని కానిచ్చుకో.నందీశ్వరుణ్ణి పక్కకు తొలగించిన తరువాత విగ్రహం అడుగున కత్తి తీసుకొని జాగ్రత్తగా అక్కడ పరీక్షించు భూమిలోకి కొన్ని మెట్లు కనబడతాయి. ఆ మెట్లు దిగితే ఒక సొరంగం ఉంటుంది.ఆ సొరంగం గుండా నీవు సరాసరి నడిచిరా. సరిగ్గా శ్మశాన వాటిక దగ్గిరి కాళికాలయంలో అత్యుగ్ర స్వరూపిణియైన కరాళకాళిక విగ్రహం వెనకాలకి తేల్తావు.ఆ సొరంగం చివర మళ్ళీ మెట్లు కనిపిస్తాయి.ఆ మెట్లు ఎక్కిపైకి రా.మెట్లు ఆఖరయ్యేటప్పుడు చెయ్యి ఎత్తితే నీ చేతికి మందమైన ఇనప తలుపు తగుల్తుంది. దానికి గడియ నీ వైపే ఉంటుంది, చేత్తో తడిమితే కనిపిస్తుంది. ఆ గడియ తీసి తలుపు ఎత్తి పైకి రా. నేనూ ఆ దగ్గిర్లోనే ఉంటాను.ఇక నేను వస్తాను. నేను చెప్పినదంతా జ్ఞాపక ముంచుకో,” అని సిద్ధుడు పద్మాసనంలోంచి లేచి తన సరంజామంతా దీసుకున్నాడు.

సిద్ధుడు పొట్టిగా, అతిబలిష్టంగా, కాలయముని వాహనమైన దున్నగున్న లాగా దేవదత్తుణ్ణి ఆశీర్వదిస్తూ అతడు విసవిస బయటకు నడిచి చీకట్లలో అదృశ్యుడై పోయాడు.

ఆ రాత్రంతా దేవదత్తునికి నిద్రలేదు. సిద్ధుడు చెప్పిన మాటలే మళ్ళీ మళ్ళీ కలత నిద్రలో వినిపించాయి. కలల్లో సిద్ధుని రూపమే ఇంకా భయంకరంగా ప్రత్యక్షమైంది. ఏ తెల్లవారు ఝామునో అతనికి గాఢంగా నిద్ర పట్టింది.

6

దేవదత్తుడు అవాళ పగలంతా అదో విధంగా, పరధ్యానంగా ఉన్నాడు కోటకు వెళ్ళాడు గాని ఎవరితోనూ సరిగా మాట్లాడలేకపోయాడు. ఇంట్లో చెల్లెలితో కూడా ముభావంగా ఉన్నాడు. జయచంద్రుడు పలకరిస్తే సరిగా మాట్లాడకుండా తప్పించుకు తిరిగాడు. మాట్లాడితే సిద్ధుడు చెప్పిన రహస్యాలు ఎక్కడ అప్రయత్నంగా చెప్పేస్తానో అని భయం కలిగింది. ప్రకాశవంతమైన అతని ముఖం నిద్రలేకనో, ఆలోచనల ఆందోళన వల్లనో వివర్ణమై పోయింది. చేతులు, కాళ్లు మాటిమాటికీ వణికిపోతున్నాయి. పెదవులు ఏదో చెప్పాలన్నట్లు కదులుతున్నాయి. కంఠస్వరం కూడా హీనమైంది. కోటలో అతని ధోరణి అంతా జయచంద్రుడు కనిపెట్టాడు. అతడేదో విపత్తులో చిక్కుకున్నాడని గ్రహించాడు. “అలా వున్నావేం దేవదత్తా!” అని అడిగితే “ఏమీ లేదులే” అని జవాబిచ్చి తప్పుకుపోయాడు.

నాటి సాయంకాలం దేవదత్తుడు చెల్లెలితో తను పని మీద ఎక్కడికో వెడతానని, ఎప్పుడో ఒక రాత్రివేళ వచ్చి పడుకుంటాననీ, తనకోసం ఆగకుండా భోజనం చేసి నిద్రపొమ్మనీ చెప్పాడు. దేవాలయానికి వెళ్లాడు. పూజా కార్యక్రమం జరుగుతుండగా ఎవరూ చూడకుండా గర్భగుడిలో దాక్కున్నాడు. కొంతసేపైన తర్వాత అర్చకులు ఆలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. గర్భగుడి గుమ్మానికి అటు ఇటూ ప్రమిదెల వెలుతురు

తప్ప ఆలయమంతా చిమ్మచీకటిగా ఉన్నది. కీచురాళ్ళ రొద, గబ్బిలాల రెక్కల చప్పుడు, దూరంగా నక్కల ఊళతప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

దేవదత్తుడు గర్భగుడిలో నుండి ఇవతలకు వచ్చాడు. లింగానికి ఎదురుగా నుంచుని నిశ్చల మనస్సుతో పరమేశ్వరుణ్ణి ధ్యానించాడు. నందీశ్వరునికి సాష్టాంగ ప్రణామం చేశాడు. తరవాత నంది విగ్రహాన్ని యావచ్ఛక్తీతోనూ కదిలించాడు. విగ్రహం చాలా బరువుగా ఉంది. ఎంతోసేపు తంటాలు పడిన తర్వాత విగ్రహం కదిలింది. కొద్దికొద్దిగా పక్కకు జరిపాడు. నిలువులోతున గొయ్యి కనబడింది. అందులోనికి నెమ్మదిగా దిగి వెతికి, ఖడ్గాన్ని తీశాడు. అదీ చాలా బరువుగా ఉంది. రెండు చేతులతోనూ పట్టుకుంటే తప్ప పైకి ఎత్తలేకపోయాడు. కొంతసేపు రెండు చేతులతోనూ పట్టుకునే సాము చేశాడు. కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఈసారి ఒక్కచేత్తో పట్టుకుని సాము చేశాడు. ఇలాగ చాలాసేపు సాము చేసిన తరవాత దాన్ని అవలీలగా ఎటుపడితే అటు అలవాటైన ఖడ్గంలా త్రిప్పటం సాధ్యమైంది. ఎక్కడా తుప్పుపట్టని ఆ కత్తి ప్రమిదెల కాంతితో తళతళలాడింది. దాన్ని తనతో తెచ్చిన ఒరలో దాచాడు.

తరవాత గోతిలోకి దిగాడు. కాలితో తడమగా మెట్లు కనిపించాయి. మళ్లీ యావచ్ఛక్తినీ ఉపయోగించి నందివిగ్రహాన్ని యధాస్థానానికి జరిపాడు. జరిపేసిన తర్వాత హఠాత్తుగా అతనికి గుండె ఆగినంత పని అయింది. క్షణం సేపు నిశ్చేష్టుడై పోయాడు. వళ్ళంతా ముచ్చెమటలు పోశాయి.

నంది విగ్రహాన్ని కదిలించటం మానవమాత్రునికి సాధ్యం కాదని సిద్ధుడు చెప్పాడు. శివభస్మం చల్లితేగాని కదలదని చెప్పాడు. ఆ భస్మపు

పొట్లం పొట్లంగానే తన అంగరఖా జేబులో ఉంది. అది తను ఉపయోగించ నేలేదు. బాగా శ్రమపడి నంది విగ్రహాన్ని తనంతట తాను కదిలించాడు. మళ్ళీ గోతులోనుంచి దాన్ని యధాస్థానానానికి జరపగలిగాడు. భస్మం లేకుండా ఇదంతా ఎలా సాధ్యమైంది?

సిద్ధుడు మోసగాడనే ఆలోచన తట్టడానికి అతనికెంతో సేపు పట్టలేదు. ఈ ఒక్క విషయంతో సిద్ధుని బండారమంతా గ్రహించాడు.

అయితే ఇప్పుడు ఏమి చేయటం? సొరంగం లోంచి ముందుకు పోవటమా, వెనక్కి పోవటమా! సిద్ధుడు మోసం చేయటానికి కారణ మేమిటి? అతడు తన్ను మోసం చేసి ఏమి సాధిస్తాడు! అసలు తన్ను ఎంతవరకూ మోసం చేశాడు! కొంతవరకేనా, అంతా మోసమేనా? అతడు చెప్పినట్లు విక్రమార్కుని ఖడ్గం కాలకీల కనిపించింది. సొరంగం ఉన్నది. మెట్లున్నాయి. బహుశా ఈ సొరంగం ఊరవతల కాళికాలయంలోకే దారి తీయవచ్చు. ఇప్పుడు తనకు ఈ మార్గం తప్ప మరోమార్గం లేదు. ఆలయ ద్వారాలు దృఢంగా మూసి ఉన్నాయి. స్వర్గానికి వెళ్ళినా, నరకానికి వెళ్ళినా ఇదొక్కటే దారి. అందుచేత ముందుకు పోక తప్పదు. అక్కడేదైనా అపాయ సూచన కనిపిస్తే ఏం చెయ్యాలో అప్పుడే చూసుకోవచ్చు. తను వీరుడు, కరంలో కరవాలం ఉన్నంతకాలమూ తన్ను ఎవరూ ఏమి చెయ్యలేరు.

ఇలా ఆలోచించుకుని దేవదత్తుడు ధైర్యంగా మెట్లు దిగి ముందుకు నడిచిపోసాగాడు. చీకటిగా ఉన్నది. సొరంగం గోడలు తేమగా ఉన్నాయి. జాగ్రత్తగా అడుగులు వేస్తూ నడవసాగాడు. అక్కడక్కడ కాళ్ళకేవో అడ్డం తగులుతున్నాయి. చేత్తో తడిమి చూస్తే అవి మానవ కపాలాలు, మాన

వాస్థికలు! అతనికి గుండె ఝల్లుమన్నది. ఈ అంధకార రహస్య పైశాచిక పాతాళవీధిలో ఏ భేతాళ చర్యలవి? ఏ దురదృష్టవంతులు ఇక్కడ అకాల దుర్మరణం పొంది ఉంటారు? ఎన్ని శతాబ్దాల క్రిందటి ఎవరి క్రౌర్యానికి ఇవి ఉదాహరణలు? తను కూడా ఈ సొరంగంలో ఇదే దుర్గతి లోనవుతాడా? “అసంభవం” అని బిగ్గరగా తనకు తనే ధైర్యం చెప్పుకుంటూ ముందుకు నడిచాడు దేవదత్తుడు.

అరక్రోసెడు దూరం నడవగా చివరికెలాగైతేనేం సొరంగం చివరికి వచ్చాడు. కాలికేవో మెట్లు తగిలాయి. ఒక్కొక్కమెట్టే ఎక్కాడు. అంత ఎక్కినా మెట్లు తరగటం లేదు. కళ్ళు తిరుగుతున్నాయి. శరీరం అలసిపోయింది. మనస్సు అలసిపోయింది. కళ్ళు కూరుకుపోతున్నాయి. మెట్ల మీద కూర్చున్నాడు. కొండచిలవ నోరావలించి మనిషిని మింగుతున్నట్లు నిద్ర అతని తలకాయని కబళించి వేస్తోంది. తలవిదుల్చుకున్నాడు. కళ్ళు నులుముకున్నాడు. వళ్ళు విరుచుకున్నాడు. మళ్ళీ లేచి మెట్లెక్కాడు. మెట్లు ఎక్కుతున్నాడు గాని ఎక్కుతున్నాడో దిగుతున్నాడో తెలియటం లేదు. చివరికి మెట్లు ఆఖరయ్యాయి. చేతికి ఇనపతలుపు తగిలింది. దాని గడియ కాళికాలయపు రాతిగోడలోకి ఉన్నది. అది బాగా తుప్పుపట్టి ఉన్నది. కష్టపడి, కత్తితో కొట్టి కొట్టి ఆ గడియలాగాడు తలుపు వీపానించి, రెండు చేతులతోనూ ఎత్తాడు. భూమిలోంచి అతని తల బయటికి వచ్చింది. మళ్ళీ తలుపు మూసేశాడు. తను సరిగా కాళీ విగ్రహం వెనకాల ఉన్నాడు. సద్దు చేయకుండా విగ్రహం ప్రక్కనుంచి తొంగి చూశాడు. సిద్ధుడు విగ్రహం ఎదుట ధ్యానముద్రలో ఉన్నాడు. అది నిజమైన ధ్యానమో బకధ్యానమో

మరి! విగ్రహం కాళ్ళవద్ద రెండు కాగడాలు వెలుగుతున్నాయి. ఆలయ వాతావరణం భయంకరంగా ఉంది. ఎక్కడ చూసినా ఎలుకల కన్నాలు, బూజు, దుమ్ము చెత్త, ఎముకల ముక్కలు ఒకటి రెండు పుర్రెలు...

దేవదత్తుడు సిద్ధుని వద్దకు వెళ్ళాడు. విగ్రహం కేసి ఒకసారి చూశాడు. కాళికాదేవి మహోగ్రంగా ఉన్నది. ఎర్రని రంగు పూసిన ఆమె నాలుక, చేతుల్లో ఏవేవో ఆయుధాలు, చూడశక్యం కానంత భీకరంగా కళ్లు, దంష్ట్రలు అన్నీ నిశ్చలంగా చూశాడు. కరుణామయి అయిన జగజ్జననిని ఈ క్షుద్రరూపంలో ఎందుకు ఆరాధిస్తారో అతడికి తెలియలేదు.

మరోక్షణంలో ఒక ఆలోచన మెరపులా మెరసి అతనికంతా అర్థమైంది. ఈ సిద్ధుడు ఒకవేళ తన్ను కాళికాదేవికి బలి ఇవ్వడానికి రప్పించలేదు గదా. అవును ఇలాంటి సిద్ధులు ఏదో సిద్ధిని కోరి కాళికాదేవికి నరబలి ఇస్తూ వుంటారని అతడు కథలు విన్నాడు. ఇప్పుడు తనకు కూడా అదేగతి అనుభవంలోకి రాబోతోందని అతడు తేలిగ్గానే ఊహించు కోగలిగాడు. ఏం చేయటానికీ పాలుపోక అలా నుంచున్నాడు.

ఇంతలో సిద్ధుడు కళ్లు తెరిచాడు. “వచ్చావా నాయనా! కత్తి తెచ్చావా? ఏదీ శత్రు సంహారిణి, కాళీదత్త కాలకీలా కరవాలం? ఇలా ఇయ్యి మంత్రపూతం చేస్తాను” అన్నాడు.

“ఇవ్వను,” అని పిడుగులాగ ఒకటేమాట అని ఊరుకున్నాడు దేవదత్తుడు. సిద్ధుడు అదిరిపడి లేచినుంచున్నాడు. దూరంగా జరిగి నిలబడి “ఏం?” అని ప్రశ్నించాడు.

“నీ మోసం తెలిసిపోయింది,” దేవదత్తుడన్నాడు.

"మోసమా?"

"అవును మోసమే. మీ గురువుగారు తెచ్చిన కైలాస భస్మం లేకుండానే నేను మానవులెవ్వరూ కదిలించలేని నందీశ్వరుణ్ణి కదిలించాను. ఇప్పుడు చెప్పు. ఎందుకు నన్నిలా మోసం చేశావు? నేను నీకేం ద్రోహం చేశాను?" అని దేవదత్తుడు గర్జించాడు. అతని గర్జనకు గబ్బిలాలన్నీ చెల్లాచెదరై పోయాయి.

సిద్ధుడు క్రూరంగా చూశాడు అతనివైపు. హఠాత్తుగా మీదికి దూకాడు. ఏమరుపాటుగా ఉన్న దేవదత్తుడు వెనక్కి పడ్డాడు. సిద్ధుడు దేవదత్తునికి భుజాలదాకా వస్తాడు. అందుచేత అతని నడుము దగ్గర భల్లూకంలా కౌగలించుకొని నొక్కి పట్టాడు. ఆ పట్టులో దేవదత్తుడు గిలగిల లాడాడు. సిద్ధుడు చేతులతో సహా కావిలించుకోవటం చేత ఒరలోని కత్తి తీయటానికి సాధ్యపడలేదు. చాలాసేపు పెనుగులాడాడు. అతికష్టం మీద సిద్ధుని పట్టు వదిలించుకున్నాడు. ఒక్కతోపుతో సిద్ధుడు ఒక మూలకు పోయి పడ్డాడు. దేవదత్తుడు చరాలున కాలకీల దూసి నాలుగుసార్లు అటూఇటూ ఝుళిపించాడు.

సిద్ధుడు కథ ఇలా అడ్డం తిరుగుతుందని ఊహించలేదు. అందుచేత తెల్లబోయాడు. కొంతసేపు ఎలా పడిన వాడలాగేఉండి దేవదత్తుణ్ణి చూశాడు. తరువాత నెమ్మదిగా జరిగి తన దండం తీసి దేవదత్తునితో తలపడ్డాడు. కాని క్షణంలో దేవదత్తుడు దాన్ని తుత్తునియలు చేశాడు. అయినా సిద్ధుడు పట్టు విడవక దేవదత్తుని పైకి లంఘించాడు. ఇక చేసేది లేక దేవదత్తుడు

కాలకీలను సిద్ధుని పొట్టలో పొడిచాడు. "కాళీ" అని భయంకరంగా ఆలయమంతా మారుమ్రోగేట్లు అరిచి సిద్ధుడు నేలకూలాడు.

"పాపాత్ముడా! నీవు చేసిన మోసానికి శాస్తి ఇదే. అనుభవించు" అని దేవదత్తుడు అరిచాడు.

కొన ఊపిరితో ఉన్న సిద్ధుడు గిలగిల తన్నుకుంటూ "దేవదత్తా? క్షమించు, నిన్ను మోసం చెయ్యాలని తలపెట్టిన మాట నిజమే. నిన్ను కాళికాదేవికి బలి ఇచ్చి నేను వరాలు పొందాలని అనుకున్న మాటనిజమే. కాని నేను నీ జన్మ రహస్యం గూర్చి చెప్పింది, సింహగిరి మీద రాక్షసుడి దగ్గరున్న చిలకను గూర్చి చెప్పింది అంతా అబద్ధం కాదు. ఆ చిలక ఒకప్పుడు నా దగ్గర ఉండేది, దాని ద్వారా నీ సంగతి, నీ జన్మ రహస్యం సంగతి విన్నాను. నిన్ను కాళికాదేవికి బలి ఇస్తే నాకు అణిమాది అష్టసిద్ధులు లభిస్తాయని ఆ చిలకే చెప్పింది. నేనొకసారి సింహగిరి ప్రాంతంలో సంచరిస్తుండగా ఆ రాక్షసుడు నన్ను మాయచేసి ఆ చిలకను దొంగిలించాడు. నేనెలాగో తప్పించుకున్నాను. ఆ చిలక ఇప్పటికీ వాడి దగ్గరనే ఉంది అది ఎవరేది అడిగినా చెబుతుంది. తను ఎవరి దగ్గరుంటే వారి మాట వింటుంది. వారికి సహాయం చేస్తుంది. అందుకే నేను అణిమాది సిద్ధులెలా లభిస్తాయని అడిగినప్పుడు అది నీ సంగతి చెప్పింది. అంతేగాని నీ మీద దానికి ద్వేషం ఉందని అనుకోబోకు అది చిత్రమైన చిలక. రాగద్వేషాలేవీ అంటని స్థిత ప్రజ్ఞుడిలా ఉంటుంది. పాపం ఏదో శాపం వల్ల చిలక జన్మ ఎత్తిన ఏ ఋషీశ్వరుడో ననుకుంటాను. దేవదత్తా! నాకు కాలం ఆసన్నమైంది. నన్ను క్షమించు. కాళీమాతా!" అని మూలుగుతూ సిద్ధుడు ప్రాణాలు విడిచాడు.

దేవదత్తుడు కాలకీల కేసి చూశాడు. రక్తం తగలగానే అది చిత్రంగా నీలినీలి విద్యుజ్జ్వాలలు వెలిగ్రక్కసాగింది. నిద్రపోతున్న వెయ్యి నాల్కల మహాసర్పం నిద్రలేచి నాల్కలు సారించినట్లు ఆ కాలకీల భయావహంగా మెరిసిపోసాగింది. కొలిమిలో పెట్టి కాల్చినట్టు వేడెక్కింది. దేవదత్తుడు దాన్ని మట్టిలో పొర్లాడించి నెమ్మదిగా చల్లబరిచాడు. తరవాత దాన్ని తుడిచి ఒరలో పెట్టుకుని, ఇక అక్కడ జాప్యం చేయగూడదని హుటాహుటిన బయలుదేరాడు. పుచ్చపువ్వులాగా వెన్నెల కాస్తోంది. రమణీమణి ముఖం మీద ముంగురులు గాలికి కదలాడుతున్నట్లు, చంద్రబింబం మీద నల్లటి మబ్బుతునకలు వస్తూ పోతూ ఉన్నాయి. నదిగట్టున నడిచి వస్తున్న దేవదత్తునికి గట్టు వెంబడే పెరిగిన అడవి మల్లెల సౌరభంతో బరువెక్కిన చల్లని గాలి కెరటాలు సోకి అతడు పడిన శ్రమనంతటినీ పోగొడుతున్నాయి. ఉండుండి ఏ చెట్టు మీదనుంచో ఒక కోకిల కుహుకుహూమని కూస్తోంది. అర్ధరాత్రి భూలోకంలో విహరించటానికి వచ్చి జలక్రీడలాడుతున్న దేవకన్యల గాజుల్లాగ నదిలో అలలు గలగల శబ్దం చేస్తున్నాయి. కాని దేవదత్తుడి దృష్టి ఎక్కడో ఉన్నది. చుట్టూ ఉన్న ప్రశాంత సౌందర్యాన్ని చూసి ఆనందించే స్థితిలో లేడు. ఆ సమయంలో అక్కడ జయచంద్రుడే ఉంటే 'వెన్నెల ప్రేయసి నవ్వులా ఉంది; అని భావించుకునేవాడు. కాని దేవదత్తుడు ఆనాటి విచిత్రసంఘటనలను, రేపు తను చేయబోయే అద్భుత సాహసాలకు, ఒరలోని కాలకీలను తలుచుకుంటూ విసవిసనడచి ఇంటికి చేరుకున్నాడు. శుభ్రంగా స్నానం చేసి, మంచి దుస్తులు ధరించి, కాలకీలను కడిగి భద్రంగా దాచి శయ్య మీద పవళించాడు. చాలసేపు అటూ ఇటూ దొర్లిన తర్వాత నిద్రపట్టింది.

# 7

అయిదారు రోజులు గడిచాయి. ఒక్కొక్కరోజు ఒక్కొక్క యుగంగా గడుస్తోంది దేవదత్తునికి. తను సాహసయాత్రకు ఎప్పుడు బయలు దేరటం? చంద్రావతిని విడిచి ఒంటరిగా ఎలా వెళ్లటం? చెప్పి వెళ్లటమా చెప్పకుండా వెళ్లటమా? చెబితే చంద్రావతి వెళ్లనిస్తుందా? జయచంద్రుడు సిద్ధుని సంగతి చెబుతే నమ్ముతాడా? అంతా మోసమని కొట్టెయ్యడూ? ఏమో, తనకు మాత్రం సిద్ధుడు చెప్పిన చిలక సంగతి నమ్మటానికి వీలైనది గానే ఉంది. సిద్ధుడు చనిపోతూ చనిపోతూ అబద్ధం చెప్పవలసిన అవసరమేముంది? అది నిజమే అయి వుంటుంది. తను సాహసయాత్రకు బయలు దేరటంలో రెండు ప్రయోజనాలు కలిసివస్తాయి. ఒకటి, తనకు దేశాలు చూడాలని పుట్టిన కోరికా నెరవేరుతుంది. రెండు తన జన్మ రహస్యం తెలుసుకున్నట్టూ అవుతుంది. ఏమైనా సరే ఇక బయలుదేరాలని నిశ్చయించుకున్నాడు.

అతని ముఖవైఖరి అన్యమనస్కత చంద్రావతిని, జయచంద్రుణ్ణి బాగా కలవరపరిచాయి. కారణమేమిటో ఎంత గుచ్చి గుచ్చి అడిగినా చెప్పడు. తన స్థితిని బట్టి కొంచెం ఊహాగానం చేసుకుని జయచంద్రుడు ఉండబట్టలేక అడిగేశాడు: "ఏమయ్యా, కొంపదీసి నువ్వు కూడా ప్రేమలో పడ్డావా? చెప్పు, చేతనైనంత వరకూ సాయం జేస్తాను. దేవాలయంలో

పూజకని వచ్చిన ఏ అవంతి సుందరినో, మాళవికనో, వకుళావళికనో ప్రేమించలేదు కదా."

"ఛాఛా అదేమీ లేదోయ్. ప్రేమకీ మనకీ ఆమడ దూరం. అల్లాటప్పాగా చూసీచూడగానే ప్రేమించే రకం కాదు మనం. అది నీలాంటి వెర్రిబాగుల మనిషి చెయ్యాల్సిన పని. ప్రేమేమిటోయ్ ప్రేమ!" అని ఈసడించాడు దేవత్తుడు.

"ప్రేమేమిటా? ప్రేమ యనగా..." అని జయచంద్రుడు చెప్ప బోతుండగా దేవదత్తుడు పరధ్యానంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

ఈ సంభాషణ అయిన మర్నాడు దేవదత్తుడు ఊళ్ళోంచి మాయ మయ్యాడు. మహారాజుకీ, జయచంద్రుడికీ, చంద్రావతికీ వేర్వేరుగా ఉత్తరాలు రాసిపెట్టి వెళ్ళిపోయాడు. క్షణంలో ఈ వార్త ఊరంతా పొక్కిపోయింది.

మహారాజుకి రాసిన ఉత్తరంలో, తను ఏదో రహస్య కార్యం మీద దేశయాత్రకు బయలుదేరి వెడుతున్నానని, తిరిగి వచ్చేసరికి ఆరు మాసాలు పట్టవచ్చునని, అంతవరకు తన చెల్లెలను చంద్రావతికి ఏ లోటూ లేకుండా చూస్తూ వుండవలసిందని, కావలసినవన్నీ జాగ్రత్తగా అమరుస్తూ ఉండవలసిందనీ చెప్పకుండా వెళ్ళిపోతున్నందుకు క్షమించవలసిందనీ కోరాడు.

చంద్రావతికి రాసిన ఉత్తరంలో కూడా అవే విషయాలు రాస్తూ తమ ఇద్దరికీ సంబంధించిన ఒకానొక రహస్యాన్ని ఛేదించటానికి తాను దూరదేశం వెడుతున్నాననీ, తనకు ఏమి అపాయం వస్తుందోనని

బెంగపడవద్దనీ, తనకేమీ ఫరవాలేదనీ, రాజుగారికి కబురు పంపి ఏది కావలసినా తెప్పించుకోమనీ రాశాడు.

జయచంద్రుడికి బాగా పెద్ద ఉత్తరం రాశాడు. సిద్ధుడు తనకు మహాకాల దేవాలయంలో కనిపించిన క్షణం నుంచి తాను బయలుదేరి వెళ్ళేనాటి వరకూ జరిగిన వృత్తాంతం యావత్తూ పూసగుచ్చినట్టు రాశాడు. తన జన్మరహస్యం తెలుసుకోందే ఉండటం కష్టమైపోయిందనీ, ముందు చెబితే వెళ్ళనివ్వరని ఎవరితోనూ చెప్పకుండా వెడుతున్నాననీ, తన చెల్లెలు చంద్రావతికి ఏ అపాయమూ రాకుండా చూస్తూ ఉండమనీ కోరాడు అంతేగాక తాను రాసిన సిద్ధుని విషయం మొదలైనవేమీ ఎవరికీ చెప్పవద్దనీ కోరాడు.

తమ తమ ఉత్తరాలు చదువుకొని మహారాజు, చంద్రావతి, జయ చంద్రుడు ముగ్గురూ దుఃఖంలో మునిగిపోయారు. మహారాజు తన కుడిభుజం పోయినట్లే దిగులుపడ్డాడు. దేవదత్తుడు గడచిన సంవత్సర కాలంలోనూ అశ్వదళాన్ని ఎంతగా వృద్ధి చేసి తర్ఫీదు ఇచ్చిందీ, తనపట్ల ఎంత వినయ విధేయతలతో ప్రవర్తిస్తోందీ తెలుసుకుని అతడు తన సైన్యంలో ఉండటం వల్లనే తన రాజ్యం శత్రు దుర్భేజ్యంగా తయార యిందని భావిస్తున్నాడు. అటువంటివాడు రాజ్యంనుంచి హఠాత్తుగా మాయ మైపోవటం తనకు తీరని నష్టం అని విచారించాడు. దేవదత్తుడు కోరిన విధంగా చంద్రావతికి ఏ లోటూ రాకుండా అన్ని ఏర్పాట్లూ చేయించాడు.

జయచంద్రుని తండ్రి రణవర్మకు దేవదత్తుడు మాయం కావటం చీమకుట్టి నట్లయినా అనిపించలేదు. "నేను చెప్పలా, అతడు నమ్మదగిన

వాడు కాడని? మహారాజు నా మాట విన్నారూ? నెత్తినెక్కించుకున్నారు. మహారాజు దాకా ఎందుకూ? నువ్వుమాత్రం, చెబితే విన్నావూ? వాడితో స్నేహం చేశావు. ఇప్పుడు తెలిసిందా వాడెటువంటివాడో. అతని చెల్లెలూ ఎప్పుడో ఇలాగే పారిపోతుంది. నాకు తెలుసు." అని కొడుకుతో అన్నాడు. జయచంద్రుడు తండ్రి కేసి క్రూరంగా చూసి, భుజాలెగరేసి అవతలకు వెళ్ళిపోయాడు.

ఇంక చంద్రావతి దుఃఖం చెప్పటానికి వీల్లేదు. అన్న తనతో చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయినందుకు కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. అన్న అన్న ప్రకారం తిరిగి రాకపోతే తన గతేమిటో అని భయపడింది. తనేమైపోయినా అన్నకు ఏ కష్టమూ, ప్రమాదమూ రానివ్వవద్దని దేవతలను పేరు పేరునా ప్రార్థించింది.

## 7

సిద్ధుడు చెప్పిన గుర్తుల్ని అనుసరిస్తూ దేవదత్తుడు శల్యాణ సజ్జితమైన పంచకల్యాణీ తురగం మీద ఉత్తర పదిగా బయలుదేరాడు. చిన్న చిన్న నదులనేకం దాటాడు. కొండలు, కోనలు, వనపథాలు, జనపదాలు దాటాడు. దారిలో ఎన్నో పట్టణాల్లో ఆగి అక్కడి వింతలు, విశేషాలు చూశాడు. ఆయా రాజ్యల్లో ప్రజల ఆచార వ్యవహారాలు పరిశీలించిఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాడు. అడవుల్లో క్రూర మృగాలెన్నిటినో కాలకీలతో

సంహరిస్తూ, అంతకంటె భయంకరులైన దారి దోపిడి దొంగలను వీలైనప్పుడు తప్పించుకుంటూ, వీలుకానప్పుడు యమలోకానికి రవాణా చేస్తూ ముందుకు సాగిపోతున్నాడు. అప్పుడప్పుడు సార్ధవాహులు ఏ పట్టణంలోనో వ్యాపారం 'కోసం ఆగిపోతే వారినక్కడే వదిలిపెట్టి తను సాగిపోతున్నాడు.

అప్పటికి దాదాపు యాభై ఆమడల దూరం వచ్చాడు. నిరంతర ప్రయాణం వలన బాగా అలసిపోయాడు. అతడెక్కిన గుర్రం కూడా బాగా అలసిపోయింది. అది నడవలేక నడవలేక నడుస్తున్నది. గ్రీష్మకాలం కావటం చేత ఎండ బీభత్సంగా పేలిపోతోంది. ఎక్కడా నీటి చుక్క దొరక్క పోవటం చేత గుర్రానికీ,రౌతుకీ కూడా గొంతుక లెండిపోతున్నాయి. గాడ్పు భయంకరంగా వీస్తూ వళ్లంతా వేడెక్కి కమిలిపోతోంది. విశ్రమిద్దా మన్నా ఎక్కడా చల్లని నీడనిచ్చె చెట్టు లేదు. దేవదత్తునికి గుర్రం మీద జాలి కలిగి దిగి నడిపిస్తున్నాడు.

ఇంతలో దూరాన ఒక నది కనిపించింది. పట్టరాని సంతోషంతో దేవదత్తుడు వేగంగా నడిచి నదిని సమీపించాడు. నీరు చాలా భాగం ఎండిపోయి అట్టే లోతుగా లేదు. కడుపునిండా నీళ్ళు తాగి, గుర్రాన్ని కూడా నీళ్ళు తాగించాడు. దుస్తులు విప్పి శుభ్రంగా స్నానం చేశాడు. నదికవతల ఒక నగరం ఉన్నది. గొర్రెల్ని కాచుకుంటున్న ఒక గొల్లవాణ్ణి అడిగి ఆ నదిని మేఘలానది అంటారనీ, ఆ పట్టణాన్ని మేఖలావతి అంటారనీ తెలుసుకున్నాడు. నది దాటి పట్టణంలో ప్రవేశించాడు.

రాజవీధి చాలా విశాలంగా ఉన్నది. అటూ ఇటూ నగలకొొట్లు, బట్టల కొొట్లు, పాత్రసామానుల కొొట్లు, కాయగూరల అంగళ్ళు, పువ్వుల అంగళ్ళు బార్లుగా ఉన్నాయి. రాజపురుషులు, క్షత్రియ కుమారులు అశ్వాల మీద విలాసంగా వీథిలో అటూ ఇలూ తిరుగుతున్నారు. వీథి మధ్యలో చుట్టూ ఇనుపకమ్ములు పాతిన గుండ్రని ఆవరణలో పూలమొక్కలు, పచ్చికపట్టు, నడుమ జలధారలు చిమ్ముతున్న జలయంత్రం ఉన్నవి. ఒకచోట ఒక ఇంద్రజాలికుడు ఏవో మాయలు చేస్తున్నాడు. ఒకచోట దొమ్మరిసాని గడ ఎక్కి ఆడుతున్నది. ఒకచోట భజన బృందం వాళ్ళు దీపపు సెమ్మె చుట్టూ చిందులు త్రొక్కుతూ గొంతెత్తి పాడుతున్నారు. ఈ జనసమూహాలన్నిటినీ తప్పించుకుంటూ దేవదత్తుడు ముందుకు పోతున్నాడు.

“పువ్వులు కావాలా అందగాడా!” అని ఒక పుష్పలావిక దేవదత్తుణ్ణి నిలవేసింది. “నాకెందూ పువ్వులు; నేను పరదేశిని” అన్నాడు దేవదత్తుడు.

“పరదేశివి గనకే పువ్వులు కావాలా అని అడుగుతున్నాను. తీసుకో, ఇదిగో మందార మాల. చవక. నా దగ్గిర అన్నీ చవకే” అంటూ ఆ పూలపిల్ల అతనికేసి అదో రకంగా చూసి నవ్వింది. దేవదత్తుడు చిరాకుగా “అక్కర్లేదు” అంటూ నడిచాడు. మళ్ళీ వెనక్కి వచ్చి “అమ్మీ! ఇక్కడెక్కడైనా సత్రం ఉన్నదా? ఆకలవుతోంది,” అన్నాడు.

“మాయింటికిరా. చక్కని పిండివంటలు చేసి పెడతాను,” అన్నది పుష్పలావిక.

అతడు కఠినంగా, "నాకు కావలసింది సత్రం. చెబితే చెప్పు, లేకపోతే నా దారిన నేను పోతాను," అన్నాడు. అతని మాటలకామె వెనక్కి తగ్గింది. "అదుగో ఆ సందులో ఒక సత్రం ఉన్నది," అని చూపించినది.

దేవదత్తుడు ఆమెకు కృతజ్ఞత తెలపకుండానే వెళ్లిపోయాడు. సత్రం దగ్గర ఆగాడు. సత్రం నౌకరొకడు వచ్చి అతని చేతుల్లోంచి కళ్లెం తీసుకొని గుర్రాల సాలలో కట్టి వేశాడు. దేవదత్తుడు సత్రం లోపలికి వెళ్లాడు. సత్రం యజమాని ఎదురొచ్చి ఆహ్వానించాడు. షడ్రసోపేతమైన భోజనం పెట్టాడు. భోజనం చేసిన తరవాత దేవదత్తుడు తన కోసం కేటాయించిన గదిలో సుఖంగా నిద్రపోయాడు.

చాలాసేపు నిద్రపోయి, దేవదత్తుడు పక్కమీద పడుకునే కళ్లు తెరుచుకుని గది కప్పుకేసి చూస్తూ ఏదో ఆలోచనలో మునిగిపోయాడు. ఇంతలో ఎవరో తనకేసి చూస్తున్నట్లనిపించి పక్కకు తిరిగాడు. కిటికీ ఊచల్ని పట్టుకుని ఎవరో యువతి తనకేసే చూస్తున్నది. దేవదత్తుడు ఉలిక్కి పడి లేచి కూర్చున్నాడు. "ఎవరు నువ్వు?" అని అడిగాడు.

"ఈ యిల్లు మాదేనండి. సత్రం యజమాని మానాన్నే నండి," అన్నదామె.

"ఎందుకలా వింతగా చూస్తున్నావు?"

"ఏమీ లేదండి నిద్రలేస్తారేమో, మీకేమైనా కావాలేమో అడుగుదామని ఇక్కడ నుంచున్నానండి," అని సిగ్గుపడుతూ తలవంచుకుని అన్నదామె.

"కాసిన మంచినీళ్లు తెచ్చిపెట్టు" యువతి జలపాత్ర తెచ్చి ఇచ్చింది. దేవదత్తుడు మంచినీళ్లు గడగడ తాగేశాడు. "ఇంకా కావాలి," అన్నాడు.

ఇంకో పాత్రనిండా నీళ్లు తెచ్చింది. ఆ నీళ్లు కూడా గడగడ తాగేశాడు. "ఇంకా కావాలి" అన్నాడు. యువతి తెల్లబోయి చూసింది ఇన్ని నీళ్లు తాగుతున్నాడేమిటా అని. "బిందెతో తీసుకురానా అండి" అని అడిగింది. దేవదత్తునికి నవ్వు వచ్చింది. కొద్దిగా నవ్వాడు. ఆ అమ్మాయి కూడా నవ్వింది. అతడు మళ్ళీ నవ్వాడు. అతని నవ్వు చూడగానే ఆమెకు పట్టశక్యం కాకుండా నవ్వొచ్చేసింది. పగలబడి నవ్వుతూ ఆమె పరుగెత్తుకుపోయి మళ్లీ పాత్రనిండా తెచ్చింది. "చాలాండి," అన్నది. "చాలు" అన్నాడు దేవదత్తుడు.

"మీ పేరేమిటండీ?" అన్నదా యువతి.

"ఉజ్జయిని" అన్నాడతడు.

"అదేం పేరండి. చిత్రంగా ఉన్నదే. మరి మీ ఊరు?" అని అమాయకంగా అడిగింది.

"దేవదత్తుడు," అన్నాడతడు. ఆమె కేసి పరధ్యానంగా చూస్తూ.

"అదేమిటి మొగాళ్లపేరు లాగా ఉందే!"

"అహహ. మరిచిపోయాను. నా పేరు దేవదత్తుడు. మా ఊరు ఉజ్జయిని," అన్నాడు దేవదత్తుడు. యువతి మళ్లీ మువ్వలు మోగించినట్టు నవ్వింది. ఆమెకు పదహారేళ్లుంటాయి. ఆకు పచ్చరంగు చీర ధరించి సీతాకోకచిలకలా ఉంది. బొద్దుగా, పుష్టిగా, గజ్జెల గుర్రంలా, వికసించిన నందివర్ధనం పువ్వులా ఉన్నది. ఆమెను కళ్లార్పకుండా చూస్తూ "మరి నీ పేరేమిటి?" అడిగాడు దేవదత్తుడు.

"నా పేరు కాంచనమాలండి," అన్నదామె.

"పేరు బావుంది. మరి నువ్వు బంగారంలాగ మెరిసిపోవటం లేదేం? చామనచాయగా ఉన్నావేం?"

"మనిషిని బట్టి పేరు పెడతారా ఎక్కడన్నా? మరి మీ పేరు దేవదత్తుడు గదా. మిమ్మల్ని దేవుడు ఇచ్చాడా మీ తల్లిదండ్రులకి?" అడిగిందామె.

"ఏమో నాకు తెలియదు. దేవుడే ఇచ్చి ఉండవచ్చు..." అని ఏదో ఆలోచనలో పడిపోయాడు దేవదత్తుడు.

రెండురోజులతడా సత్రంలోనే ఉన్నాడు. బాగా విశ్రాంతి తీసుకున్నాడు– అతని బడలిక పూర్తిగా తీరింది. అతని గుర్రం కూడా యథాప్రకారంగా తయారైంది. ఆ రెండు రోజుల్లోనూ దేవదత్తుడు ఊరంతా తిరిగాడు. "చాలా చక్కగా ఉంది ఊరు," అనుకున్నాడు.

మూడోరోజున అతడు బయలుదేరటానికి నిశ్చయించుకున్నాడు. మూటా, ముల్లె సర్దుకుంటున్నాడు. ఇంతలో భోజనశాలలో నుంచి స్త్రీ ఆర్తనాదం వినిపించింది. ఆ గొంతు కాంచనమాలదే అని గుర్తు పట్టాడు. కత్తి తీసుకుని క్షణంలో భోజనశాలలోకి వచ్చాడు.

విలువైన దుస్తులు ధరించిన రాజపురుషుడొకడు కాంచనమాల చీర చెరగుపట్టుకుని లాగుతున్నాడు. ఆమె తప్పించుకోవాలని పెనగులాడుతున్నది. ఆ రాజపురుషుని వెనకాల నలుగురు సైనిక వేషాల్లో ఉన్న రాజభటులున్నారు. పదిపదిహేనుగురు బాటసార్లు బార్లుతీర్చి భోజనాలు చేస్తున్నారు. కాంచనమాల తండ్రి గజగజ వణకిపోతూ ఒక మూల

ఒదిగి నుంచున్నాడు. దుర్మార్గుడైనా ఆ రాజపురుషుణ్ణి ఏం చెయ్యటానికీ చేతకాక అందరూ శిలాప్రతిమల్లా చూస్తూ ఉండిపోయారు.

దేవదత్తుణ్ణి చూడగానే కాంచనమాల తండ్రి గభాలున వచ్చి చేతులు పట్టుకుని "అయ్యా రక్షించండి. ఈ దుర్మార్గుడు నా కుమార్తెను లాక్కుపోవ టానికి వచ్చాడు," అని అరిచాడు.

దేవదత్తుడు "ఎవడు వీడు?" అన్నాడు.

"వీడు ఈ నగరం రాజుగారి బావమరిది, వీడి చేతుల్లో ఎందరు స్త్రీలు బాధపడ్డారో చెప్పలేను. వీడు రోజూ ఇలాగే నలుగురు భటుల్ని వెంటబెట్టుకుని ఎవరింట్లో పడితే వారింట్లో చొరబడి స్త్రీలను బలాత్కరిస్తూ ఉంటాడు. ఇక్కడికిదివరకు వీడు చాలాసార్లు వచ్చాడు. నా కుమార్తెను చూసి మోహించాడు. అభం శుభం తెలియని చిన్నపిల్ల. తల్లి చిన్నప్పుడేపోతే అల్లారుముద్దుగా పెంచాను. ఏ అయ్యచేతుల్లోనే పెట్టి పెళ్ళయిందనిపిస్తే నా బరువు తీరిపోతుంది. రక్షించండి బాబూ!" అని సత్రం యజమాని ఏడ్చాడు.

"ఎవడురా వీడు?" అని రాజుగారి బావమరిది కాంచనమాల కొంగు వదిలిపెట్టాడు. వాడివి కోరమీసాలు, దుబ్బుగా పెరిగిన కనుబొమలు, వాటిక్రింద ఎర్రగా నెత్తురు ముద్దల్లాగ ఉన్న కళ్ళు, ఒంటినిండా భల్లూక రోమాలు; ఒక చేత్తో మధుపాత్ర పట్టుకున్నాడు. ఒక భటుడు మాటిమాటికి ఒక కలశంలోంచి పాత్ర నింపుతున్నాడు. బాగా కైపెక్కి మనిషి తూల్తున్నాడు.

"నేనెవరైతే నీకెందుకు? నీ దారిన నువ్వు ఫో. మళ్ళీ యీ ఛాయలకు రాబోకు బుద్ధిగా మసులుకో. లేకపోతే ఎప్పటికైనా నాలాంటివాడి చేతుల్లో దేహశుద్ధి కాగలదు." అని దేవదత్తుడు నెమ్మదిగా మందలించాడు.

రాజ్యపాలకుడు ఈ మాటలు విని పర్జన్యంలా గర్జించాడు. వాడి వెనకాల ఉన్న భటులు నలుగురూ కత్తులు దూసి దేవదత్తునివైపు రాసాగారు. కాని రాజ్యపాలకుడు వారిని విలాపంగా ఒక చేత్తో వారించి రెండో చేతిలోని మధుపాత్ర వెనక్కి విసిరేశాడు. కత్తి నడుముకు వేళ్లాడుతోంది. నడుముపై చేతులు వేసుకుని దేవదత్తుణ్ణి విషపు చూపులు చూశాడు.

"నన్నింతవరకూ ఈ రాజ్యంలో ఎదిరించినవాడు లేడు. మా బావ కూడా నేనంటే తారుకుని జారుకుంటాడు. వీరాధివీరులమని విర్రవీగే అనేకులు నా కత్తికి బలై పోయారు. నువ్వు పరదేశివై ఉంటావు. పాపం అందుకనే నా సంగతి తెలియక కారుకూతలు కూశావు. క్షమించాను–ఫో," అన్నాడు.

"ఛీ! కుక్కా! నువ్వా నన్ను క్షమించేది? నేను నిన్ను క్షమించాను ఫో అవతలికి. నిస్సహాయురాలైన ఆడపిల్ల మీద అత్యాచారం తలపెట్టి సిగ్గులేక మాట్లాడుతున్నావా?" అని ఉద్రిక్తుడై అన్నాడు దేవదత్తుడు.

వీరి వాగ్వాదం విని భోజనాలు చేస్తున్న బాటసార్లు భయభ్రాంతులై లేచిపోయి ఒక మూలకు చేరారు. కాంచనమాల తన తండ్రిని పొదివి పట్టుకుని మరొక మూలకు చేరింది. మధ్యగా దేవదత్తుడు, రాజ్యపాలకుడూ ఉన్నారు. భటులు దూరంగా ఉన్నారు.

రాజ్యపాలకుడికి కైపు దిగిపోయింది. పూర్తి తెలివిలో ఉన్నాడు. శత్రువును ఆపాదమస్తకం పరికించి చూశాడు. క్షణంలో కనురెప్ప మూసి తెరిచేంతలో ఒరలోంచి కత్తి దూసి దేవదత్తునిపై కురికాడు. దేవదత్తుడు పక్కకు ఒత్తిగిల్లాడు. రాజ్యపాలకుడు సరాసరి పోయి గోడకు కొట్టుకున్నాడు. నుదురు బద్దలై రక్తం కారసాగింది. దెబ్బతిన్న పులిలాగ గాండ్రుమంటూ గిరుక్కున తిరిగాడు. మళ్ళీ కత్తి ఎత్తి దేవదత్తునిపైకి వచ్చాడు. దేవదత్తుడు ఒరలోంచి ఖడ్గం తీయనేలేదు. ఒక చేత్తో రాజ్యపాలకుని చెయ్యి పట్టుకుని మెలికలు తిప్పి కత్తి లాక్కుని అవతల పారేశాడు. గడ్డం కింద రెండుపోట్లు పొడిచి నేలమీద కూలవేశాడు.

తమ యజమానికి జరిగిన పరాభవం చూసి నలుగురు సైనికులూ కత్తులు దూసి దేవదత్తుని పైకి వచ్చారు. అతడు చరాలున కత్తి దూసి నలుగురితోనూ ఒకేసారి యుద్ధం చేయసాగాడు. విశాలమైన భోజనశాల వీరికి యుద్ధరంగంగా మారిపోయింది. దేవదత్తుడు కాలకీలను మెరుపుతీగలా మెరిపిస్తూ కొద్దినిమిషాల్లో నలుగురి కత్తులనూ తునాతనకలు చేశాడు. ఎవరినీ చంపగూడదని నిశ్చయించుకున్నాడు. అందుచేత వారిని సురక్షితంగా పారిపోనిచ్చాడు. వారు పారిపోవటంతో రాజ్యపాలకుడు తన కత్తి తీసుకోకుండానే పలాయనమంత్రం పఠించాడు.

దేవదత్తుని పరాక్రమం, అతని ఖడ్గ చాకచక్యం, అన్నిటినీ మించిన అతని ఔదార్యం చూసి భోజనశాలలోని వారు, బయటనుంచి చూస్తున్న వారూ ఆశ్చర్యపోయారు. అర్జునుడో, అతని కుమారుడోనని విభ్రాంతుల య్యారు.

కాంచనమాల సరాసరి అతని వద్దకు వచ్చి, కన్నీళ్లు కారుస్తూ పాదాలపై పడింది. అతడామెను లేవనెత్తి "భయపడకు కాంచనమాలా! ఇక రాజుగారి బావమరిది నీ ఛాయలకు రాడు. నీ ఛాయలకే కాదు. ఎవరి ఛాయలకూ పోడు. వాడి కుడిచెయ్యి శాశ్వతంగా నిరుపయోగమైంది. మణికట్టు దగ్గిర మెలిపెట్టి వాడికి జీవితాంతం జ్ఞాపకం ఉండేట్టు ఒక చిన్న ఎముకను విరగ్గొట్టాను. ఛా, ఏడవకు నీకేం భయం లేదు," అన్నాడు.

గృహ యజమాని అతనికి కృతజ్ఞత తెలుపుకున్నాడు. బాటసారులు అతన్ని ప్రశంసించారు. రాజ్యపాలకుణ్ణి అతడు పరాభవించిన సంగతి అప్పుడే విన్న వారందరూ గుంపులుగా వచ్చి అతన్ని చూసిపోతున్నారు. ఇక అక్కడ ఉండటం క్షేమం కాదని దేవదత్తుడు తన గదిలోకి పోయి మూటాముల్లె తీసుకున్నాడు. గుర్రాల చావడిలోకి పోయి తన గుర్రానికి జీను వగైరా ఏర్పాటు చేసుకున్నాడు. గుర్రం ఎక్కి కూర్చున్నాడు. ఇంతలో కాంచనమాల పరుగెత్తుకుని వచ్చింది.

"వెళ్ళిపోతున్నారా మీరు? అప్పుడేనా?" అని అడిగిందామె.

"అవును కాంచనమాలా? నేనొక మహత్కార్యం మీద ఎక్కడికో దూర దూర ప్రదేశాలకు పోతున్నాను. ఇప్పటికే రెండు రోజులు ఇక్కడ ఆలసించాను. ఇక వెళ్ళక తప్పదు!" దేవదత్తుడన్నాడు.

"నన్నేం చేసిపోతారు? నేనేమైపోను?" అన్నదామె.

దేవదత్తుడు నవ్వుతూ "నన్నడుగుతావేం కాంచనమాలా? నీ తండ్రి నడుగు త్వరగా వివాహం చెయ్యమని. చక్కని అబ్బాయిని పెళ్లి చేసుకుని

సుఖంగా ఉండు. నీకు పిల్లలు పుట్టిన తరువాత ఎప్పుడో ఒకసారి వచ్చి చూస్తాలే. నాకిదివరకే ఒక చెల్లెలున్నది. దూరదేశంలో ఇంకొక చెల్లెల్ని సంపాదించానని మా చంద్రావతితో చెబుతాను," అన్నాడు.

"నేను మీకు చెల్లల్నా, దేవదత్తా! ఆ రోజున మీరు గదిలో నిద్రపోతు న్నప్పుడు చూసీ చూడగానే నా మనస్సు మీకు అంకితమైపోయింది. ఎప్పటికైనా మీరే నాకు భర్త అని ఆనాడే నేను నిశ్చయించుకున్నాను. ఇప్పుడు నన్నిలా వదిలేసి వెళ్ళిపోకండి. నేను కూడా మీతో వస్తాను. మీ సేవ చేస్తూ జీవితం గడుపుతాను. వద్దనకండి," అని కన్నీళ్ళు చెక్కిళ్ళపై ధారలుగా కారిపోతుండగా అన్నది.

ఆమె దుఃఖం చూసి దేవదత్తుని కళ్ళు చెమ్మగిల్లాయి. నిర్మలమైన అతని అంతరంగంలో జాలి జాలువారింది. వాత్సల్యంతో ఆమెను దగ్గరికి తీసుకుని తల నిమురుతూ "కాంచనమాలా! నువ్వు పొరబాటు చేశావు. నేను దేశద్రిమ్మరిని. ఎక్కడికో తెలియరాని దూరాలకు పోతున్నాను. అక్కడ నాకే అపాయం సంభవిస్తుందో, జీవిస్తానో మరణిస్తానో నాకే తెలియదు. నన్నెందుకు ప్రేమించావు కాంచన మాలా? నేనెవరినో నీకు తెలియదు కొత్తవాణ్ణి, పరదేశిని ఇలాగ అర్ధంతరంగా ప్రేమించటం న్యాయమేనా? కన్నీళ్ళు తుడుచుకో, ధైర్యంగా ఉండు. నీ తండ్రి నీకు త్వరలో వివాహం చేస్తాడు. భర్తతో సుఖించు.నలుగురి పిల్లల్ని కని నీ గృహిణీ ధర్మం నెరవేర్చు నువ్వు నా చెల్లిలిలాంటి దానివి. నిన్ను ఈ రెండురోజులూ ఆ భావంతోనే చూశాను. నువ్వు అపార్థం చేసుకున్నట్లయితే మన్నించు. ఇక వస్తాను. మధ్యాహ్నమవుతోంది," అంటూ గుర్రాన్ని ముందుకు పోనిచ్చాడు.

"సరే వెళ్ళండి. దేవదత్తా! కాని ఈ జన్మలో మిమ్మల్ని మరచిపోలేను. నేను మరొకర్ని వివాహమాడినా, ఆడకపోయినా ఎప్పుడూ మీరే నా భర్తగా నా మనస్సులో ఆరాధించుకుంటూ ఉంటాను. మీ రూపు రేఖలనే ఆరాధించుకుంటూ ఉంటాను. మేఖలా నదీతీరాన తమాలవృక్షాల నీడలలో, నదికి దూరాన మైదానపు ఒంటరిదారుల్లో, అర్ధరాత్రి వేళ పండుటాకుల గలగలల్లో మీ కోసమే ఎదురుచూస్తూ, మీ అడుగుల సవ్వడి కోసం చెవులు రిక్కించుకుని, హయారూఢమైన మీ దీర్ఘ గంభీరాకృతిని అన్వేషిస్తూ గడుపుతాను. వెళ్ళండి. ఇక పొండి. త్వర త్వరగా త్వరగా నా హృదయాన్ని చీల్చుకుంటూ పొండి," అని కాంచనమాల ఆవేశంతో కంపించి పోతూ రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని వెళ్ళిపోయింది. దేవదత్తుడు జలభారంతో వంగిన శ్రావణ మేఘంలాగ గుర్రం మీదనే క్రుంగిపోయి కూర్చుని ఆమె వెళ్ళిన వైపే కొన్ని క్షణాలు చూశాడు. తరవాత ఒక నిట్టూర్పు విడిచి సత్రం ఇవతలకు వచ్చి, రాజవీధిలో ప్రవేశించాడు.

## 9

సందుమొగలో అతనికి మొట్టమొదటగా కనిపించిన వ్యక్తి జయచంద్రుడు! అదిరిపడి, ఉలికిపడి, గుండె కాసేపు ఆగిపోయి, మళ్ళీ దడదడ కొట్టుకుని, ఉక్కిరిబిక్కిరై, ఆనందంలో మునిగిపోయి స్నానం చేసి మళ్ళీ పైకి తేలి, దేవదత్తుడు నాట్యం చేసినంత పని చేశాడు. "అరె జయచంద్రుడూ, చంద్రుడూ, స్నేహితుడూ, ప్రాణమిత్రుడూ, ఏమిటోయ్

ఇక్కడున్నావేమిటోయ్, ఎల్లా వచ్చావోయ్, ఎప్పుడు వచ్చావోయ్, అలా చూస్తావేమిటోయ్, మాట్లాడవేమిటోయ్" అని గబగబ బట్టీ పట్టింది అప్ప చెప్పినట్టు దేవదత్తుడు ప్రశ్నలు వర్షంలా కురిపించాడు.

జయచంద్రుడు దేవదత్తుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. భుజం మీద ఆప్యాయంగా చరిచాడు. దేవదత్తుడు మళ్ళీ అంతకంటే ఆప్యాయంగా చరిచాడు. జయచంద్రుడూ మళ్ళీ చరిచాడు. దేవదత్తుడూ చరిచాడు. ఇలాగ కొంతసేపైన తర్వాత అలిసిపోయి ఆగారు.

"ఏమిటీ? ఎందుకు ఎలా ఎప్పుడు వచ్చావ్?" అన్నాడు దేవదత్తుడు క్లుప్తంగా.

"నీ కోసం గుర్రం మీద ఇప్పుడే." అని జయచంద్రుడు ఇంకా క్లుప్తంగా జవాబిచ్చాడు.

"మరి ఇంటి దగ్గిర చంద్రావతి, మహారాజు, మీ నాన్న ఉజ్జయిని, రాజ్యం, ప్రజలు..."

"అంతా క్షేమం. ఎవరికీ ఏ జబ్బూ లేదు. అందులో మా నాన్నకి అసలు లేదు. దుండుముక్కలా బలుస్తున్నాడు."

"ఎందుకిలా వచ్చావ్?"

"నీ కోసమే. నువ్వు ఉత్తరం రాసిపెట్టి వెళ్ళిపోయింది. లగాయతు మీ చెల్లెలు, అనగా చంద్రావతి, అనగా నాయొక్క..."

"సరే తెలిసిందిలే. తరవాతది చెప్పు"

"ఆమె కన్నీరు మున్నీరుగా విలపించసాగింది. నాకొక రోజున కబురు పెట్టింది. వెళ్ళాను. నన్ను తక్షణం ఉన్నపళంగా బయలుదేరి

నిన్ను వెదుక్కొని తీసుకుని రమ్మంది. నువ్వు రానని మొండికెత్తితే నీకే అపాయమూ రాకుండా కాపాడుతూ నీ నీడలా తిరగమన్నది. “నీ సోదరుడు సామాన్యుడు కాదు. సవ్యసాచిలాంటివాడు. ముల్లోకాల్లోనూ అతని కెదురు నిలవగలిగినవారు లేరు,” ఆమాట అని ఎంత చెప్పినా ఆమె వినలేదు. ఆమె ప్రార్ధన తిరస్కరించలేక ఇంటి వద్ద ఉత్తరం రాసిపెట్టి, నువ్వు చెప్పిన గుర్తుల్ని అనుసరించి నిన్ను వెదుక్కుంటూ హుటాహుటిగా వచ్చేశాను,” అని వచ్చిన కారణం వివరించాడు జయచంద్రుడు.

“నయమే అదృష్టవశాత్తు కలిశాం మరి కాసేపైతే నేను ఊరుదాటి వెళ్ళిపోయి ఉండేవాణ్ణి. నేనెక్కడా ఒక్క పూటకంటే ఎక్కువ బస చెయ్యలేదు. ఈ వూళ్లోనే రెండు రోజుల్నించీ విశ్రాంతి కోసం ఆగిపోయాను. నేను అలా ఆగకుండా వెళ్ళిపోయినా కలిసేవాళ్ళం కాదు. అంతా దైవనిర్ణయం లాగా ఉంది. ఇక పద పోదాం. పోవలసిన దూరం చాలా ఉంది.”

ఇద్దరూ రాజవీథి దాటి సందులు గొందుల్లోంచి ఊరి బయటకు వచ్చారు. నగరాన్ని మొలనూలులూ చుట్టి ఉన్న మేఖలానదిని మళ్ళీ దాటి ప్రయాణం సాగించారు. దేవదత్తుడు తను అంతకు కొంచెం ముందు సత్రంలో చేసిన ఘనకార్యం మిత్రునికి చెప్పాడు. మార్గమధ్యంలో తనకు జరిగిన అనుభవాలన్నీ వర్ణించాడు. ఇంకా వెనక్కిపోయి కాళికాలయంలో సిద్ధుణ్ణి వధించటం వగైరా వృత్తాంతమంతా చెప్పాడు. జయచంద్రు డంతా విని “చిన్న పొరబాటు చేశావ్!” అన్నాడు.

“ఏమిటది?”

“కాంచనమాలను ప్రేమించకపోవటం చాలా అన్యాయం. ఆమెను

పెళ్ళి చేసుకుని శుభ్రంగా ఇంటికి వచ్చేయవలసింది,” అన్నాడు జయచంద్రుడు.

“ఏడ్చినట్లుంది. నేనింత దూరం వచ్చింది ప్రేమించి పెళ్ళి చేసుకుని పోవటం కోసమా? పైగా ప్రేమించటం నా చేతుల్లో ఉందా? అన్ని శృంగార కావ్యాలు చదివి ప్రేమను గూర్చి నీకు తెలిసింది ఇదా? కాంచన మాలను చూడగానే నాకు దూర దేశంలో చెల్లెలు దొరికినట్లనిపించింది గాని జయచంద్రునికి చంద్రావతి దొరికినట్లనిపించలేదు...”

“అది నీ దురదృష్టం. నేనేం చెయ్యను. ఇకనైనా జాగ్రత్తపడు,” అన్నాడు జయచంద్రుడు నవ్వుతూ.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ అలా రోజులకు రోజులు ప్రయాణం చేశారు. ఇద్దరూ యోధానుయోధులు, ఖడ్గప్రవీణులు, శూరులు, వీరులు, ధీరులు, వారికడ్డేమిటి? దారి పొడుగున్నా వారిని జానపదులు, నాగరికులు కూడా సంభ్రమాశ్చర్యాలతో జోహార్లు చేస్తూ నిలబడి చూశారు. ఎక్కడికి వెళ్ళినా జయించటానికి వెళ్ళినట్టు అందరి మనస్సులూ చూరగొన్నారు. అందులో ఇద్దరూసుందరులు కావటం మరీ ఇదై పోయింది.ఒకరు మన్మథుడైతే మరొకరు వసంతుడి లాగా, ఒకరు కృష్ణుడైతే మరొకరు అర్జునుడి లాగా మెరిసిపోయారు.నగరాల రాజవీథుల్లోంచివారు పోతుండగా సౌధోపరిగ వాక్షాల్లోంచి రాచకన్నెలు చూసి మూర్ఛపోయే వారు. ఇద్దరిలో ఎవరిని ప్రేమించటమో తెలియక తికమకపడేవారు. ఎవరిని ప్రేమించటమో తెలిసినా లాభం లేదు గనుక గుండె రాయి చేసుకుని విరహగీతాలు పాడటం కూడా మానేసేవారు.

ఇలాగ లోకాన్ని జయించుకుంటూ ఆశ్వికులిరువురూ కొండలు, లోయలు, నదులు, ఊళ్ళు, బీళ్లు దాటిపోయారు. ఒక్కొక్కప్పుడు పందెం వేసుకున్నట్లు గుర్రాల్ని మైదానాల్లో వాయువేగంతో పరుగెత్తించేవారు. ఒక్కొక్కసారి మెల్లిగా పెళ్ళినడకలు నడిపించేవారు. బాగా అలసిపోయి నప్పుడు ఏ పట్టణ సత్రంలోనైనా ఆగి విశ్రాంతి తీసుకునేవారు.

ఇలా కొన్ని దినాల పయనం తర్వాత ఎలాగైతేనేం సింహగిరిని సమీపించారు. మరొక ఆమడ దూరం పోతే సింహగిరిని చేరుకుంటారు. దూరానికి ఆ కొండ బ్రహ్మాండమైన శివలింగంలా కనిపిస్తోంది. దాని చుట్టూ కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి ఒక మూడు క్రోసుల పరిధిలో వ్యాపించి వుంది. అడవిలో ఒక పల్లెటూరేదో ఉన్నది. అడవి కివతల పంట పొలాలున్నాయి.పొలాలు మధ్యగా సెలయేరొకటి ప్రవహిస్తోంది. సెలయేటి నుంచి పిల్ల కాలువలనేకం త్రవ్వబడి పొలాలకు నీరు సరఫరా చేస్తున్నాయి. పొలాలు కాక మామిడి తోటలు, నారింజ తోటలు,ఇంకా ఎన్నో రకాల పళ్ళ తోటలున్నాయి. తోటల్లోనూ, పొలాల్లోనూ రైతులు పని చేస్తున్నారు. కొందరు పొలాలకు నీరెక్కిస్తున్నారు.కొందరు నేల దున్నుతున్నారు. కొందరు చెట్లకు నీళ్లు తోడుతున్నారు. అంతా సందడిగా తేనె పట్టులాగా ఉన్నది. ఈ దృశ్యం వింతగా చూస్తూ నుంచుండిపోయారు మిత్రులిద్దరూ.

"ఎవరు నాయనా మీరు?" అని ఒక వృద్ధుడు వారిని ప్రశ్నించాడు.

"మేము పరదేశీయులం తాతా! ఏమీ తోచక దేశాలు తిరుగు దామని వచ్చాం," అన్నాడు జయచంద్రుడు.

"మంచిదే కాని ఇక్కణ్ణించి సాధ్యమైనంత త్వరగా వెళ్లిపోవటం క్షేమం. సింహకేతుడు మిమ్మల్ని చూశాడంటే ముక్కలు ముక్కలుగా నరికి సింహానికి పడేస్తాడు."

"వాడెవడూ?" అని ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"సింహకేతుడు తెలియదా? ఈ ప్రాంతానికి వాడే రాజు. రాక్షసుడు. మహా భయంకరుడు. వాడి పేరు చెబితే పులులు కూడా నీళ్ళు తాగవు," అన్నాడు తాత.

"అలాగా. మాకేం తెలుసు? మేమెక్కడో ఉజ్జయిని నుంచి వచ్చిన వాళ్ళం. మాకు వాడిపేరైనా తెలియదు. ఎక్కడుంటాడు వాడు?" అని జయచంద్రుడు ప్రశ్నించాడు.

"అదుగో ఆ కనిపించే కొండ ఉందే! దానిపేరు సింహగిరి. ఆ కొండ మీద తళతళ మెరిసిపోతూ కనిపిస్తోందే అదే కోట. ఆ కోటలో ఉంటాడు సింహకేతుడు. సాధారణంగా బయటికి రాడు. వచ్చాడంటే ఏదో గ్రామమో, పట్టణమో నాశనమైందన్న మాటే. పొలాలన్నీ తోటలన్నీ నాశనం చేస్తాడు, బుద్ధిపుడితే మనుషుల్ని తినేస్తాడు. వాణ్ణి ఇప్పటి వరకూ ఏ రాజూ, ఏ సైన్యమూ జయించలేకపోయింది".

"మరి మీరంతా ఇక్కడెలా ఉంటున్నారు?" అని అడిగాడు దేవదత్తుడు.

"ఈ కనిపించేదంతా వాడి రాజ్యమే. ఈ కొండ చుట్టూ రెండామడల వరకూ చిన్న చిన్న పల్లెలనేకం ఉన్నాయి. ఈ పల్లెలోని జనమంతా వాడి ప్రజలే. ఎక్కడెక్కడినించో అనేకులు పనివాళ్ళను, రైతుల్ని, వడ్రంగుల్ని,

శిల్పుల్ని వాడు బంధించి తెచ్చి ఇక్కడ బానిసలుగా ఉంచుకున్నాడు. మేమంతా వాడి బానిసలమే. మేము పొలాలు దున్ని పంట పండిస్తాము. తోటలు పెంచి పళ్ళు పండిస్తాము. వేటాడి మాంసం సంపాదిస్తాము. దీనిలో సింహకేతుడి అవసరాలకు పోగా మిగిలిందే మేము తినాలి. వాడికి మంచి మంచి బట్టలు నేసి ఇచ్చిన తరవాతే మేము కట్టుకోవాలి. మాలో కొందరు వడ్రంగులు, శిల్పులు ఉన్నారు. వీళ్లు వాడికి ఆ కొండ మీద అద్భుతమైన కోట కట్టిపెట్టారు. అంత చిత్రమైన కోట ప్రపంచంలో ఇంకెక్కడా ఉండదు. అది చూస్తే కళ్ళు తిరిగి పోతాయి. అందులో ఎన్ని చిత్రాలున్నాయో, ఎన్ని రహస్య మార్గాలున్నాయో, ఎన్ని ఇంద్రజాలాలున్నాయో కళ్ళారా చూసి తీరవలసిందే. దాన్ని కట్టినవాళ్ళు మహా శిల్పులు, శిల్పంలో ప్రవీణులని పేరుపడిన వాళ్ళందర్నీ ఎన్ని రాజ్యాల్లోనో, ఎన్ని నగరాల్లోనో వెదికి వెదికి తెచ్చాడు. అందులో వాడు హాయిగా ఉంటాడు," అని చెప్పాడు వృద్ధుడు.

"అందులో వాడొక్కడే ఉంటాడా?"

"ఒక్కడే ఉంటాడు. కాని పనులు చేసిపెట్టటానికి సేవకులు వస్తూపోతూ ఉంటారు. పొద్దునపూట వాడు కొలనులో స్నానం చేస్తాడు. కొందరు సేవకులు వాడికి వళ్ళు రుద్దాలి. అది అయిన తరువాత వాడు భోజనం చేస్తాడు. వాడి దగ్గర ఒక సింహం ఉన్నది. అది ఏనుగుగున్న అంత ఉంటుంది. అదంటే వాడికి ప్రాణం. ఒక్కొక్కసారి దాని మీదనే ఎక్కి ఎక్కడైనా వెళ్ళాంటే వెడుతూ ఉంటాడు. రోజూ వాడికి ఒక గొర్రెనీ, దానికొక గొర్రెనీ చంపి మాంసం వండి పట్టికెడతారు. తరవాత రెండు

మూడు వందల రొట్టెలు, ఇంకా బోలెడు పళ్లు తింటాడు. అదయిన తర్వాత తియ్యటి ద్రాక్షారసం ఒక పీపాడు తాగేస్తాడు. వళ్లెరగకుండా నిద్రపోతాడు. సాయంత్రం పూట లేచి తోటలో షికారు చేస్తాడు. లేకపోతే తన రాజ్యం ఎలా ఉందో చూడటానికి కొండదిగి వస్తాడు. ఎప్పుడో మూడు నెలలకొకసారి దేశాంతరం బయల్దేరుతాడు. ఏ దేశంలో ఏ విచిత్రవస్తువు దొరికితే దాన్నల్లా దొంగిలించి తెచ్చుకుంటాడు. అలాంటి విచిత్ర వస్తువులు వాటికోటనిండా ఉన్నాయి," అని అలిసిపోయి ఆగాడు వృద్ధుడు.

"ఆ కోటలో ఇక రాక్షసులెవరూ లేరా?" అని దేవదత్తుడడిగాడు.

"లేరు. ఎంతవరకూ నిజమో తెలియదుగాని, ఈ సింహకేతుడు రాక్షసజాతిలో ఆఖరివాడనీ, వాడితో వాడి వంశం ఆఖరనీ చెబుతారు. అందుకే తన వంశం అంతరించిపోకుండా వాడొక ఆలోచన చేస్తున్నాడు."

"ఏమిటది?" అని యువకులు కుతూహలులై అడిగారు.

"నాలుగేళ్ళ కిందట కాశ్మీర దేశం పోయి, కాశ్మీర రాజకుమారిని దొంగతనంగా తీసుకువచ్చాడు. అప్పటికామె పదహారేళ్ళ పిల్ల. ఆమెను వీడు మోహించాడు. కాని ఆమె మాత్రం వీడిని నిరాకరించింది. వాడి భయంకరాకారం చూసి ఏ యువతి మోహిస్తుంది? వీడామెను ఎలాగైన పెళ్ళి చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. విరహంతో కొట్టుకులాడి పోతున్నాడు. ఆమెను బలాత్కారంగా పెళ్ళి చేసుకుందామనుకున్నాడు కాని, ఆమె అలా జరిగితే తక్షణం విషం మింగి చనిపోతానని బెదిరిస్తోంది. ఆమె అందాల రాశి. ఆమె చనిపోతే వీడూ బతకలేడు. అందుకని ఆమెను ప్రాణప్రదంగా కాపాడుకుంటున్నాడు. ఆమెకు నయానా భయానా నచ్చ

చెప్పాలని చూస్తున్నాడు. ఆమె ఏదీ కోరకుండానే అన్నీ తెచ్చి ఇస్తాడు. నగలూ, నాణ్యాలూ కొల్లలుగా ఇచ్చాడు. పరిచారికల చేత సకల సేవలూ చేయిస్తున్నాడు. అయినా ఆమె వీడిని నిరాకరిస్తూనే ఉంది."

"ఓహో! చాలా వుందే కథ," అన్నారు మిత్రులు.

అప్పటికి సూర్యుడు పశ్చిమాద్రిని చేరబోతున్నాడు. ఎర్రని కాంతులు అంతటా వ్యాపించాయి. పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి. రైతులు పనులాపేసి గుంపులు గుంపులుగా ఇళ్ళకు చేరుకుంటున్నారు. పశువుల కాపరులు పశువుల్ని తోలుకుని వస్తున్నారు.

"ఇక మీరు పొండి నాయనా! ఈ ప్రదేశం కొత్త వారికి ఉండదగిన చోటు కాదు. ఉంటే మీకు మా గతే పడుతుంది. లేక ఇంకా ఘోరమైన గతే పట్టవచ్చు. మీరింకా చిన్నవారు. హాయిగా జీవించవలసిన వారు. వచ్చినదారినే పొండి," అని పోబోయాడు వృద్ధుడు.

అతన్ని నిలవేసి "తాతా! నువ్వు చాలా మంచి వాడివిలాగా వున్నావు. నీ మూలంగా మాక్కావలసిన విషయాలనేకం తెలిశాయి. మాకు నువ్వు మరికొంచెం సహాయం చేయాలి," అన్నాడు దేవదత్తుడు.

"ఏమిటది" అన్నాడు తాత తెల్లబోయి.

"మాకీ రాత్రి నీ యింట్లో బస ఏర్పాటు చెయ్యి. మాకు కాస్త తినడానికేదైనా పెట్టి, పడుకోటానికి చోటివ్వు. నీకు మా సంగతి అంతా చెబుతాము.

వృద్ధుడు మొదట ఇందుకు ఒప్పుకోలేదు. కాని యువకులు చాలాసేపు బ్రతిమాలగా ఒప్పుకున్నాడు. తన యింటికి తీసుకువెళ్లాడు.

అతని భార్య కూడా కొత్తవాళ్లను చూసి ఇంట్లోకి రానివ్వటానికి ఒప్పు కోలేదు. సింహకేతుడికి ఈ సంగతి తెలిస్తే అందర్నీ వరసపెట్టి చంపేస్తాడని అన్నది. మళ్ళీ యువకులు బ్రతిమాలగా బ్రతిమాలగా ఒప్పుకున్నది. వృద్ధ దంపతులు అతిధులకు కడుపునిండా అన్నం పెట్టారు. ఊరంతా మాటుమణిగిన తర్వాత వృద్ధుణ్ణి ఒంటరిగా కూర్చోబెట్టుకుని మిత్రు లిద్దరూ తమ కథంతా చెప్పారు. తాము ఏమైనా సరే సింహకేతుణ్ణి సంహరిస్తామనీ, వాణ్ణి సంహరించి తమకు కావలసిన చిలకను సంపాదిం చనిదే ఇంటికి పోమని ప్రాణాలకు తెగించే వచ్చామనీ చెప్పారు.

అంతా విని వృద్ధుడు "మీ ఇష్టం. మీరంత పట్టుదలగా ఉంటేనేనేం చెప్పను?చెప్పినా వింటారా పెడతారా? కాని మీలాంటి యువకులు ఇంత చిన్న వయస్సులో ఏ అపాయాలకు లోనవుతారో అని విచారిస్తున్నాను," అన్నాడు.

"మాకేం ఫర్వాలేదు. కోటలోకి వెళ్లే మార్గం చెప్పు. ఆ తర్వాత సంగతి మేము చూసుకుంటాము," అన్నాడు దేవదత్తుడు.

వృద్ధుడు కాసేపు ఆలోచించాడు. "కొండ మీదికి సరాసరీ ఎక్కటం సులువు కాదు. అద్దం లాగ నున్నగా జారిపోతూ ఉంటుంది. ఒకవేళ ఎక్కినా కోటగోడలు చాలా ఎత్తుగా ఉంటాయి. వాటిని ఎవ్వరూ ఎక్కలేరు. ఒక్కటే దోవ ఉంది. కొండలో ఒక గుహ ఉంది. ఆ గుహలోనుంచి పైకి మెట్లున్నాయి. అదొక్కటే మార్గం మామూలుగా రాక్షసుని సేవకులు ఆ మార్గానే వెడతారు. గుహలో కొందరు బలాఢ్యులైన మనుషులు కాపలా ఉంటారు. మెట్లకు పై చివర కొందరు కాపలా ఉంటారు. వీళ్ళని దాటి పోవటం కష్టం. ఒకవేళ దాటి పోయిన కోటలో సింహం ఉంది. ఆ సింహం విచ్చలవిడిగా కోటలో విహరిస్తూ ఉంటుంది. అది కొత్తవాళ్ళని పసికట్టిం

దంటే ఒక్క దెబ్బతో సఫా చేస్తుంది. దాని బారినుండి ఎవరూ తప్పించు కోలేరు. దాన్ని తప్పించుకున్నా భీకరాకారుడైన సింహకేతుణ్ణి ఎవరు తప్పించుకోగలరు? మీరెలా పైకి వెడతారో నాకర్థం కాకుండా ఉంది."

యువకులిద్దరూ దిగాలుపడి కూర్చున్నారు. కోటలోకి పోయే ఉపాయం కోసం అంతులేని ఎడారిలో జలాశయం కోసం వెదికినట్టుగా తమ మనస్సుల్లో గాలించసాగారు. నిరుత్సాహం మేఘంలా వారిని ఆవరించింది. దట్టమైన పొగ మంచులాంటి నిరాశ కమ్ముకుంది. ఏం చేయటానికీ తోచలేదు.

"ఇక్కడున్నా వారందరికీ రాక్షసుడంటే భయమేనా, భక్తికూడా ఉందా?" అని దేవదత్తుడడిగాడు.

"భక్తీ లేదూ చట్టుబండలూ లేదు. వాడి భయం వల్ల ఇంత వెట్టిచాకిరీ చేస్తున్నారు గాని, లేకపోతే ఇక్కడున్న వాళ్ళలో ఎవరికీ వాడంటే భక్తి లేదు. వాడు చస్తే అందరికీ పీడ విరగడైపోతుంది. అంతా సంతోషిస్తారు," అన్నాడు వృద్ధుడు.

"కాపలా ఉన్న సేవకులూ, కోటలోపల పనిచేసే బానిసలూ కూడా అంతేనా?

"అంతా అంతే."

"బావుంది. అయితే నా ఉపాయం ఫలించవచ్చు" అని సంతోషంగా అన్నాడు దేవదత్తుడు.

"ఏమిటా ఉపాయం?" అడిగాడు జయచంద్రుడు.

దేవదత్తుడు తనకు తోచిన ఉపాయం చెప్పాడు.

"కోటలోనికి వెళ్ళటానికి మాత్రమే పనికివస్తుది నీ ఉపాయం. ఆ తరవాతేం చేస్తారు?" అడిగాడు వృద్ధుడు.

"అంతవరకూ వెళ్ళిన తరవాత ఏదో ఉపాయం తట్టక పోదు. అప్పుడు చూసుకుంటాం. మా చేతుల్లో ఖడ్గాలున్నంత కాలం మరేం ఫరవాలేదు. అనవసరంగా కాపలావాళ్ళతో యుద్ధం చేసి వారిని సంహరించటం మెందుకూ అని చూస్తున్నాం గాని లేకపోతే వాళ్ళని కూడా యమసదనానికి పంపించగలం. రాక్షసుడు చనిపోతే అందరూ సంతోషిస్తారంటున్నావు గనక, రాక్షసుణ్ణి మేము సంహరించిన తరువాత మా మీదికి కాపలావాళ్లుగాని, ఇతర ప్రజలుగాని రారు. దానికి ముందు మాత్రం వారు మీ మీదికి రాకుండా మేము చూసుకోవాలి. అందుకే ఈ ఉపాయం ఆలోచించాము," అన్నాడు దేవదత్తుడు.

"సరే మీ ఇష్టం," అన్నాడు వృద్ధుడు.

ఆ రాత్రికి మిత్రులిరువురు గాఢంగా నిద్రపోయారు.

## 10

మర్నాడు తొలికోడి కూతతో లేచారు. వృద్ధ దంపతుల దగ్గర సెలవు తీసుకున్నారు. తమ మూటాముల్లె భుజాన తగిలించుకుని గుర్రాలెక్కి కొండవైపు బయలుదేరారు. కొండను చేరేసరికి బాగా తెల్లవారింది. బాల సూర్యుని బంగారు కాంతుల్లో కొండమీది కోట ధగధగా మెరిసి పోతున్నది?

గుహద్వారం వద్ద గుర్రాలు దిగారు. దగ్గరలో చెట్లకు వాటిని కట్టివేసి ద్వారాన్ని సమీపించారు. అక్కడున్న వేటకుక్కలు భౌ భౌ కారాలు చేశాయి. వెంటనే లోపల్నించి విచ్చుకత్తులు పుచ్చుకుని నలుగురు యోధులు "ఎవరువారు?" అని గర్జిస్తూ బయటికి వచ్చారు.

"మాది ఉజ్జయినీ నగరం. మీ రాజును చూట్టానికి వచ్చాం" అన్నాడు జయచంద్రుడు నిర్భయంగా.

"మా రాజుతో మీకేం పని? పొండి," అన్నాడు కాపలావాళ్ల నాయకుడిలాగ వున్న ఒకడు.

"పని ఉంది గనకే వచ్చాం."

"ఏమిటా పని? సింహానికి ఆకలి తీర్చటమా?" అన్నాడు వాడు. వాడి హాస్యానికి వాడే పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుకున్నాడు. తక్కినవాళ్లు నవ్వలేదు. కాని జయచంద్రుడూ, దేవదత్తుడూ వాణ్ణి మంచి చేసుకుందామని తాము కూడా నవ్వేశారు.

"ఎందుకూ నవ్వుతారు?" అన్నాడు నాయకుడు గంభీరంగా ముఖంపెట్టి.

"అబ్బే. మీరు భలే హాస్యంగా మాట్లాడుతుంటే నవ్వు వచ్చింది" అన్నాడు జయచంద్రు.

"సరే మీ పనేమిటో చెప్పండి," నాయకుడన్నాడు.

"మేము మనస్తత్వ శాస్త్రజ్ఞులం," అని జయచంద్రుడన్నాడు.

"వాళ్లెవరు?" అని మళ్ళీ నాయకుడు నవ్వాడు. వాడు నవ్వుతుంటే బానలాంటి బొజ్జపైకీ కిందికీ ఆడుతున్నది. దాన్ని చూస్తే నవ్వాగదేమోనని అటు చూడకుండా జయచంద్రుడు "మేమే" అన్నాడు.

"అయితే ఏం చేస్తారు?"

"మీ సింహకేతుడు ఒక కాశ్మీరదేశపు పిల్లను ప్రేమించాడని విన్నాం. ఆ పిల్లకు ఆయన మీద మనసులేదనీ పెళ్ళి చేసుకోనని మొరాయిస్తోందనీ తెలిసింది."

"అయితే"

"మేము ఆ పిల్ల మనసు మారుస్తాం. ఆమెకు రాక్షసుడి మీద – కాదు కాదు, సింహకేతుడి మీద ప్రేమ కలిగేట్టు చేస్తాం. ఆయన్ని తప్ప ఇంకెవ్వర్నీ పెళ్ళి చేసుకోను అని ఆమె పట్టుపట్టేట్లు చేస్తాం.

"ఓయబ్బో. మా లావుమనుషల్లా ఉన్నారే," అన్నాడు అందులో ఒకడు.

"మరేమిటనుకున్నావ్"

"ఎలా చేస్తారు?" అడిగాడు నాయకుడు.

"దానికంతా పద్ధతి ఉంది."

"చెబుదురూ. మా బాబులుగా." అన్నాడు వాడు.

"ముందు మేము ఆ పిల్లతో మాట్లాడాలి. ఆ పిల్ల మాటల్ని బట్టి ఆమె మనస్సంతా గ్రహించి వేస్తాం. ఏ కారణాల వల్ల ఆమెకు ఆయనంటే ఇష్టం లేదో తెలుసుకుని ఆ కారణాల వల్లే ఆయనంటే ఇష్టం పుట్టేట్లు చేస్తాం," అన్నాడు జయచంద్రుడు.

"అర్థం కాలా! వివరంగా చెప్పండి."

"చెబుతా విను. మనిషి మొద్దురాచ్చిప్పలా ఉంటాడని నాకిష్టం లేదని ఆ పిల్ల చెబుతుందనుకో. మేము మా శక్తివల్ల ఆమె మనస్సు మార్చి 'మొద్దురాచిప్పలా చక్కగా ఉంటావు గనకనే నువ్వంటే నాకెంతో ఇష్టం. ఆ అబ్బాయేం బావున్నాడు చందమామలాగ ఛండాలంగా? వాణ్ని నేను చేసుకోను నిన్నే చేసుకుంటాను. అనేట్టు చేస్తాం. దానికి కొన్ని జపాలు తపాలు చెయ్యాలి. చేస్తే పని సులువుగా జరిగిపోతుంది."

"ఓరి మీ తస్సాగొయ్యా! చాలా గొప్పవాళ్ళల్లాగా ఉన్నారే మరి నాక్కూడా ఓ రామ్ములక్కాయలాంటి పిల్ల మీద మనసు పోయింది. కాని ఆ అమ్మాయికి నేను అందంగా లేనని, ఇష్టం లేదు పొమ్మంటోంది. మరి ఆ అమ్మాయి మనసు మార్చగలరా మీరు?" అని నాయకుడడిగాడు.

"ఓ, చిటికెలో చేస్తాం. కాని ముందు మీ రాజుకి పెళ్లి చెయ్యనీ, తరువాత చూద్దాం. అయినా నీకేం, నిక్షేపం లాగా ఉన్నావ్. నీకాట్టే శ్రమ లేకుండానే పెళ్లి చెయ్యగలం," అన్నాడు జయచంద్రుడు.

నాయకుడు తన వెనకాల ఉన్న వాళ్లలో ఒకణ్ణి పిలిచి "ఒరేయ్ వెంటనే కోటలోకి పోయి..." అని ఆగి నువ్వెందుకులే, నేనే పోతాను. వెళ్లి రాజుగారితో మీ సంగతి చెప్పి వస్తాను. ఆయన ఒప్పుకుంటే పైకి వెడుదురుగాని," అన్నాడు.

"సరే" అన్నారు మిత్రులు.

చాలాసేపైన తరవాత నాయకుడు తిరిగి వచ్చాడు. "రాజుగారు మిమ్మల్ని తీసుకురమ్మన్నారు. ఆ పిల్ల మనసు మార్చ లేకపోతే మీలో

ఒకర్ని తనూ, ఒకర్ని సింహమూ భోజనము చేస్తామని చెప్పమన్నారు,” అన్నాడు.

మిత్రులు గుహలో ప్రవేశించారు. ఒక కాపలావాణ్ణి తోడిచ్చి నాయకుడు వారిని పైకి పంపించాడు.

గుహలోనుంచి కోటలోకి పోయేందుకు కొన్ని వేల మెట్లున్నాయి. మార్గమంతా చీకటిగానే ఉంది. కాని మెట్లు మలుపు తిరిగినప్పుడల్లా ఒక గూడు, అందులో ఒక రత్నమూ ఉన్నాయి. ఆ రత్నం ఎర్రదైతే ఎర్రని కాంతీ, పచ్చనిదైతే పచ్చని కాంతీ, నీలందైతే నీలికాంతీ వస్తూ మార్గం కనబడుతోంది. అన్ని వేల మెట్లూ ఎక్కటంతో ఆ యువకులు చాలా అలిసి పోయారు. అక్కడక్కడ కూర్చుని విశ్రాంతి తీసుకున్నారు. చివరికెలాగై తేనేం మెట్లు ఆఖరైనాయి. కోట సింహద్వారం సమీపించారు. అక్కడ మళ్లీ నలుగురు ద్వార పాలకులు ఉన్నారు. కిందినుంచి వచ్చిన వాడు యువకులను వారికి అప్పగించి తను క్రిందికి దిగిపోయాడు. ద్వారపాల కులలో ఒకడు వీరిని వెంటబెట్టుకుని లోపలికి పోయాడు.

కోట ఆవరణ చాలా విశాలమైనది.దాదాపు వెయ్యి విల్లుల పొడుగూ, అంతే వెడల్పూ ఉండి, నలుచదరంగా ఉన్నది. కోటచుట్టూ మహావృక్షాలూ పెరిగిన తోట ఉన్నది. ఒక పెడగా కొలనున్నది. ఆ కొలనులో బంగారంలా పచ్చగా మెరిసిపోయే తామరపువ్వులున్నాయి. వాటి మధ్య జంటలు జంటలుగా విహరించే హంసలున్నాయి. ఆ హంసలను మానస సరోవరం నుంచి సింహకేతుడు తెచ్చుకున్నాడు. కొలనిగట్టున సంగీతవృక్షం ఉన్నది. ఆ చెట్టు ఆకులు కదిలినపుడల్లా వీణాతంత్రులు మ్రోగినట్లు స్వరాలు

వినిపిస్తున్నాయి. తోటలో అక్కడక్కడ జలయంత్రాలున్నాయి. వాటిలోంచి రంగు రంగుల నీళ్ళు సన్నని ధారలుగా పడుతున్నాయి. చెట్ల కొమ్మల మీద ఏవో వింత వింత పక్షులు కలకలారావాలు చేస్తున్నాయి. చెట్లక్రింద లేళ్లు పచ్చిక మేస్తూ, నెమిళ్ళు పురులు విప్పుకుని తిరుగుతూ విహరిస్తున్నాయి. కొందరు దాసీలు కొలనులో బిందెలతో నీళ్ళు ముంచి పువ్వుల మొక్కలకు నీళ్ళు పోస్తున్నారు. కొందరు పూలచెట్లకు మడులు కడుతున్నారు. కొందరొయ్యారంగా ద్రాక్షపళ్ళు కోస్తున్నారు.

ఇవన్నీ చూస్తూ ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని యువకులు మెల్లగా నడుస్తున్నారు. మేడ సమీపించారు. ఆ మేడలో గోడలన్నీ నీడలు కనబడేటంత తెల్లని స్వచ్ఛమైన చంద్రకాంత శిలలతో కట్టినవి. వాటి మీద ఏయే దేశాల అజ్ఞాత శిల్పులలో చక్కని పనితనం చూపించి లతలు, పువ్వులు, పక్షులు, మృగాలు చెక్కారు. సౌధద్వారందాకా వచ్చి ద్వారపాలకుడు యువకులను మరొక సేవకునికి అప్పగించి వెనక్కి వెళ్ళిపోయాడు. వాడు వారిని మందిరాంతర్భాగంలోకి తీసుకుపోయాడు. అక్కడ కొంతసేపు నిలబడ్డారు.

ఆ మందిరం నిండా చిత్రవిచిత్రమైన వస్తువులెన్నో ఉన్నాయి. వివిధ నాట్యభంగిమలలో ఉన్న పాలరాతి ప్రతిమలు కొన్ని కదలకుండా ఉన్నచోటనే ఉన్నా కదులుతూ నాట్యం చేస్తున్నట్లున్నాయి. సింహాల ప్రతిమలు, పులుల ప్రతిమలు సజీవంగా ఉండి తిరుగుతున్నట్లు, పక్షుల బొమ్మలు రెక్కలు విప్పి ఎగురుతూ ఉన్నట్లు భ్రమ కలగజేస్తున్నాయి. ఒకచోట ఒక స్త్రీ విగ్రహం వీణ వాయిస్తున్నట్లున్నది. ఆ వీణలోనించి

వాటంతట అవే సంగీత ధ్వనులు వస్తున్నాయి. మరొకచోట కొన్ని వందల రత్నాలు వాటంతట అవే రకరకాల హారాలుగా ఏర్పడుతూ మళ్ళీ విడిపోతున్నాయి. మొత్తం మీద ఆ మందిరం ఒక చిత్ర వస్తు ప్రదర్శన శాలలా ఉన్నది. ఈ వింతలన్నీ వారు సంభ్రమంతో చూస్తూ తిరిగారు.

ఇంతలో తలుపులు తెరుచుకుని ఒక దాసీవనిత వచ్చి "రాజుగారు రమ్మంటున్నారు. లోపలికి పొండి" అన్నది.

గుండెలు దడదడ కొట్టుకున్నాయి వారికి. రాక్షసుణ్ణి చూడాలనే తహతహతో గబగబ లోపలికి వెళ్ళి చటాలున ఆగిపోయారు. శరీరమంతా జల్లున కంపించేటట్లు ఒక అరుపు వినిపించింది. మందిరమంతా ఆ ధ్వనితో ఊగిపోయినట్లయింది. ఎదురుగా రత్నఖచిత సువర్ణ సింహాసనం మీద రాక్షసుడు సింహకేతుడు కూర్చున్నాడు. సింహాసనం పక్కనే బ్రహ్మాండమైన సింహం ఉన్నది. కొత్తవారి నిద్దరినీ చూడగానే అది గర్జిస్తూ ముందుకు దూకబోయింది. కాని సింహకేతుడు దాన్ని అదిమిపట్టుకుని ఆపాడు.

యువకులు వాడికేసి పరిశీలనగా చూశారు. వారికి ఆశాభంగమైంది. రాక్షసుడంటే కోరలూ, నిప్పుల్లాగ కళ్ళూ, తాడిచెట్టంత దేహమూ ఉంటాయని భావించారు. కాని వీడికి అదేమీ లేదు. మామూలుగానే ఉన్నాడు. మనిషి లాగానే ఉన్నాడు. కోరలు లేవు. కోరమీసాలున్నాయి గాని, కళ్ళు నిప్పుల్లాగ లేవు రక్తపు జీరలతో ఎర్రగా ఉన్నాయి గాని. తాడిచెట్టంత లేడు మహా ఉంటే ఏడు అడుగులున్నాడు గాని. మర్రిచెట్టంత లావు లేడు చాలా బలిష్టంగా ఉన్నాడుగాని. దయ్యంలాగ జుట్టు విరబోసుకుని లేడు పొడుగాటి రత్న కిరీటం పెట్టుకున్నాడు గాని. మెడలో

పుర్రెలదండలు లేవు రత్నాలహారాలు గాని. రక్తం జుర్రటం లేదు. ద్రాక్షారస పానం చేస్తున్నాడు గాని.

"వీడా రాక్షసుడంటే!" అనుకున్నారు వాళ్ళు.

"మీరేనా స్త్రీ వశీకరణ విద్య తెలిసిన మంత్రగాళ్ళు?" అని రాక్షసుడు అడిగాడు. వాడి మాటలు ఆ విశాలమందిరంలో ఖంగున మారుమ్రోగాయి.

యువకులు నిర్భయంగా "మేమే" అన్నారు.

"మీరు చూస్తే మంత్రగాళ్ళ మాదిరిగా లేరే. చక్కని రాజకుమారుల్లాగ ఉన్నారు. మీ దగ్గిర ఆ కత్తులెందుకు ఉన్నాయి?"

"ప్రాణరక్షణార్ధం" అన్నాడు జయచంద్రుడు.

రాక్షసుడు వికటాట్టహాసం చేశాడు. అదీ సింహగర్జనకు చుట్టం లాగానే ఉంది.

"ప్రాణరక్షణార్ధమా? నా కోటలోకి వస్తూ మీరు ప్రాణరక్షణకు కత్తులు తెచ్చుకున్నారా? ఆ కత్తులు మిమ్మల్ని రక్షిస్తాయా?"

"ఆ! దుష్టుల్ని శిక్షిస్తాయి కూడాను" అన్నాడు దేవదత్తుడు.

"ఓ మాటలు బాగా నేర్చారే, మీఠీవి చూస్తే మీరు ఉన్నత వంశీయుల వలెనే ఉన్నారు. మీరు మంత్రగాళ్ళని నాకు నమ్మకం కలగటంలేదు. మోసగాళ్ళనిపిస్తోంది"

"పరీక్షించుకోండి నమ్మకం లేకపోతే"

"నేను నాలుగేళ్ళ కిందట దేశాటనం చేస్తూ కాశ్మీర దేశం వెళ్లాను. అక్కడ కాశ్మీర రాజపుత్రిక ఓ తోటలో చెలికత్తెలతో విహరిస్తూ కనబడింది.

ఆమె అందం చూసి తక్షణం ప్రేమించేశాను. ప్రేమించటంతడవు తక్షణం ఆమెను ఎత్తుకుని వచ్చేశాను. ఆమెను పెళ్ళి చేసుకుందామంటే నాలుగేళ్ళ నించీ వీల్లేకపోతోంది. ముట్టుకుంటే చచ్చిపోతానని బెదరిస్తోంది. ఆమెకు నేను తగనట. నేను అందంగా లేనట. మంచివాణ్ని కానట. రాక్షసుణ్ణట. మరి మీరామె మనసు మార్చగలిగితే మీరే బహుమానం కోరితే ఆ బహుమానం ఇస్తాను.”

“ఓ, అలాగే ఆమెను పిలిపించండి,” అన్నాడు దేవదత్తుడు.

రాక్షసుడు ఒక దాసీని పిలిచి చిత్రలేఖను పిలుచుకు రమ్మన్నాడు.

కొద్దిసేపట్లో దాసీది చిత్రలేఖను తీసుకువచ్చింది.

ఎర్రగా విరబూచిన కాశ్మీర వృక్షం కళ్ళముందు జిగేల్‌మన్నట్లయింది.

వేటగాని చేతిలో చిక్కిన లేడికన్నెలా బెదురుచూపులు చూసింది. దేవదత్తుడి సుందరమనోహరాకృతి మీద ఆమె చూపులు నిలిచి పోయాయి.

ఆమెను చూస్తూనే దేవదత్తుడు మూర్ఛపోయినట్లయ్యాడు. అతణ్ణి చూస్తూనే ఆమె హృదయవీణ మూర్ఛనలు పలికినట్లయింది. ‘ఇతడు మన్మథుడు’ అనుకున్నదామె. ‘ఈమె మన్మథుడి మొహరు’ అనుకున్నాడతడు. ‘ఇతనితో దిగంతాల దాకా పొమ్మన్నాపోగలను’ అనుకున్నదామె. ‘ఈమె వెంట ప్రపంచపు చివరల వరకూ చనిపోగలను’ డతడు అనుకున్నా ‘ఇతడు సౌందర్యానికి పరమావధి’ అనిపించిందామెకు. ఆ పరమావధి కవతల ఉన్నదీమె’ అనిపించిందతనికి. ‘ఇతడు నన్ను ప్రేమిస్తే...’

అనుకుంటూ ఆమె తనలో తనే సిగ్గుపడింది. “ఈమె నన్ను ప్రేమిస్తుందా?” అనుకుంటూ అతడు క్షణిక నిర్వేదం పొందాడు”... “ఆనంద సరస్సులో జలక్రీడలాడతాను” అనుకున్నదామె “నేను ఆ సరస్సుగా మారతాను” అనుకున్నాడతడు. చివరికి ఎలాగైతేనేం ఇతనే నా మనోనాధుడని ఆమె, ఈమె లేందే జన్మవృథా అని అతడూ ఒక నిశ్చయానికి చేరుకున్నారు.

వీరిద్దరి తన్మయత్వం చూసి సింహకేతుడు క్రోధోద్రేకంతో సింహాన్ని అనుకరిస్తూ, ‘ఏమిటలా ఒకళ్ళనొకళ్లు అంతసేపు చూచుకుంటున్నారు? అని గద్దించాడు.

ఆమె చూపుల అర్థాన్ని అతడూ, అతని ఊహల సంగీతాన్ని ఆమె మాటల్లోకి తర్జుమా చేసుకోవటం పూర్తయిన తరువాత అతడు “నేనీమెను ప్రేమిస్తున్నాను, అని బిగ్గరగా ప్రకటించాడు. నేను వీరిని ప్రేమిస్తున్నాను” అని ఆమె వ్యక్తం చేసింది.

“ఆ” అంటూ ఉడుములా కేక వేసి పిడుగులాదూకాడు సింహకేతుడు. అతనితో పాటు మెరుపులా దూకింది సింహం. దేవదత్తుడు కాలకీలను చివ్వున దూశాడు. జయచంద్రుడు తన ఖడ్గం దూసి సింహంతో తలపడ్డాడు. దాసీలు, ఇతర సేవకులు భయభ్రాంతులై కోటసింహద్వారం దగ్గరికి పారిపోయారు.

దేవదత్తుడు తన మీదికి దూకిన సింహకేతుని కుడి చేతిని ఒక్క వ్రేటుతో తెగనరికాడు. వాడు గావు కేకవేసి క్రిందపడ్డాడు. వెంటనే మళ్లీ లేచి ఎడమచేతితో ఒక కత్తి తీసి దేవదత్తుని పైకి లంఘించాడు. పడగ

విప్పిన నాగసర్పంలా ఆడిపోతున్న కాలకీలతో దేవదత్తుడు మొదట వాడి కత్తిని ముక్కలు ముక్కలు చేశాడు. వాడెన్ని కత్తులు తీసినా అన్నిటినీ విరగగొట్టాడు. ఒక కత్తి విరిగిపోయి ఇంకో కత్తి తీసేలోగా వాడి రొమ్ములోనో, పొట్టలోనో పోట్లు పొడిచాడు. దేవదత్తుడు బిగ్గరగా "చిత్రలేఖా! నువ్వు మేడలోనుంచి పారిపో. తోటలో మాట్లాడే చిలక ఎక్కడుందో నీకు తెలుసా? తెలిస్తే దాని పంజరం చేత చిక్కించుకో. అక్కడే ఉండు. నేనీ రాక్షసుణ్ణి హతమార్చి వస్తాను" అని కేక వేశాడు.

చిత్రలేఖ భయకంపితురాలై వెంటనే తోటలోకి పరుగెత్తింది.

ఈలోగా సింహకేతుని కత్తులన్నీ ఆఖరైనాయి. రాక్షసరక్తం రుచి చూసినకొద్దీ కాలకీల అధిక శక్తివంతం కాజొచ్చింది. ఖడ్గం చలాలనుంచి అగ్నిజ్వాలలు భగభగమని బయలుదేరాయి. సింహకేతుడది చూసి విపరీతమైన ఒక పెద్ద గద అందుకున్నాడు. గదను ఎత్తి విసిరివేసేలోగా దేవదత్తుడు వాడి ఎడమ చేతిని కూడా ఖండించి వేశాడు.

రెండు చేతులూ పోయి మొండివాడై పోయిన సింహకేతుడు భయం కరంగా కేకలు వేస్తూ తన సేవకులను సహాయానికి రమ్మని అరిచాడు. కాని అప్పటికే వారందరూ కోటమెట్లు దిగి కిందికి పారిపోయారు. దొర్లుతూ దొర్లుతూ వచ్చి రాక్షసుడు తన కాళ్ళతో దేవదత్తుణ్ణి నొక్కి పట్టాడు. దేవ దత్తుడు ఎంత గింజుకున్నా విడిపించుకోలేకపోయాడు. కత్తితో ఎన్ని పోట్లు పొడిచినా రాక్షసుడు పట్టు విడువలేదు. అప్పుడు దేవదత్తుడు ఒకసారి ఒక కాలూ, ఇంకొకసారి ఇంకొక కాలూ నరికాడు. ఆఖరున వాడి మెడలో

కత్తి గుచ్చి ఇవతలకు లాగాడు. రక్తధారలు చిమ్మన గొట్టంలోంచి నీళ్లు చిమ్మినట్లు చిమ్మాయి. వాడి అధ్యాయం అంతటితో ముగిసింది.

ఇంతసేపూ జయచంద్రుడు సింహంతో పోరాడుతూనే ఉన్నాడు. దాని వంటినిండా ఎన్ని గాయాలు తగిలినా లెక్క చేయకుండా అది మీదికి దూకుతూనే ఉన్నది. అది దూకినప్పుడల్లా జయచంద్రుడు ఒడుపుగా పక్కకు తప్పుకుంటూ వంటినిండా పోట్లు పొడుస్తున్నాడు. అది తనను వదిలిపెట్టి, రాక్షసునితో పోరాడుతున్న దేవదత్తుని మీదికి దూకకుండా అతడు అడ్డుపడుతున్నాడు. రాక్షసుడు హతుడు కావటంతో దేవదత్తుడు జయచంద్రుని పక్కకు వచ్చి నిలిచాడు. కాళ్లు చేతులూ నరకటం అతని కప్పటికి బాగా అలవాటైపోయింది. సింహంకాళ్ళను ఒక్కొక్కటిగా నరికి వేశాడు. సింహం నేల మీద దొర్లుతూ అరిచింది. జయచంద్రుడు దాని తల ఖండించాడు.

శత్రుసంహారం పూర్తి కావటంతో మిత్రులిద్దరూ ఒకరినొకరు సంతోషంతో కౌగలించుకున్నారు. ఇద్దరి శరీరాల నిండా రక్తధారలు కారుతున్నాయి. ఇద్దరూ నెత్తురుముద్దలై పోయారు. కళ్ల మీద రక్తం చిమ్మి కళ్లు సరిగా కనిపించటం లేదు. వెంటనే వారు కొలను దగ్గరికి పరుగెత్తి వళ్లూ, కళ్లూ, కాళ్లూ, కడుక్కున్నారు. కత్తులు శుభ్రం చేసుకున్నారు.

ఇంతలో చిత్రలేఖ పంజరం పట్టుకుని వారివద్దకు పరుగెత్తు కొనిచ్చింది.

“చిత్రలేఖా! రాక్షసుణ్ణి పరిమార్చాం. సింహాన్ని కూడా హతమార్చాం. ఈనాటితో ప్రపంచంలో రాక్షస జాతి ఆఖరైంది” అని దేవదత్తుడు అరిచాడు.

"ఆఖరు కాలేదు" అనే మాటలు వినిపించాయి. స్పష్టాస్పష్టమైన అవాక్కు లెక్కడివా అని యువకులు చుట్టూ చూశారు. ఎవరూ లేరు.

"చిలక మాట్లాడుతున్నది," అన్నది చిత్రలేఖ. దేవదత్తుడు 'ఓహో' అని ఆమె చేతిలోంచి పంజరం తీసుకున్నాడు.

చిలక దేవదత్తుణ్ణి చూస్తూ "రాక్షసజాతి ఆఖరు కాలేదు. మానవ జాతిలో ఒక అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. ఇప్పటిదాకా మానవజాతి ఇది, దానవజాతి ఇది అని గుర్తుపట్టటానికి వీలుగా ఉండేది. ఇప్పుడు మానవుల్లో ఎవరు మానవులు, ఎవరు దానవులు అని గుర్తు పట్టటానికి వీల్లేకుండా పోతుంది," అన్నది.

చిలక చెప్పింది వారికి అర్థం కాలేదు. స్వచ్ఛమైన సంస్కృతంలో చిలక మాట్లాడటం యువకులకు అపూర్వంగా అద్భుతంగా ఉన్నది. దాని రూపం ఇంకా అద్భుతంగాఉన్నది. సప్తవర్ణశోభితమైన ఇంద్ర ధనస్సు లోనించి ఒక ముక్కను వేరు చేసినట్లు మెరిసిపోతున్నది చిలక. ఏ రంగు ఎక్కడ అంతమవుతున్నదో, ఏ రంగు ఎక్కడ ప్రారంభమవుతున్నదో, తెలియ కుండా ప్రవహిస్తున్న రంగులతో, పొడవైన కుచ్చుతోకతో, ఎర్రగా వంపు తిరిగిన నాసికతో మనోజ్ఞంగా ఉన్నది.

"చిత్రలేఖా! ఈ చిలకకోసమే మేమింతదూరంవచ్చాం. నూరామడ దూరంలో ఉన్న ఉజ్జయిని నుంచి ఈ చిలక కోసమే వచ్చాం. ఈ చిలక కోసమే ప్రాణాలకు తెగించి కోటలో చొరబడ్డాం. రాక్షసుడితోనూ, సింహంతోనూ తలపడ్డాం..."

చిలక దేవదత్తుని మాటలకు అడ్డు వచ్చి "ఇప్పుడు నాతోపాటు సౌందర్య రాశియైన చిత్రలేఖను కూడా సంపాదించుకున్నాడు," అన్నది.

జయచంద్రుడు నవ్వాడు. చిత్రలేఖ, దేవదత్తుడు సిగ్గుతో తలలు వంచుకున్నారు.

"దేవదత్తా! ప్రేమాగీమా ఏమీ తెలియవని కోతలు కోశావే. హఠాత్తుగా మొదటి చూపుతోనే ఈ సుందరీమణి హృదయాన్నెలా వశం చేసుకున్నావు?" అని జయచంద్రుడు ఛలోక్తిగా అన్నాడు.

"నేను చెప్పానుగా, ప్రేమించటం ప్రేమించలేక పోవటం నా చేతుల్లో లేదని," అన్నాడు దేవదత్తుడు.

తరవాత చిలక కేసి తిరిగి "చిలకా! నీ సంగతి మా ఉజ్జయినిలో మహాకాళ దేవాలయం వెనకాల సిద్ధుడు చెప్పగా విన్నాను. నా తల్లిదండ్రులెవరో నీకు తెలుసునని సిద్ధుడు చెప్పాడు. నీ కోసమే ఇన్ని కష్టాలు పడి ఇక్కడికి వచ్చాను. చెప్పవూ, నా జన్మవృత్తాంతం?" అని అడిగాడు.

"దేవదత్తా! నీ జన్మరహస్యం నాకు తెలుసు. కాని చెప్పటానికింకా సమయం రాలేదు. ముందు ఇక్కణ్ణించి పోదాంపద. మీ దేశం పోయిన తర్వాత రహస్యం వెల్లడి చేస్తాను," అన్నది చిలక.

"చిత్రలేఖా! నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. నిన్ను చూడగానే నా హృదయం నీకు అంకితమైపోయింది. నీకు అంగీకారమైతే నాతో మా దేశం వచ్చెయ్యి. మన వివాహం అయిన తర్వాత మీ దేశం వెళ్లి, నీ కోసం దుఃఖించే నీ తల్లిదండ్రులను చూసివద్దాం," అన్నాడు దేవదత్తుడు.

చిత్రలేఖ మృదుకపోలాలు, గులాబీ రేకుల్లాగ ఎర్రవారాయి. లజ్జావనత వదనంతో ఆమె సమాధానం ఇవ్వలేదు. ఆమెను చూసి జయచంద్రుడు "దేవదత్తా! మా చెల్లెలు సిగ్గుతో సమాధానం ఇవ్వలేక పోతోంది. మరేం బెంగపడకు. ఆమె నీ భార్యే," అన్నాడు.

తరవాత ముగ్గురూ మెట్లుదిగి కిందికి వచ్చారు. కొండ గుహద్వారం వద్ద తండోపతండాలుగా కొన్నివేల మంది జనం గుమిగూడి ఉన్నారు. దేవదత్తుడూ, జయచంద్రుడూ సజీవులై, ఖడ్గపాణులై రావటం, వారి వెంట కాశ్మీర రాజకుమార్తె చిత్రలేఖ రావటం, ఉండటం చూసి ప్రజలంతా జయజయధ్వానాలు చేశారు. "రాక్షసుడు మరణించాడు. ఇక మనకు స్వేచ్ఛ" అనే కేకలు మిన్నుముట్టాయి. ద్వారపాలకుల నాయకుడు దేవదత్తుణ్ణి అమాంతం లేవనెత్తుకున్నాడు. దూరదూరాన ఉన్న జనం వారిని చూసి ఇంకా బిగ్గరగా హర్షధ్వానాలు చేశారు. వారిని ఊరేగింపుగా ఊరి మధ్యకు తీసుకువెళ్లారు. దేవదత్తుడు వారితో ఇలా అన్నాడు.

"మిమ్మల్ని ఇంతకాలం నానాహింసలు పెట్టిన సింహకేతుడు యమలోకానికి వెళ్లిపోయాడు. ఇక మీరు ఎవరి దేశాలకు వారు వెళ్లిపోవచ్చును. పోయి మీ బంధుమిత్రాదులతో సుఖంగా ఉండండి. కోటలో అపారమైన సంపద ఉన్నది. ఆ సంపద అంతా మీదే. మీరు శ్రమపడి సృష్టించిన సంపదే అది. అదంతా మీరు న్యాయంగా, సమానంగా పంచుకోండి. మేమూ మా దారిని పోతాము. ఇప్పుడు సంధ్యా సమయ మైంది. ఈ రాత్రి వేడుకలతో, వినోదాలతో రాక్షస సంహారోత్సవం చేసుకుందాం. మాకు నాలుగు గుర్రాలు పూన్చిన రథం సిద్ధం చేయండి. తెల్లవారగనే బయలుదేరి పోతాము."

జనమంతా మళ్లీ హర్షనాదం చేశారు. ఆ క్రితం రాత్రి తాము గడిపిన వృద్ధుని ఇంట్లోనే ఆ రాత్రికి మిత్రులు బస చేశారు. ఊరంతా దీపతోరణాలతో పట్టపగలు లాగా ప్రకాశించింది. విందులైన తరువాత మగవారు ఆడవారు కలిసి నృత్యవినోదాల్లో పాల్గొన్నారు. చిత్తుగా తాగి మత్తుగా తిరిగారు. ఆ కోలాహలం వర్ణించటానికి తరం కాదు.

మర్నాడు తెల్లవారగానే వారు రథం అధిరోహించి బయలుదేరారు.

## 11

జయచంద్రుడు సారథిస్థానంలో కూర్చున్నాడు. దేవదత్తుడు, చిత్రలేఖ వెనకాల కూర్చున్నారు. వారికెదురుగా మరొక ఆసనంలో పంజరం ఉంచారు. వచ్చిన మార్గానే రథం నడిపించాడు జయచంద్రుడు. దేశాలకు దేశాలు, అరణ్యాలు, పర్వతాలు, నదులు దాటుకుంటూ ప్రయాణం సాగించారు.

దోవ పొడుగునా ప్రయాణపు విసుగు కలగకుండా చిలక వారికి ఎన్నో కథలు చెప్పింది. తన కథ కూడా చెప్పింది.

“వేదవ్యాసుడు నా తాత. ఆ జన్మ బ్రహ్మచారి అయిన శుక మహర్షి నా తండ్రి. శుకమహర్షి ఒక రోజున ఒక చిలకను చూసి మోహితుడై చిలక రూపంలో ఆ చిలకతో క్రీడించాడు. తత్ఫలితంగా నేను జన్మించాను. నేను పుట్టగానే ఆయన తపోమహిమతో నన్ను చిరంజీవిని చేశాడు. నేను

ఆయన దగ్గిర వేదవేదాంగాలు, సకల శాస్త్రాలు, విద్యలు, భాషలు పఠించాను. నాకాయన త్రికాలజ్ఞానం ప్రసాదించాడు. ఆనాటి నుంచీ నేను తిరగని దేశం లేదు, చూడని వింత లేదు. నాకు తెలియని రహస్యం లేదు. నా అనంత జీవితంలో ఎన్ని శతాబ్దాల చరిత్రనో కళ్ళారా చూశాను. మహాభారత వీరులు, పాండవులు, శ్రీకృష్ణుడు చనిపోవటం నేనెరుగుదును. భారత యుద్ధానంతరం పరీక్షిత్తు, జనమేజయుడు రాజ్యం చెయ్యటం నేను చూశాను. ఆ తర్వాత నాకళ్ళముందు భారతదేశంలో ఎన్ని మహా సామ్రాజ్యాలో అవతరించాయి. అంతరించాయి. గౌతమబుద్ధుడు పుట్టటం, ధర్మచక్రం పరివర్తనం చెయ్యటం, నిర్యాణం పొందటం నా కళ్ళ ఎదుట జరిగింది. మౌర్య సామ్రాజ్యం, శాతవాహన సామ్రాజ్యం, గుప్తసామ్రాజ్యం ఇసుకమేడల్లా లేచి కూలిపోవటం చూశాను. విక్రమార్క చక్రవర్తి చేసిన సాహస కార్యాలు నాకిప్పటికీ కళ్ళకి కట్టినట్లున్నాయి. భాసమహాకవి రచించిన స్వప్న వాసవదత్త నాటకం ప్రదర్శన నేటికీ నాకు జ్ఞాపకముంది. అందులో సూత్రధారుడుగా భానుడే ప్రేక్షకులకు దర్శనం ఇచ్చాడు. మీ ఉజ్జయినీ పురంలో నగరోద్యానవనంలోను, శిప్రానదీ తీరాన పొదరిళ్ళలోను కూర్చుని మహాకవి కాళిదాసు ఒకానొక సుందరిని ఉద్దేశించి ఋతుసంహార శ్లోకాలు వ్రాయటం నేనెరుగుదును. పరిణతి పొందిన ఆఖరు దశలో ఆయన శాకుంతల నాటకం, కుమార సంభవకావ్యం వ్రాయటం నాకు జ్ఞాపకమున్నది. ఆయన రాజాంతఃపురాలలోని ఏయే బిబ్బోకవతులను చూసి ఊర్వశిని, మాళవికను, శకుంతలను ఊహించి శ్లోకించి, శోకించాడో నాకు తెలుసు.

వీటన్నిటితోపాటు మానవుల అల్పత్వాన్ని కూడా నేను చూశాను. దేవదత్తా! నువ్వు నిన్న రాక్షసజాతి ఇంతటితో ఆఖరు అన్నప్పుడు 'ఆఖరు కాలేదు' అన్నాను జ్ఞాపకం ఉన్నదా? నీ మాటలు వినగానే నాకు నవ్వు వచ్చింది. కాని నవ్వలేదు. నేను నవ్వలేను. నేను పక్షిజాతికి చెందినవాడిని. నాకు నవ్వటం, ఏడవటం రెండూ చేతకావు. నవ్వు ఏడ్పూ మీ మానవుల కొక్కరికే సృష్టి ప్రసాదించిన వరాలు. మాకు అనుభవం ఒక్కటే నిజం, మాకు ధర్మాధర్మ పాపపుణ్యాలు మాకు అంటవు. మాది ఒక రకంగా నిష్కామకర్మ మీది సకామకర్మ. మీ కర్మఫలితాలు మిమ్మల్ని బాధిస్తాయి. అందుకే మా నిష్కామ తత్త్వాన్ని అలవరచుకోమని శ్రీకృష్ణుడు మీకు బోధించాడు. కాని మీ మానవజాతిలో ఎంత దేవత్వం ఉన్నదో, అంత దానవత్వం ఉన్నది. రాజ్యకాంక్షతో, స్త్రీ వాంఛతో, ఒక గోడకోసం, ఒక అడుగు నేల కోసం జరిగిన ఘోరయుద్ధాలు, దారుణ హత్యలు వేలకొలదీ నేను చూశాను.ఇంకా రాబోయే శతాబ్దాలలో జరగబోయే మహా యుద్ధాలు, హత్యలు, క్రౌర్యాలు, అమానుష పైశాచిక బీభత్సకాండలు ఎన్నోసార్లు చూస్తాను. మానవజాతి భయంకరమైన మారణాస్త్రాలతో చేయబోయే విధ్వంసహోమాన్ని కళ్లారా చూసే గీత నా నొసట ఉన్నది. ఎందుకొచ్చిన భగవద్గీత! ఎందుకొచ్చిన బౌద్ధమతం! మీ మానవ చరిత్ర యావత్తూ రక్త సముద్రంలో మునిగి తేలుతున్నది. మీ జాతి సాధించిన కవితా సౌందర్యాలు, సంగీత మాధుర్యాలూ, సంస్కృతీ శిఖరాలు ఆ సముద్రంలో కాకిరెట్టలు, కాని... కాని...

కృతయుగంలో ధర్మం నాలుగు పాదాల నడిచేదని చెబుతారు. ఎందుచేతనంటే కొత్తగా మానవ సమాజాలేర్పడిన ఆ ఆదిమ యుగంలో

కృతము తప్ప కర్తవ్యం లేదు. ఇది కర్తవ్యం, ఇది అకర్తవ్యం అనే విచక్షణ ఉన్నప్పుడే ఇది ధర్మం అనే భేదం బయలుదేరుతుంది. ఆ విచక్షణ లేనప్పుడు చేసిన ప్రతి పనీ సహజధర్మంగానే చెలామణీ అవుతుంది. ఆ తరవాత యుగాల్లో ఆ విచక్షణ క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. మళ్లీ కలియుగాంతమైన తరువాత కృత యుగం వస్తుంది. ఈసారి కృతయుగం మొదటి దానికంటే విభిన్నంగా ఉంటుంది. మళ్లీ ధర్మం నాలుగు పాదాల నడుస్తుంది. మానవులు కర్తవ్యమే తప్ప ఆ కర్తవ్యం చేయలేని స్థితిలోకి పెరుగుతారు, అది ఎప్పుడు ఏ విధంగా వస్తుందో త్రికాలవేదినైన నా ఊహకే అందకుండా ఉంది. బహుశా అది కూడా నా కళ్లతో చూస్తానను కుంటాను. ఈ యుగధర్మ రహస్యం నాకు మా తాతగారే చెప్పారు."

ఈ విధంగా చిలక రథంలో సుఖాసీనయై దేవదత్త జయచంద్రు లకు తత్త్వబోధ చేసింది. వారు వేసిన సవాళ్లకు అడ్డు సవాళ్ళు వేసి వారి వాదనలను పరాస్తం చేసింది. అయితే చిలక మాటలను వారు పూర్తిగా వినిపించు కోలేదు. జయచంద్రుని మనస్సు దూరాన ఉన్న ప్రేయసి చంద్రావతి మీద, దేవదత్తుని దృష్టి పక్కనే ఉన్న చిత్రలేఖ తనూ లావణ్యం మీద లగ్నమై ఉన్నాయి. వారికి చిలక చెప్పిన వేదాంతం తలకెక్కక పోగా తలనెప్పి కూడా వచ్చింది. చిలక అది గ్రహించి వారికి వినోదం కలిగించే కమ్మటి కథలుచెప్పింది. జరిగిన కథలూ, జరగని కథలూ చెప్పి ఉల్లాసం కలిగించింది.

మార్గమధ్యంలో వారు మళ్లీ మేఖలావతిలో ఆగారు. దేవదత్తుడు తను ఇదివరకు బస చేసిన సత్రానికే వారిని తీసుకు వెళ్లాడు. సత్రం

యజమాని వారిని ఎంతో గౌరవించాడు. కాంచనమాల మాత్రం కనబడ లేదు. దేవదత్తుడు వెళ్లిపోయిన నెలరోజులకే ఆమెకు వివాహం చేసేశాననీ, ఆమె అత్తవారింటికి వెళ్లిపోయిందనీ సత్రం యజమాని చెప్పాడు. ఆమె అత్తవారు చాలా భాగ్యవంతులనీ, భర్తకు మేఖలావతీ రాజసభలోనే ఏదో పెద్ద ఉద్యోగమనీ చెప్పాడు. రాజ్యపాలకుడు ఇప్పుడు బుద్ధిగానే మసులు కుంటున్నాడనీ, పురస్త్రీలకు వాడి బాధ విరగడైందనీ చెప్పాడు.

మళ్ళీ వారు ప్రయాణం సాగించారు. ఎట్టకేలకు ఉజ్జయినీ నగరం సమీపించారు.

“అదిగో మీ ఉజ్జయిని. ఈ మహానగరం చూసి ఎన్నేళ్ళయిందో. విక్రమార్కుని కాలంలోనో, కాళిదాసు కాలంలోనో చూశాను. ఈ నది, ఈ కొండలు, ఈ పొలాలు నాకు పరిచితమైనవే. నదీతీరాన పెరిగిన ఈ తెల్లని రెల్లుపొదను చూసే శరదృతువు తెల్లని చీర ధరించి వచ్చిన కొత్త కోడలు లాగా ఉందని మహాకవి వర్ణించాడు. అన్నట్లు కొత్తకోడలు కూడా ఇక్కడే ఉందిగదూ. అమ్మా చిత్రలేఖా! ఇదేమీ అత్తవారి ఊరు. ఇదిగో ప్రవేశించాం,” అన్నది చిలక.

“ఆమె అత్తవారెవరు చిలకా?” అని దేవదత్తుడు అడిగాడు.

“చెబుతాను. ఇంటికి పద” అన్నది కొంటెగా చిలక.

## 12

దేవదత్తుని ఇంటిముందు జయచంద్రుడు రథం నిలిపాడు. వీరిరువురూ హఠాత్తుగా మాయమైపోయి హఠాత్తుగా తిరిగి వచ్చిన వార్త, అందులో దేవదత్తుడు ఎవరో రాజకన్యను వెంట తీసుకొచ్చిన వార్త క్షణంలో ఊరంతా ప్రాకిపోయిది. జనం తండోపతండాలుగా దేవదత్తుని గృహాంగణంలో చేరారు. అందరికీ జయచంద్రుడూ, దేవదత్తుడూ, తగిన రీతిగా సమాధానాలిచ్చి పంపించారు. చంద్రావతి పరుగుపరుగున వచ్చి, వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నను కౌగలించుకున్నది. దేవదత్తుడు ఆమె తల నిమురుతూ కన్నీళ్లు తుడిచి ఊరడించాడు. చిత్రలేఖను చూపించి పరిచయం చేశాడు. చంద్రావతి ఆమెను ప్రేమగా కౌగలించుకొని లోపలికి తీసుకుపోయింది.

మరునాటి ఉదయం దేవదత్తుడు చిలక సలహా ప్రకారం తన సోదరిని కూడా వెంట బెట్టుకుని రథం ఎక్కి రాజసభకు వెళ్లాడు. అతన్ని, అతని చేతిలో ఉన్న చిలకను చూడటానికని పౌరులంతా రాజవీధిలో బారులు తీర్చి నిలబడ్డారు. రాజసభ అంతా మంత్రి సామంతాదులతో, పౌర వృద్ధులతో నిండిపోయింది. విక్రమసేనుడు సింహాసనం అధిష్టించి దేవదత్తుని రాక కోసం ఎదురు చూస్తున్నాడు. అతాడు సభలోకి రాగానే గౌరవ పురస్సరంగా ఆహ్వానించాడు. రణవర్మ మాత్రం దేవదత్తుణ్ణి చూసి ముఖం ముటముటలాడించుకున్నాడు.

దేవదత్తుడు తానూ మహాకాళి దేవాలయంలో సిద్ధుణ్ణి చూసింది మొదలుకుని, విక్రమార్కుని ఖడ్గం సంపాదించటం, సిద్ధుణ్ణి సంహరించటం, సింహగిరికి ప్రయాణమై పోవటం, జయచంద్రుడు మేఖలావతిలో తనను కలుసుకోవటం, సింహగిరి కోటలో సింహకేతుని సంహరించటం, కాశ్మీర రాకుమారిని, మాట్లాడే చిలకను తీసుకుని తిరిగి రావటం మొదలైన సమస్త వృత్తాంతమూ మహారాజుకు విన్నవించాడు.

"మహారాజా! మేము తోటమాలి బిడ్డలమని ఇప్పటి దాకా అనుకుంటున్నాము. కాదని సిద్ధుడు చెప్పాడు. ఎవరి బిడ్డలమో చెప్పమంటే చెప్పలేదు. సింహగిరిపై ఉన్న చిలక నడిగితే చెబుతుంది అన్నాడు అదే ఈ చిలక. కాని ఈ చిలకను నేనెన్నిసార్లడిగినా ఇంకా సమయం రాలేదు. అని దాటేస్తూ వచ్చింది. ఇప్పుడు సమయం వచ్చిందట. మీకొలువు కూటంలో, మీ సమక్షంలో సమస్త పౌరులూ వింటుండగా నా జన్మ రహస్యం చెబుతానని అన్నది. అందుకే నేను ఈ చిలకను వెంటబెట్టుకుని వచ్చాను. ఈమె నా చెల్లెలు చంద్రావతి. చిలకా! ఇప్పుడైనా చెబుతావా నీ రహస్యం?"

సభాస్తరులంతా దేవదత్తుని కథ నోరు తెరుచుకుని, రెప్పవాల్చ కుండా ఊపిరి బిగపట్టుకుని విన్నారు. ఇంద్రచాప శకలం వలె సప్తవర్ణాలతో ప్రకాశించే ఈ అపూర్వ అద్భుతకీరం మానవభాషలో ఎలా మాట్లాడుతుందీ, ఏం మాట్లాడుతుందీ, ఏ రహస్యం వెల్లడిస్తుందీ అని ఉత్కంఠతో తహతహలాడిపోసాగారు. సభ అంతా సూది పడవేస్తే పిడుగు లాగ శబ్దమయ్యేటంత నిశ్శబ్దంగా ఉంది.

మృదుమధుర స్వరంతో చిలక ఇలా అన్నది.

"రహస్యం వెల్లడించే ముందు ఒక షరతు."

"ఏమిటది?" అన్నాడు దేవదత్తుడు ఆత్రుతగా.

"నేను రహస్యం వెల్లడించిన తరవాత నా పంజర ద్వారం తెరవాలి. నన్ను నా దారిన స్వేచ్ఛగా పోనివ్వాలి. సిద్ధుని చేతిలో చిక్కి, సింహకేతుని చేతిలో చిక్కి అనేక సంవత్సరాలుగా పంజరవాసం అనుభవిస్తున్నాను. నేను స్వేచ్ఛాజీవిని. అనంతాకాశంలో అనంతకాలంలో నా యిష్టం వచ్చినట్లు నేను సంచారం చేయాలి.ఆ స్వేచ్ఛ కూడా లేకపోతే నా అనంత జీవితం దుర్భరమవుతుంది."

"అలాగే" అన్నాడు దేవదత్తుడు.

"వినండి. మహారాజా! జాగ్రత్తగా విను. శాంతంగా ఎలాంటి ఉద్రేకం లేకుండా, గుండె నిబ్బరం చేసుకుని విను. ఇంతకాలమూ నీకు పిల్లలు లేరనీ, నీ తరవాత రాజ్యానికి వారసులు లేరనీ వాపోతున్నావు కదూ, నీ చింత తీరింది. నువ్వు పుత్రవంతుడవు పుత్రీవంతుడవు. ఈ దేవదత్తుడు నీ కుమారుడు, ఈ చంద్రావతి నీ కుమార్తె.

వృద్ధుడైన మహారాజు ఈ మాటలు వింటూనే సింహాసనంపై కొయ్యబారిపోయాడు. సభాసదులందరూ త్రుళ్లిపడి గుసగుసలాడ సాగారు. దేవదత్తుడూ, చంద్రావతీ ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ అచేతన ప్రతిమల్లాగైపోయారు. జయచంద్రుడు ఆశ్చర్యం నుంచి ఆనందంలోకీ, ఆనందం నుంచి ఆశ్చర్యంలోకీ పచార్లు చేస్తున్నాడు. రణవర్మ మాత్రం నిశ్చలంగా తీవ్రంగా చూస్తూ.

"నీ మాటలకు నిదర్శనం?" అని చిలుకలను ప్రశ్నించాడు. ఈలోగా మహారాజు తెప్పరిల్లాడు. "అవును, నిదర్శనం?" అని ఆయన హీనస్వరంతో అడిగాడు.

చిలక ఇరవై రెండేళ్ల క్రితం జరిగిన వృత్తాంతమంతా పూసగ్రుచ్చినట్లు వివరించింది. పెద్దరాణులిద్దరూ తమకు పిల్లలు లేరనే మనస్తాపంతో మూడోరాణిపై ఎలా ఈర్ష్య వహించారో, ఆమెకు కలిగిన ఇద్దరు శిశువులనూ ఎలా నదిలో వదిలిపెట్టారో, ఆ శిశువులను సుజనమిత్రుడు చేరదీసి ఎలా పెంచాడో అంతా వివరించింది.

నేను త్రికాలవేదిని. నాకు తెలియని రహస్యం ప్రపంచంలో ఏదీ లేదు. అబద్ధమాడవలసిన అగత్యం నాకు లేదు. ఈ చిన్నవారి జన్మ రహస్యం నాకు మాత్రమే తెలుసు. సుజనమిత్రుడు వీరిని పెంచి పెద్ద చేశాడే కాని వీరి తల్లితండ్రులెవరో అతనికి తెలియదు. అంతఃపురంలో అన్ని భోగాలూ అనుభవిస్తూ కూడా తాము చేసిన పాపకార్యానికి బ్రతికి ఉండగానే మానసికంగా యమ బాధలు అనుభవిస్తున్న పెద్ద రాణులకు తాము మూడోరాణి బిడ్డలను నదిలో వదలిపెట్టామని మాత్రమే తెలుసు గాని, ఆ పిల్లలు బ్రతికి ఉన్నారనీ, వారే వీరని తెలియదు. అయినా వారిని పిలిచి అడగండి. వారు చేసిన దుష్కార్యం ఒప్పుకుంటారో లేదో చూడండి.

మహారాజా! నువ్వు కేవలం వెర్రివాడివి. నీలాంటి వెర్రివాడికి రత్నాల్లాంటి ఈ శిశువులు జన్మించటం నీ అదృష్టం. ఎంత వెర్రివాడివి కాకపోతే మనిషికి కుక్కపిల్లలు పుడతాయా? అంత సులభంగా, నిజా

నిజాలు కనుక్కుందామనే ఆలోచనైనా లేకుండా నీ పెద్ద రాణుల మాటలు నమ్మేశావా? పాపం నీ మూడో రాణి చీకటి చెరసాలలో పద్దెనిమిదేళ్ళనుంచీ మగ్గిపోతోంది. ఆమెకు విముక్తి కలిగించు. ఆమెకు ఆమె కన్నపిల్లల్ని చూపించు. ఆమెను ఆదరించు. ఈ చిన్నవారిని స్వీకరించు" అని చిలక చెప్పింది.

మహారాజు వెంటనే పెద్దరాణు లిద్దర్నీ పిలిపించాడు. వారు తమ నేరం ఒప్పుకున్నారు. క్షమించమని మహారాజు పాదాలపై పడ్డారు. మరణదండన విధించకుండా వారిని క్షమించి మహారాజు వారికి దేశబహిష్కారం విధించాడు.

మూడోరాణిని చెరసాల నుంచి విడిపించాడు. దేవదత్తుడూ, చంద్రావతీ మూర్తీభవించిన శోకదేవతలా ఉన్న తల్లిని, పద్దెనిమిదేళ్లు కారాగారంలో కుమిలి కుమిలి ఏడ్చిన ఆ వృద్ధురాలిని "అమ్మా" అని కౌగలించుకుని ఏడ్చారు. ఆమె తను పడిన బాధంతా క్షణంలో మరిచి పోయి మళ్ళీ మామూలు మనిషైంది. వృద్ధరాజు ఆనందంతో మళ్ళీ మూర్ఛపోయాడు. మూర్ఛనుంచి లేవగానే ఉన్న పళంగా దేవదత్తుడికి యువరాజ్య పట్టాభిషేకం జరిపించాడు.

అప్పటిదాకా దేవదత్తుణ్ణి హీనంగా చూసిన మహామంత్రి రణవర్మ దేవదత్తుడి చేతులు పట్టుకుని "క్షమార్హణ" అని పశ్చాత్తాపం పొందాడు.

కొద్ది రోజుల్లో ఒకనాడు చిలకపెట్టిన ఒక మంచి ముహూర్తాన చిత్రలేఖా దేవదత్తులకు,చంద్రావతీ జయచంద్రులకువివాహాలు జరిగాయి.

---

ప్రణయం పరిణయంగా పర్యవసించింది. ఆ ఉత్సవాలతో ఉజ్జయినీ నగరమంతా పెళ్లిపందిరిగాభాసించింది. అన్నదానాలు,విందులు, వినోదాలు జరిగాయి. హరిదాసులు హరి కథలు చెప్పారు. నటులు నాటకాలాడారు. గాయకులు గానం చేశారు. కవులు చిత్ర, బంధ, గర్భకవిత్వాలు ప్రదర్శించారు. ఇంకా ఎన్నో వేడుకలు జరిగాయి.

ఈ వేడుకలు చూస్తూ దేవదత్తుడు చిత్రలేఖా కూర్చుని ఉండగానే, ఎవరూ చూడకుండా జయచంద్రుడు చంద్రావతిని తను కోసం ఏర్పాటు చేసిన చంద్రికా ధౌత హార్మ్యోపరితలానికి లాక్కుపోయాడు. విశాలమైన ఆ నిరుపహతి స్థలంలో మల్లెలు, సన్నజాజులు చల్లిన హంసతూలికా పర్యంతం ఆ శరత్కాలపు వెన్నెల దారులలో వారిని ఏ సుఖస్వర్గాల సరిహద్దులకో తీసుకు పోవడానికి వచ్చిన పల్లకీలాగా ఉన్నది "చంద్రావతీ!" అన్నాడు జయచంద్రుడు.

"ప్రాణేశ్వరా?" అన్నది చంద్రావతి. ఇద్దరూ విరగబడి నవ్వుకున్నారు. "ఛా, అలాంటి మాటలనకు నాకు బాగుండదు. ప్రాణేశా, గీణేశా ఇలాంటి మాటలు పాతకాలపు పురాణ నాయికలనేవారు. మోటమనుషులూ, మోటకాలమూ... ఈ రోజుల్లో భార్యాభర్తలు ఒకరినొకరు పేర్లతోనే పిలుచుకోవాలి." అన్నాడు జయచంద్రుడు.

"జయచంద్రా!" అన్నదామె.

"వతీ!" అన్నాడతడు.

"అదేమిటి?" అన్నదామె.

“నా పేరు చివర ‘వతీ’ అని చేరిస్తే ఇద్దరి పేర్లూ కలిసి వస్తాయి. అంటే నేను నీలోనూ, నీవు నాలోనూ ప్రవహిస్తావన్నమాట,” అన్నాడు జయచంద్రుడు.

“భావం అద్భుతంగా లేదు” అన్నది చంద్రావతి. ఇద్దరూ నవ్వుకున్నారు. వన్నెలహరి నవ్వులతో మరింత తెల్లబడింది.

❖ ❖ ❖

ఇప్పటికి ఈ కథ అయిపోయింది. ఇది జరిగిన కథా అన్న ప్రశ్నే లేదు. ఏ కథా ఎప్పుడూ ఎక్కడా జరగదు. కాని ప్రతి కథా ఎప్పుడో ఎక్కడో జరిగే ఉంటుంది. కనీసం జరగటానికి వీలుంటుంది.

ఆ రోజులు పోయాయి. ఆ రాజులు పోయారు. ఆ రోజుల్లో రాజకుమారులు గుర్రాలెక్కి, సాహసాలు చేస్తూ, దేశాలు తిరిగేవారు, వారికి రాక్షసు లెదురయ్యేవారు. మాంత్రికు లెదురయ్యేవారు. అతిలోక సౌందర్యం గల రాజకుమార్తెలు వారిని చూసిచూడగానే ప్రేమించేవారు ఆ రాజకుమార్తెలను పెళ్ళి చేసుకోవటానికి ప్రేమించేవారు. ఆ రాజకుమార్తెలను పెళ్ళి చేసుకోవటానికి రాజకుమారులు రాక్షసులను, మాంత్రికులను ఎదుర్కొని సంహరించేవారు. వారికి మాట్లాడే చిలకలు, మాయ తివాచీలు, కీలుగుర్రాలు మోకాల్లోతున దొరికేవి. కథాంతంలో వారు రాజకుమార్తెలను పెళ్ళాడి సుఖంగా ఉండేవారు.

ఇప్పుడు ఆ రోజులూ లేవు, ఆ రాజులూ లేరు. ఇన్ని శతాబ్దాల పొగమంచు తెరల్లోంచి చూస్తే ఆ రోజులు తెల్లని మేలిముసుగు ధరించిన

అమ్మాయి ముఖంలాగా ఏదో తెలియని ఆకర్షణతో మన్ని ముగ్ధుల్ని చేస్తాయి. అది తీయరాని మేలిముసుగు అది స్పష్టాస్పష్టమైన ముఖం. అందుకే అంత ఆకర్షణ.

గడుస్తున్న రోజులకంటే గడిచిన రోజులెప్పుడూ బావుంటాయి. గడుస్తున్న రోజులు కూడా గడిచిన తరవాత బావుంటాయి. గడిచిన దెప్పుడూ సగం సత్యం, సగం స్వప్నం కనుక అది స్వర్ణయుగం లాగ కనిపిస్తుంది. అటువంటి స్వర్ణయుగంలో ఇలాంటి కథలు ఎన్నైనా జరగటానికి వీలుంది.

# నండూరి రామమోహనరావు పుస్తకములు




## విశ్వదర్శనం

(పాశ్చాత్య చింతన)

నండూరి రామమోహనరావు


వెల : రూ. 250/-


## విశ్వదర్శనం

(భారతీయ చింతన)

నండూరి రామమోహనరావు

వెల : రూ. 250/-




## నరావతారం

నండూరి రామమోహనరావు


వెల : రూ. 125/-

## విశ్వరూపం

నండూరి రామమోహనరావు

వెల : రూ. 250/-




## అక్షరయాత్ర

సాహిత్య వ్యాసాలు మరికొన్ని...

నండూరి రామమోహనరావు

వెల : రూ. 50/-

కాపీల కొరకు సంప్రదించండి :

## శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో

డోర్.నెం. 30-17-3ఎ, వారణాశి వారి వీధి,
సీతారామపురం, విజయవాడ - 2. ఫోన్ : 2444156